SUNDAY

# విశాలాంధ్ర

స్థాపితం : 1952

అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 , సంచిక : 221

ఆదివారం 03-02-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | విజయవాడ ప్రచురణ





## టెన్షన్ వద్దు.. అటెన్షన్ చాలు

- ఒత్తిడిని ఎదుర్కొందాం
- జీవితాలకు అదే కొలమానం కాదు
- విజయమంటే పరీక్షలే కాదు..

రాహుల్, రోహిత్, స్వప్న, షీనా వీరందరూ ఒకేచోట పెరిగిన పిల్లలు. ఆటపాటల్లో చిన్నతనం నుంచీ ఒకే స్కూలులో, క్లాసులో పోటాపోటీగా చదువుకునే స్నేహితులు,..ఈ ఏడాది వీరందరికీ టెన్త్, ఇంటర్ పరీక్షల సమయం దగ్గరకు వచ్చింది. తమ భవిష్యత్తును నిర్ణయించే ఈ పరీక్షలతో వీరందరిలోనూ టెన్షన్ కొట్టొచ్చినట్లు కనిపించింది. వీరితోపాటు పేరెంట్స్‌లోనూ ఒకటే హడావుడి..తమకంటే ఇంట్లో మరింత టెన్షన్ వాతావరణం ఉందని చెబుతున్నారు..వీరిలో ఇద్దరు మాత్రం చాలా ప్రశాంతంగా ఉండగా ఇద్దరిలో పరీక్షల భయం ఉన్నట్లుగా స్పష్టంగా తెలుస్తోంది. కష్టపడి విజయం సాధిస్తామని పిల్లలు అనుకోవడం సహజమే...కానీ మరీ ఒత్తిడి ఎక్కువైతే జ్ఞాపకశక్తిపై ప్రభావం చూపుతుందని మానసిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

7 లో

Sunday Special





## పొదుపు... హోదా... కొత్త చిట్కాలు

- సమాజంలో మారుతున్న ధోరణులు
- కొన్ని విలాసాలకు చెక్..
- అవసరమైనంత వరకే ఖర్చులు

ఒకప్పుడు విలాసవంతమైనది...అందరికీ ఉండేదికాదు. తమ కార్లలో తాము ఒక్కరే విలాసంగా వెళ్లడం ఫ్యాషన్‌గా ఉండేది. సమాజంలో స్టేటస్ సింబల్‌గా తలంచేవారు...తాము సొంతంగా కారు నడపడం కన్నా డ్రైవర్ ఉంటే మరింత గొప్ప అనుకునేవారు. కారు మెయిన్‌టైన్ చేస్తున్నారంటే గొప్పగా ఉండేది..అటువంటిది ఈ మధ్య ట్రెండ్ మారింది. పెరుగుతున్న ఖర్చులు, భారమవుతున్న పెట్రోల్, డీజిల్ రేట్లతో ఖర్చులు తగ్గించుకుంటూనే జీవితాన్ని విలాసవంతంగా గడిపేందుకు మొగ్గుచూపిస్తున్నారు.

7 లో

# అప్పుల బండ

## ఒక్కో తలపై @ రూ.75,375.52 భారం



| దేశం అప్పుల వివరాలు<br>అప్పు రకం | మార్చి 31, 2019 (రూ.కోట్లలో) | మార్చి 31, 2020 (రూ.కోట్లలో) |
|---|---|---|
| అంతర్గత రుణం, ఇతర అప్పులు | 87,97,766.30 | 95,29,549.00 |
| విదేశీ రుణం | 2,58,959.18 | 2,68,269.18 |
| మొత్తం | **90,56,725.48** | **97,97,818.18** |

- 2019-20 బడ్జెట్‌లో అంచనా
- 2019 మార్చినాటికి రూ.69,667.11
- మొత్తం రుణాలు రూ.97,97,818 లక్షల కోట్లు

న్యూఢిల్లీ :
సాధారణ ఎన్నికలకు ముందు ప్రజలపై వరాల జల్లు కురిపించిన కేంద్ర బడ్జెట్.. ప్రజలపై భారీ అప్పునే ఉంచింది. ఎన్నికల్లో ఓట్ల కోసం మోడీ సర్కార్ తాయిలాలు ప్రకటించింది. ఎన్నికలకు రెండు నెలల ముందు విధానపరమైన నిర్ణయాలు చేయటం రాజకీయ పార్టీలలో కలకలం సృష్టిస్తోంది. పార్లమెంట్‌లో ఇన్‌చార్జి ఆర్థికశాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రతిపాదించిన రూ. 27.84 లక్షల కోట్ల బడ్జెట్‌లో వచ్చే ఏడాది మార్చి 31నాటికి రూ.97,97,818 కోట్ల అప్పు ఉంటుందని అంచనా వేశారు. ఈ ప్రకారంగా చూస్తే ఒక్కొక్కరిపై రూ.75,375.52 అప్పు ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అదే ఈ ఏడాది మార్చికైతే రూ.90,56,725 కోట్ల అప్పు ఉంటుండగా, ఒక్కొక్కరిపై రూ.69,667.11 అప్పు ఉండొచ్చని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. కేంద్ర ప్రభుత్వాలు ఓట్ల కోసం ఏటా జనాకర్షక పథకాలు అమలు చేస్తుండటంతో దేశం అప్పుల్లో కూరుకుపోతోంది. ఈ ఏడాది నుంచి ఐదెకరాలలోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులకు రూ.6 వేలు ఆర్థిక సహాయం చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం రూ.75 వేల కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించింది. గతేడాది డిసెంబరు నుంచి అమలు చేయనున్న ఈ పథకం కోసం ఈ సంవత్సరానికి రూ.20 వేల కోట్లను కేటాయించింది. గత బడ్జెట్‌లో ముంబై - అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ కోసం రూ.లక్ష కోట్లను కేటాయించింది. ఇలా ఎన్నికలున్న రాష్ట్రాలపై వరాల జల్లు కురిపించిన మోడీ సర్కార్..మధ్యంతర బడ్జెట్ పేరుతో పూర్తి బడ్జెట్‌నే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. 2019-20 వార్షిక బడ్జెట్ ప్రకారం ఈ ఏడాది మార్చి 31నాటికి రూ.90,56,725 కోట్లు, వచ్చే ఏడాది మార్చి 31నాటికి రూ.97,97,818 కోట్ల అప్పు ఉంటుందని కేంద్రం అంచనా వేసింది. ఇందులో అంతర్గత అప్పులు రూ.87,97,766 కోట్లు (2019 మార్చి 31), రూ.95,29,549 (2020 మార్చి 31) ఉండగా, విదేశీ

- మిగతా 2 లో



## అన్యాయం చేస్తే అంతే..

- రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు
- మళ్లీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి
- ఆశీర్వదించాలని మహిళలకు వినతి
- కేసరపల్లి పసుపు - కుంకుమ పండుగలో చంద్రబాబు

విశాలాంధ్ర - గన్నవరం :
తప్పుడు సర్వేలతో ప్రజలను మభ్యపెట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వాటిని నమ్మవద్దని సీఎం చంద్రబాబు కోరారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన వారికి, కుట్రలు, కుతంత్రాలు చేసిన వారికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో పసుపు - కుంకుమ, పింఛన్ల పంపిణీ ఉత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు బహిరంగ సభలో మాట్లాడుతూ సర్వేలు చూసి ప్రతిపక్ష వైసీపీ సంబరపడుతోందని, రానున్న ఎన్నికల్లో టీడీపీ ఓడిపోదని స్పష్టం చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం వల్ల రైతులకు నీరందించామని, పేదలకు ఎన్‌టీఆర్ గ్రామీణ గృహనిర్మాణం పేరుతో పక్కా గృహాలు నిర్మించామన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి తాను పిలుపు

- మిగతా 2 లో

### హైకోర్టు కొత్త భవనం నేడు ప్రారంభం



3 లో

### మోడీకి ప్రత్యామ్నాయం

ఆర్‌ఎస్‌ఎస్ తర్జనభర్జన

9 లో

### ఇదీ లోకం!






## గాల్లో మేడలు కాదు కోటలే..!

హద్దులు మీరిన 'మోడీ' బడ్జెట్

రైతులకు లబ్ధి ప్రశ్నార్థకం

జయతి ఘోష్

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ తాత్కాలిక బడ్జెట్ (ఓట్ ఆన్ అకౌంట్)ను అస్త్రంగా మలుచుకునేందుకు మోడీ ప్రభుత్వం యత్నిస్తుందని అందరూ ఊహించారు. రైతులకు పెద్దపీట వేస్తుందని, ఆర్థిక, సామాజిక సంక్షేమ పథకాలు ప్రకటిస్తుందని అనుకున్నారు. ఇదే విషయమై రాజకీయ వర్గాల్లో చర్చోపచర్చలు జరిగాయి. కానీ, ఈ విధంగా

- మిగతా 2 లో

## మోడీకి మహిళాఘాతం

- విపక్షాలను కూడగడుతున్న మాయ, మమత
- కాంగ్రెస్ క్రియాశీల రాజకీయాల్లోకి ప్రియాంక
- మహిళా ఓటర్లపై ప్రభావం చూపనున్న నేతలు
- ఎన్‌డీఏ గెలుపు అవకాశాలకు పెద్ద గండమే
- ఆందోళన చెందుతున్న బీజేపీ శ్రేణులు

ప్రియాంకాగాంధీ, మమతా బెనర్జీ, మాయవతి... ఈ మహిళాత్రయం ప్రభావం ఎన్‌డీఏ రెండోసారి అధికారంలోకి వచ్చే అవకాశాలను దెబ్బతీయనుంది. తాజా సర్వేలలో స్వల్ప మెజార్టీ వస్తుందని అంచనా వేయగా, ప్రియాంక రాజకీయ అరంగేట్రం కూటమి ఆశలను ఆవిరి చేయనుంది. ఫైర్ బ్రాండ్స్ మమతా బెనర్జీ, మాయావతి నుంచి ప్రధాని మోడీ పెను సవాల్‌ను ఎదుర్కోనున్నారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌తోపాటు పలు రాష్ట్రాల్లో మహిళా ఓటర్లను ఈ ముగ్గురు మహిళా నేతలకు ఓట్లు కురిపించే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ పండితుల అంచనా.



న్యూఢిల్లీ :
ఈసారి ఎన్నికలు ప్రధాని మోడీకి ముచ్చెమటలు పట్టించటం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే బీజేపీయేతర పక్షాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి ఎన్‌డీఏ సర్కార్‌కు సవాల్ విసురుతున్నాయి. ఇది చాలదన్నట్లుగా ముగ్గురు మహిళా నేతల వల్ల ఎన్‌డీఏ కూటమి మరోసారి అధికారంలోకి రావటం కష్టమేనన్న సంకేతాలు వస్తున్నాయి. సుదీర్ఘకాలం దేశాన్ని పాలించిన నెహ్రూ కుటుంబం నుంచి ప్రియాంకాగాంధీ వాద్రా ప్రత్యక్ష రాజకీయాల్లో దిగగా, ఇప్పటికే రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తున్న పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం

- మిగతా 2 లో



### సీబీఐ కొత్త ఛీఫ్ రిషి కుమార్ శుక్లా

న్యూ ఢిల్లీ :
కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ కొత్త డైరెక్టర్‌గా రిషి కుమార్ శుక్లా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ నిర్ణయం తీసుకొంది. శుక్లా నియామకాన్ని కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదించింది. అయితే, కమిటీ సభ్యుడు, ప్రతిపక్ష నేత మల్లిఖార్జునఖర్గె ఈ నియామకంపై అసమ్మతి తెలిపారు. 1983 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ ఆఫీసర్ శుక్లా రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఆయన మధ్యప్రదేశ్ డీజీపీగా పనిచేశారు. మోడీ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ శుక్లా నియామకానికి ఆమోదం తెలిపింది. ఈ పోస్ట్‌కు 1984 బ్యాచ్‌కు చెందిన జావేద్ అహ్మద్, రజనీకాంత్ మిశ్రా, ఎస్ఎస్ దేశ్వాల్ పేర్లు కూడా వినిపించాయి. వివాదాలతో మసకబారిన సీబీఐకు పూర్వ

- మిగతా 2 లో

## అరకొర విదిలింపులు

- ప్రాధాన్యం అంటూనే ఎసరు
- కొత్త మార్గాలు, ట్రాఫిక్ సౌకర్యాలకు కోత
- మొత్తం కేటాయింపులో 3 శాతం మాత్రమే పెరుగుదల
- ఇదీ దక్షిణ మధ్య రైల్వేకు బడ్జెట్ కేటాయింపుల తీరు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి :
సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మధ్యంతర బడ్జెట్‌లో రైల్వే శాఖ దక్షిణ మధ్య రైల్వేకు అరకొర కేటాయింపులతో సరి పెట్టింది. 2018-19 బడ్జెట్‌లో రూ. 5,752 కోట్లు కేటాయించగా, 2019-20 బడ్జెట్‌లో రూ. 5,924 కోట్లు కేటాయించింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అదనంగా రూ. 172 కోట్లు (3) శాతం ఎక్కువ నిధులు ఇచ్చినట్లయింది. మొత్తం రైల్వే బడ్జెట్‌పరంగా గత ఏడాదితో పోలిస్తే 21 శాతం అధిక నిధులు సమకూర్చింది. ఈశాన్య రాష్ట్రాలకు గత ఏడాది కంటే 21 శాతం నిధులు అధికంగా మంజూరు చేసిన కేంద్రం..రెండు తెలుగు రాష్ట్రాలకు 3 శాతం మాత్రమే కేటాయించి మరోసారి తీరని అన్యాయం

- మిగతా 2 లో



## బొకో హరమ్ బీభత్సం : నైజీరియాలో 60మంది మృతి



రన్ (నైజీరియా) : నైజీరియాలో బొకో హరమ్ రెచ్చిపోయింది. రన్ నగరంలో 60 మందిని బలిగొంది. దశాబ్దకాలంలో ఇంతటి దారుణానికి ఆ ఉగ్రసంస్థ ఒడిగట్టిన దాఖలు లేవు. నైజీరియా సైనికులను పట్టణంలో నుంచి వెళ్లగొట్టి మరోసారి తమ ఉనికిని చాటుకునేందుకు బొకోహరమ్ ఈ మారణహోమం సృష్టించినట్టు తెలిసింది. ఈ దాడిని తీవ్రంగా ఖండించిన అమ్నెస్టీ ఇంటర్నేషనల్ నైజీరియా డైరెక్టర్ ఒసై ఒజిఘో దోషులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని అన్నారు. ఆయన అల్ జజీరా పత్రికతో మాట్లాడుతూ 'పౌరులపై ఈ తరహా దాడులు యుద్ధనేరాలకు దారితీయొచ్చు. ఇందుకు కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. దాడి ముందురోజు నైజీరియా సైనికులు తమ పోస్టులను విడిచి వెళ్లారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. నిరాయుధ ప్రజలను కాపాడవలసిన సైనికులు ఈ తరహాలో వ్యవహరించడం.. విధి నిర్వహణలో అధికారుల వైఫల్యానికి అద్దంపడుతోందని ఒజిఘో ఆగ్రహం వ్యక్తంచేశారు.

## ఇండోనేసియాలో భూకంపం

### రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 6.1గా నమోదు



పదాంగ్ : పశ్చిమ ఇండోనేసియాలోని మెంటవాయిలో శుక్రవారం భూకంపం సంభవించింది. దీని తీవ్రత 6.1గా నమోదైంది. సుమత్రా ప్రావిన్స్‌లోని మెటవాయి, త్వాపేజట్, పదాంగ్ ప్రాంతాల్లో భూమి కంపించడంతో ప్రజలు భయంతో పరుగులు తీశారు. 'రెండుసార్లు భూకంపం వచ్చిందని, ప్రకంపనలు కొనసాగాయని, తమ ఇళ్లు కదులుతుండటంతో బయటకు పరుగులు తీశామని పదాంగ్ వాసి ఒకరు తెలిపారు. అయితే ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీకాలేదు. భారీగా ఆస్తి నష్టం జరిగినట్టు అంచనాలు ఉన్నప్పటికీ ప్రాణనష్టం జరిగిన దాఖలాలు లేవు అని అధికారులు తెలిపారు. గతేడాది భూకంపానికి 2,200 మంది బలైన విషయం తెలిసిందే.

## ఐఎన్ఎఫ్ నుంచి అమెరికా నిష్క్రమణ



వాషింగ్టన్: రష్యాతో కుదుర్చుకున్న ఇంటర్మీడియట్ రేంజ్ న్యూక్లియర్ ఫోర్సెస్ (ఐఎన్ఎఫ్) ఒప్పందం నుంచి వైదొలగుతున్నట్లు అమెరికా ప్రకటించింది. రష్యా ఈ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని, అందుకే వైదొలుగుతున్నామని ఆ దేశ విదేశాంగ మంత్రి మైక్ పాంపియో తెలిపారు. అమెరికా 30ఏళ్లుగా ఈ ఒప్పందానికి కట్టుబడి ఉండగా, రష్యా ఉల్లంఘనలకు పాల్పడుతోంది. అందుకే నిష్క్రమిస్తున్నామని ఆయనన్నారు. వైదొలిగే ప్రక్రియ శనివారం ప్రారంభం కాగా మరో ఆరు నెలల పాటు కొనసాగుతుందని, రష్యా ఈలోగా తాను తయారుచేసిన ఆయుధాలను నాశనం చేసి రాజీకి వస్తుందని భావిస్తున్నామని చెప్పారు.

## క్షీణించిన షరీఫ్ ఆరోగ్యం..

### ఆస్పత్రికి తరలింపు



ఇస్లామాబాద్ : అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఏడేళ్ల కారాగార శిక్షను అనుభవిస్తున్న పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్ ఆరోగ్యం క్షీణించడంతో శనివారం ఆయనను ఆసుపత్రికి తరలించినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. లాహోర్‌లోని కోట్ లాఖ్‌పట్ జైల్ నుంచి షరీఫ్‌ను ఆసుపత్రికి తరలించేందుకు పంజాబ్ ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్టు జియో న్యూస్ వెల్లడించింది. 69ఏళ్ల షరీఫ్ జనవరిలో జ్వరం, తలనొప్పితో పాటు ఒళ్లు నొప్పులతో బాధపడగా ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త నమూనాలను సేకరించి జిన్నా ఆసుపత్రికి పంపగా హృద్రోగి అయిన షరీఫ్‌కు సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించాలని అక్కడి వైద్యులు సూచించారు. దీంతో జనవరి 22న పంజాబ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్డియాలజీ (పీఐసీ)లో షరీఫ్‌కు పూర్తి స్థాయి వైద్య పరీక్షలు నిర్వహింగా ఆయన గుండె ఉండాల్సిన దాని కంటే పెద్దగా ఉన్నట్లు తేలింది. ఓ వైపు క్షీణిస్తున్న ఆరోగ్యం మరోవైపు బీపీ, డయాబెటిక్స్‌కు సంబంధించిన మందులను మార్చారన్న అభియోగాల నేపథ్యంలో షరీఫ్‌ను ఆసుపత్రిలో చేర్చడం మంచిదని వైద్యుల బృందం సూచించింది. ఈ క్రమంలోనే దేశానికి మూడుసార్లు ప్రధానిగా వ్యవహరించిన వ్యక్తి ఆరోగ్యాన్ని ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ఆయన వైద్యనివేదికలను కుటుంబసభ్యులకు ఇవ్వకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నట్టు పీఎంఎల్-ఎన్ అధికార ప్రతినిధి మరియన్ ఔరంగజేబ్ ఒక ప్రకటనలో తెలిపారు. అనారోగ్యం కారణంగా షరీఫ్ బెయిల్ పిటిషన్‌పై విచారణను ఫిబ్రవరి 6కు వాయిదా వేస్తున్నట్టు జనవరి 28న ఇస్లామాబాద్ హైకోర్టు వెల్లడించింది. నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో (ఎన్ఏబీ) అకౌంటబిలిటీ కోర్టు, కోట్ లాఖ్‌పట్ జైలు సూపరింటెండెంట్‌లను ప్రతివాదాలుగా పేర్కొంటూ షరీఫ్ తరఫు ఆయన న్యాయవాది ఖ్వాజా హారిస్ శనివారం పిటిషన్ దాఖలు చేశారు. తనకు విధించిన శిక్షను సవాల్ చేస్తూ దాఖలు చేసిన ఫిర్యాదుపై తగు నిర్ణయం వెలువడేంతవరకు అల్ అజిజియా స్టీల్ మిల్స్ కార్పొరేషన్ వ్యవహారంలో అకౌంటబిలిటీ కోర్టు తనకు విధించిన ఏడేళ్ల జైలుశిక్షను రద్దు చేయాలని మాజీ ప్రధాని కోర్టుకు విన్నవించారు. ఆయన పిటిషన్‌పై ఈనెల 18న విచారణ జరగనుంది.

## 'ఎమర్జెన్సీ' దిశగా ట్రంప్ అడుగులు !

### గోడ నిర్మాణం కోసమే..



వాషింగ్టన్ : అమెరికా-మెక్సికో సరిహద్దులో గోడ నిర్మించాలని గట్టి పట్టుదలతో ఉన్న దేశాధ్యక్షుడు ట్రంప్ అందుకోసం అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ)ని ప్రకటించాలని యోచిస్తున్నారు. స్టేట్ ఆఫ్ ది యూనియన్ (ఎస్ఓటీయూ) ప్రసంగానికి ముందుగా ఈ మేరకు నిర్ణయం తీసుకోవచ్చన్న సంకేతాలిస్తున్నారు.

' మనం దానిని (ఎమర్జెన్సీ ప్రకటన) అమలు చేసేందుకు ఇదే సదవకాశం' అని ట్రంప్ అన్నట్లు ది హిల్ వార్తాసంస్థ పేర్కొంది. మంగళవారం జరగనున్న ఎస్ఓటీయూ కార్యక్రమాన్ని వేదికగా గోడ నిర్మాణానికి సంబంధించి మరిన్ని ప్రణాళికలను వెల్లడిస్తానని శ్వేతసౌధంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ట్రంప్ అన్నారు. ఆ రోజు తన ప్రసంగాన్ని దేశప్రజలు శ్రద్ధగా వినాలని సూచించారు. గోడ నిర్మాణం విషయంలో రాజీ ప్రక్రియను ' సమయం వృధా'గా అభివర్ణించిన ట్రంప్.. గోడ నిర్మాణాన్ని అడ్డుకుంటున్నందుకు డెమోక్రాట్లు తగు మూల్యాన్ని చెల్లించక తప్పదంటూ జోస్యం చెప్పారు. 'ఇది రాజకీయంగా మంచిదని అనుకోవడం లేదు.. అనేకమందిని బాధపెడుతున్నందుకు నాన్సీ పెలోసి (డి-కలిఫ్) సిగ్గుపడాలి' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈనెల 15లోగా గోడ నిర్మాణానికి అనుకూలంగా నిర్ణయం రాకపోతే ప్రభుత్వాన్ని మరోసారి స్తంభింపజేస్తానని, అవసరమైతే దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తానని ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే.

## వియత్నాంలో ట్రంప్-కిమ్ భేటీ ఖరారు



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ రెండో సమావేశానికి వియత్నాంలోని దా నంగ్ నగరం వేదిక కానున్నది. ఈనెల చివర్లో వీరిద్దరి భేటీ దాదాపు ఖరారైందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అయితే ట్రంప్ అజెండా ఖరారు కాలేదన్నారు. ట్రంప్, కిమ్ మరోసారి భేటీకానున్నట్టు జనవరి 18న శ్వేతసౌధం వర్గాలు ప్రకటించాయి. అణునిరాయుధీకరణకు సంబంధించి ఉత్తర కొరియా నాయకుడు కిమ్ యాంగ్ చోల్‌తో జరిపిన చర్చల అనంతరం ఈ ప్రకటన వెలువడింది. అమెరికా-ఉత్తర కొరియా రెండో శిఖరాగ్రత సమావేశం నేపథ్యంలో అమెరికా ప్రత్యేక ప్రతినిధి ఆదివారం ఉత్తర కొరియాకు వెళ్లి ఉత్తర కొరియాతో పాటు దక్షిణ కొరియా ప్రత్యేక ప్రతినిధులతో భేటీకానున్నారు. అమెరికా ప్రతినిధి స్టీఫెన్ బీగన్, దక్షిణ కొరియా ప్రత్యేక ప్రతినిధి లీ డో-హూన్ సియోల్‌లో సమావేశమవుతారు. అణునిరాయుధీకరణపై తదుపరి కార్యాచరణపైనా ఆయన ఈ సందర్భంగా చర్చించనున్నట్టు తెలిసింది. ఈ విషయంలో స్టీఫెన్ స్పందిస్తూ 'ఉత్తర కొరియాపై దండయాత్ర చేయడం లేదు.. తమ అణు కార్యాక్రమాల గురించి సమగ్రంగా వివరించమనే కోరుతున్నాం' అని అన్నారు. రాజీ కుదరకపోతే ఏం చేయాలన్నదానిపై అమెరికా స్పష్టతతో ఉందని ఆయన తెలిపారు. గతేడాది జూన్‌లో అమెరికా, ఉత్తరకొరియా మధ్య చారిత్రక శిఖరాగ్రత సమావేశం సింగపూర్‌లో జరిగిన విషయం తెలిసిందే.



## ఆస్ట్రేలియాకు వరదపోటు

క్వీన్స్‌లాండ్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఆస్ట్రేలియాను వరదలు ముంచెత్తాయి. ఐదు రోజులుగా ఇదే పరిస్థితి ఉండటంతో టౌన్స్‌విల్లే నగరం జలదిగ్బంధంలో ఉంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానికులు పడవల సాయంతో సురక్షిత ప్రాంతాలకు చేరుకుంటున్నారు. ప్రభుత్వ సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో రెండు హెచ్చరించింది. క్వీన్స్‌లాండ్‌కు వరద పోటెత్తే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తూ, సహాయక చర్యలను వేగవంతం చేసింది.

## అన్యాయం చేస్తే అంతే..

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటం పల్లే రైతులు 34 వేల ఎకరాల భూమిని ఇచ్చారన్నారు. అదే మరోకరైతే వంద ఎకరాల్లో రాజధానికి శంకుస్థాపన చేసి వదిలేసేవారని వ్యాఖ్యానించారు. ప్రజలు తనపై పెట్టిన నమ్మకాన్ని ఎట్టి పరిస్థితిలోనూ ఒమ్ము చేసేదిలేదని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు పార్టీ నేతల వద్దకు వెళ్లాల్సిన పనిలేదని, వాళ్లే వస్తారని తెలిపారు. తనపై ఉన్న నమ్మకం వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా మోసం చేసిన బీజేపీని నమ్మవద్దని, అన్యాయం చేసిన పార్టీకి పుట్టగతులుండవని హెచ్చరించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.80 వేల కోట్లు రావాలని జనసేన నేత పవన్ కల్యాణ్ చెప్పారని తెలిపారు. తెలంగాణ సీఎం కేసీఆర్, వైసీపీ నేత జగన్ కలసి నాటం ఆడుతున్నారని, కోడికత్తి కేసు ద్వారా ప్రభుత్వంపై బురద జల్లాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలో అత్యవసరర పరిస్థితి నెలకొందని, కుట్రలు, కుతంత్రాలు చేసిన వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఐదేళ్లపాటు రాష్ట్రం, ప్రజల కోసం శ్రమించాను, మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తేనే మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో చేసిన తప్పును కాంగ్రెస్ గ్రహించిందని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

**బాధలను చూసే పింఛన్ల పెంపు**

పాదయాత్ర సమయంలో రాష్ట్ర ప్రజల బాధలను ప్రత్యక్షంగా చూశానని, అందుకే అధికారంలోకి రాగానే పింఛన్లను ఐదు రెట్లు పెంచినట్లు చంద్రబాబు తెలిపారు. మొన్నటి వరకు రూ.వెయ్యిగా ఉన్న పింఛన్లను రెట్టింపు చేశానని చెప్పారు. మహిళలందరికీ న్యాయం జరిగిందని నమ్మితే మనస్ఫూర్తిగా టీడీపీని ఆశీర్వదించాలని కోరారు. డ్వాక్రా సంఘాల ద్వారా పొదుపు ఉద్యమానికి తానే శ్రీకారం చుట్టానన్నారు. డ్వాక్రా మహిళలకు పసుపు - కుంకుమ కింద మూడు దశలలో రూ.10 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద 94 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. తన పాలనలో సంతృప్తి చెందారని భావిస్తే టీడీపీని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. అన్ని వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ గౌరవంగా జీవించాలన్నదే తన లక్ష్యమన్నారు. సంక్షేమ పథకాల అమలులో దళారుల ప్రమేయం లేకుండా ఉండేందుకు బయోమెట్రిక్ విధానం ప్రవేశపెట్టినట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు ఏడాదికి రూ.6 వేలు ఆర్థిక సాయం ప్రకటించిందని, నాలుగేళ్ల కిందటే రూ.1.50 లక్షలు చొప్పున రుణమాఫీ చేశామని సీఎం చెప్పారు. పట్టిసీమ ద్వారా కృష్ణా, గోదావరి నదులను అనుసంధానం చేయడంతో సాగునీటి సమస్యను పరిష్కరించామని తెలిపారు. పెథాయ్ తుఫాన్ వల్ల రంగుమారిన ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 9వ తేదీన రాష్ట్రంలో ఒకేరోజు నాలుగు లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు.

**కృష్ణా కలెక్టర్‌కు ప్రశంసలు**

కృష్ణాజిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నందుకు కలెక్టర్ బీ లక్ష్మీకాంతంపై చంద్రబాబు ప్రశంసల జల్లు కురిపించారు. జిల్లాలో ప్రజల సంతృప్తి 80 శాతంగా ఉందన్నారు. అన్ని రంగాల్లోనూ కృష్ణా అగ్రస్థానంలో ఉండటం గర్వకారణమని తెలిపారు. అంతకుముందు చంద్రబాబు గన్నవరం రైతుబజార్‌ను ప్రారంభించగా, అన్న క్యాంటీన్ శంకుస్థాపనలో భాగంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వశాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను చంద్రబాబు పరిశీలించారు. కార్యక్రమంలో గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్, మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మచిలీపట్నం ఎంపీ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, జడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## మోడీకి మహిళాఘాతం

(మొదటిపేజీ తరువాయి)

మాయావతి రూపంలో మోడీ ఇబ్బందులను ఎదుర్కొనక తప్పేటట్టులేదని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. మరో రెండు మూడు నెలల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలు ప్రధాని మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏకు అగ్ని పరీక్షగా మారనున్నాయి. ముగ్గురు మహిళలు మోడీకి సవాల్ విసురుతుండటంతో ఈసారి రాజకీయాలు ఆసక్తికరంగా ఉంటాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. గతేడాది జనవరిలో కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లోకి ప్రవేశించిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మనుమరాలు, సోనియాగాంధీ కుమార్తె ప్రియాంకా గాంధీకి ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ యూపీ తూర్పు ప్రాంత బాధ్యతలు అప్పగించారు. దేశంలోనే పెద్ద రాష్ట్రమే కాకుండా అత్యధికంగా 80 పార్లమెంట్ స్థానాలు ఆ రాష్ట్రంలో ఉన్నాయి. ఇప్పటికే ఆ రాష్ట్ర మాజీ సీఎంలు మాయావతి, అఖిలేష్ యాదవ్ పొత్తు కుదుర్చుకున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకు సీట్ల పంపకాలు కూడా పూర్తయ్యాయి. ముగ్గురు మహిళా నేతలు కీలకమైన ప్రతిపక్షంలో ఉండటంతో ఎన్నికల్లో మోడీకి మహిళాఘాతం తప్పేటట్టు కనిపించటం లేదు. దేశ జనాభాలోనే కాకుండా ఓటింగ్‌లోనూ సగానికిపైగా ఉన్న మహిళలను తమవైపు తిప్పుకోవటంలో ప్రియాంకా గాంధీ వాద్రా, మమతా బెనర్జీ, మాయావతి సమర్థులనే వ్యాఖ్యలున్నాయి. ఇటీవల కొన్ని సర్వేలలలో ఎన్‌డీఏ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో మహిళాత్రయం ఎన్‌డీఏ గెలుపుపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తారని సీనియర్ రాజకీయ వేత్త, కేంద్ర మాజీ ఆర్థికశాఖ మంత్రి యశ్వంత్ సిన్హా అభిప్రాయపడ్డారు. గత సంవత్సరం డిసెంబరులో జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ఘోరంగా ఓడింది. ఇది కూడా బీజేపీని కలవరానికి గురి చేస్తోందన్న వ్యాఖ్యలు ఉన్నాయి. ప్రధానంగా ప్రియాంకా గాంధీ రాజకీయ ప్రవేశం దేశంలో పెను మార్పులకు సంకేతమని మీడియాలో కథనాలు వచ్చాయి. మాజీ ప్రధాని ఇందిరాగాంధీని పోలి ఉండటంతో ఆమెకు ప్రజాకర్షణ పెరిగింది. ప్రియాంక గాంధీతో పోల్చితే మాయావతి, మమతా బెనర్జీకి రాజకీయంగా అపార అనుభవం ఉంది. విపక్ష కూటమి ప్రధాని పదవికి వీరిద్దరి పేర్లూ వినిపిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో వరుసగా రెండోసారి తృణమూల్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత మమతా బెనర్జీదే. రెండుసార్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి పదవిని అలంకరించారు. ఇటీవల కోల్‌కతాలో విపక్షానికి చెందిన 25 రాజకీయ పార్టీలో భారీ బహిరంగ సభను నిర్వహించి సక్సెస్ అయ్యారు. దళితులలో మంచి పట్టున్న బీఎస్పీ నేత మాయావతి, ముస్లిం మైనార్టీలు, బీసీలలో పట్టున్న ఎస్పీతో పొత్తు కుదుర్చుకోవటం రానున్న ఎన్నికల్లో బీజేపీ ఓట్లకు గండిపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో బీజేపీ శ్రేణులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో మహిళా సంక్షేమానికి కేటాయింపులు పెంచినా, ప్రియాంక, మాయా, మమతా బెనర్జీ ప్రభావం దెబ్బేసన్న వ్యాఖ్యలు వ్యక్తమవుతున్నాయి. ప్రియాంకా గాంధీ ప్రభావం అన్ని రాష్ట్రాల్లో ఉండనుండగా, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్‌లో మమత, మాయావతి చక్రం తిప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## అరకొర విదిలింపులు

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. అదీకాక కొత్త రైలు మార్గాలు, ట్రాఫిక్ సౌకర్యాల నిధుల్లో భారీగా కోత విధించింది. ఇదే సమయంలో రైలు మార్గాల డబ్లింగ్, ప్రయాణీకుల సదుపాయాలకు మాత్రం నిధులను పెంచింది. ఈ ఏడాది కొత్త మార్గాల నిర్మాణానికి సగానికిపైగా నిధులను కోత విధించింది. గత ఏడాది కొత్త మార్గాల నిర్మాణానికి రూ. 1,757.70 కోట్లను కేటాయించిన ఆశాఖ ఈ సంవత్సరం రూ. 834 కోట్లతో సరిపెట్టింది. దీంతో గతేడాదితో పోలిస్తే రూ. 923.70 కోట్లు తక్కువ నిధులు మంజూరు చేసినట్లయింది. ట్రాఫిక్ సదుపాయాలకు గత ఏడాది బడ్జెట్‌లో రూ. 210.77 కోట్లు ఇస్తే, ఈ ఏడాది రూ. 138 కోట్లే మంజూరు చేసింది. డబ్లింగ్ పనులకు రూ. 1,905 కోట్లు కేటాయించగా, గత ఏడాది రూ. 1,653.62 కోట్లు ఇచ్చింది. ప్రయాణీకులకు కల్పించవలసిన మౌలిక సదుపాయాల పరంగా గత ఏడాది రూ. 120.03 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ. 229 కోట్లు సమకూర్చింది. మోడీ ప్రభుత్వం ప్రాధాన్య ప్రాజెక్టులుగా ప్రకటించిన పలు మార్గాల డబ్లింగ్, ట్రిప్లింగ్, విద్యుద్దీకరణ పనులకు ప్రాజెక్టు అంచనాలతో కేటాయింపులు పోలిస్తే అరకొరగా ఉన్నాయి. దీంతో ఆయా ప్రాజెక్టులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి. సరుకు రవాణాకు దోహదం చేసే మూడో మార్గం నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ ఈ సారి దువ్వాడ-విజయవాడ సెక్షన్ మధ్య మూడో మార్గం నిర్మాణానికి నిధుల మంజూరు కాలేదు.

**బైపాస్ మార్గాల నిర్మాణానికి రూ. 143 కోట్లు**

దక్షిణ మధ్య రైల్వేలో పలు జంక్షన్ల వద్ద బైపాస్ మార్గాల నిర్మాణానికి రూ.143 కోట్లను కేంద్రం కేటాయించింది. విజయవాడ వద్ద 19.5 కి.మీ., కాజీపేటలో 10.65 కి.మీ., రేణిగుంటలో 9.6 కి.మీ., వాడిలో 7.6 కి.మీ., గుత్తిలో 3.8 కి.మీ. మేర బైపాస్ మార్గాలను ఈ మొత్తంతో నిర్మించనుంది. తెలంగాణలోని చెర్లపల్లి స్టేషన్‌ను శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేసేందుకు రూ. 5 కోట్లు, కాజీపేటలో పీరియాడిక్ ఓవర్-హాలింగ్ వర్క్‌షాప్ కోసం రూ. 10 కోట్లు, కర్నూలు వద్ద మిడ్‌లైఫ్ రిహేబిలిటేషన్ ఫ్యాక్టరీ కోసం రూ. 80 కోట్లు, తిరుపతి రైల్వే స్టేషన్‌లో రెండవ ప్రవేశ మార్గం ఏర్పాటుకు రూ. 12.45 కోట్లు, తిరుచానూర్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ. 6 కోట్లను కేటాయించింది. ఇంకా గుంతకల్లు-కల్లూరు మార్గం డబ్లింగ్‌కు రూ. 15 కోట్లు, అక్కన్నపేట్-మెదక్ కొత్త మార్గం నిర్మాణానికి రూ. 10 కోట్లు, ఓబులవారిపల్లె-కృష్ణపట్నం కొత్త మార్గానికి రూ. 30 కోట్లు, ముద్‌ఖేడ్-పర్బని డబ్లింగ్‌కు రూ. 34.50 కోట్లు, గుంటూరు-తెనాలి డబ్లింగ్, విద్యుద్దీకరణ ప్రాజెక్టుకు రూ. 5 కోట్లను మంజూరు చేసింది.

ప్రస్తుతం పనులు జరుగుతున్న భారీ ప్రాజెక్టులకు కేటాయింపులు ఈవిధంగా ఉన్నాయి.( రూ. కోట్లలో)

| ప్రాజెక్టు | పొడవు(కిమీ) | అంచనా వ్యయం | ఈ బడ్జెట్‌లో కేటాయింపు |
|---|---|---|---|
| నడికుడి-శ్రీకాళహస్తి కొత్త మార్గం | 309 | 2,450 | 700 |
| కడప-బెంగళూరు కొత్త మార్గం | 255 | 2,030 | 210 |
| గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ | 443 | 3,631 | 280 |
| కాజీపేట-బలార్షా మూడోమార్గం | 202 | 2,063 | 265 |
| భద్రాచలం-సత్తుపల్లి కొత్త మార్గం | 56 | 704 | 405 |
| మునీరాబాద్-మహబూబ్‌నగర్ కొత్త మార్గం | 246 | 645 | 275 |
| మనోహరాబాద్-కొత్తపల్లి కొత్త మార్గం | 150 | 1,160 | 200 |
| విజయవాడ-భీమవరం-నిడదవోలు డబ్లింగ్ | 221 | 1.504 | 175 |
| కోటిపల్లి-నరసాపూర్ కొత్త మార్గం | 57 | 2,120 | 200 |
| సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ డబ్లింగ్ | 85 | 728 | 200 |
| విజయవాడ-గూడూరు మూడోమార్గం | 287 | 3,246 | 350 |
| కాజీపేట-విజయవాడ మూడోమార్గం | 219 | 1,857 | 110 |
| గుత్తి-ధర్మవరం డబ్లింగ్ | 219 | 636 | 126 |



## రిషి కుమార్ శుక్లా

(మొదటిపేజీ తరువాయి)

వైభవాన్ని తీసుకురావడం ప్రస్తుతం ఆయన ముందున్న అతిపెద్ద సవాలు. అంతకుముందు ప్రధాని మోడీ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ రెండు సార్లు సమావేశమైనప్పటికీ తదుపరి సీబీఐ బాస్‌ను ఎంపికచేయడంలో నిర్ణయం తీసుకోలేదు. కేంద్రం ప్రతిపాదించిన పేర్లను కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గే వ్యతిరేకించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. సీబీఐ డైరెక్టర్ నియామకానికి 30 మంది పేర్లను కేంద్ర ప్రభుత్వం సూచించింది. నిజాయితీ, సీనియరిటీ, అవినీతి కేసులను ఛేదించిన అనుభవం ఉన్న ఐదుగురి ఐపీఎస్ పేర్లను ఖర్గే సూచించారు. 1982, 83,84,85బ్యాచ్‌లకు చెందిన 79 మంది పేర్లను జనవరి 24న సమావేశం ముందుంచారు.

## అప్పల బండ

(మొదటిపేజీ తరువాయి)

అప్పులు రూ.2,58,959 (2019 మార్చి 31), రూ.2,68,269 (2020 మార్చి 31)గా ఉన్నట్లు బడ్జెట్‌లో కేంద్రం ప్రతిపాదించింది. అంతర్గత అప్పుల్లో రుణాలు, బాండులపై తీసుకున్న అప్పులు ఉన్నాయి. ట్రెజరీ బిల్లులు, రాష్ట్ర ప్రభుత్వాలు, బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులు ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. చిన్న మొత్తాల పొదుపు, ప్రావిడెంట్ ఫండ్స్, ఐడీబీఐ, బ్యాంకులు, యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా, ఆయిల్ కంపెనీలు, ఎరువుల కంపెనీలు, ఎఫ్‌సీఐకు జారీ చేసిన సెక్యూరిటీలు, ఇతర డిపాజిట్ పథకాలపై తీసుకున్న అప్పులు కూడా ఇందులో ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. వీటితోపాటు అంతర్జాతీయ ద్రవ్యసంస్థల నుంచి కూడా అప్పులు తీసుకోవడంతో ప్రజలపై మోయలేని భారం పడుతోంది. ఇప్పటికే పలు రకాల పన్నులు చెల్లించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటే, కేంద్ర ప్రభుత్వమే వయస్సుతో సంబంధంలేకుండా ఒక్కొక్కరిపై ఏకంగా రూ.75,375.62 కోట్ల అప్పుల భారాన్ని మోపటం గమనార్హం.

## గాల్లో మేడలు కాదు కోటలే..!

(మొదటిపేజీ తరువాయి)

హద్దులు మీరి భారీ బడ్జెట్‌ను ప్రతిపాదిస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. తాత్కాలిక బడ్జెట్ అంటే సమీప భవిష్యత్తులో ఖర్చునకు తీసుకొనే చర్యలతో కూడి ఉంటుంది. అదిగాక.. దిగిపోయే ప్రభుత్వం పెద్ద పెద్ద హామీలు ఇవ్వడం, ప్రకటనలు చేయడం రాజ్యాంగానికి విరుద్ధం. ఇవేమీ పట్టనట్లుగా మోడీ ప్రభుత్వం భారీ బడ్జెట్‌ను ప్రతిపాదించింది. ఏ మాత్రం జంకు, బెదురు లేకుండా హామీల వర్షం కురిపించింది. 2019-20 బడ్జెట్ వ్యయాన్ని పెంచింది. ఆదాయపు పన్ను విధానాలను సవరించింది. అనేక రాయితీలు ప్రకటించింది. అయితే ఇవన్నీ ఆచరణలో కార్యరూపం దాల్చుతాయా అన్నది ప్రధాన ప్రశ్న. అదేసమయంలో వీటికి న్యాయబద్ధత, రాజ్యాంగబద్ధత ఉంటుందా అన్నది ప్రశ్నార్థకం. బడ్జెట్ ప్రకటనలు రైతులకు లబ్ధి చేకూరుస్తాయా? చారిత్రకమంటూ సన్న, చిన్నకారు రైతులకు ఆదాయ బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టడం సత్ఫలితాలిస్తుందా? ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) అన్నదాతను ఆదుకుంటుందా? అన్న ప్రశ్నలు ప్రస్తుతం కీలకంగా మారాయి. 2 హెక్టార్ల వరకు సాగుభూమి ఉన్న రైతులకు ఏడాదికి రూ.6వేల ఆర్థిక సాయం అందిస్తామని ప్రభుత్వం హామీనిచ్చింది. ఈ నగదును నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తామని, రూ.2వేలు చొప్పున మూడు విడతల్లో అందిస్తామని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వాలతో సంబంధం లేకుండా మొత్తం కేంద్రప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించింది. ఈ పథకం 12కోట్ల మంది చిన్న, సన్నకారు రైతులకు లబ్ధి చేకూరుస్తుందని పేర్కొంది. అయితే ప్రభుత్వం ఈ సంఖ్యను 2015, 16 వ్యవసాయ లెక్కల ఆధారంగా చెప్పినట్లుగా ఉంది. ఈ సంఖ్యనే పరిగణనలోకి తీసుకుంటే..2019-20లో వచ్చే ప్రభుత్వం వార్షికంగా రూ.75వేల కోట్లను రైతుల కోసం ఖర్చు చేయాలి. అయితే, ఈ లావాదేవీలను వేగవంతం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందాలని భావిస్తున్న అధికార పార్టీ 2018, డిసెంబరు 1 నుంచి ఈ పథకం అమలవుతుందని ప్రకటించింది. అంటే ఈ ఏడాది మార్చి 31 నాటికి తొలి విడత చెల్లింపులు జరగాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ మేరకు నగదు బదిలీకిగాను రూ.20వేల కోట్లను కేటాయించినట్టు బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో ఆర్థికమంత్రి వెల్లడించారు. రూ.75వేల కోట్లు అన్నది పెద్ద మొత్తమే.. అయితే ప్రతిపక్షాలు చెప్పినట్లుగా ప్రతి రైతు కుటుంబానికి నెలకు కేవలం రూ.500 లేదా రోజుకు రూ.16.67 చొప్పున అందుతుంది. కుటుంబమంటే కనీసం ఐదుగురు సభ్యులు ఉంటారు. మరి ఇంత తక్కువ సాయమందిస్తే అది వారికి ఏ మాత్రం చాలదు. రూ.75వేల కోట్లు తక్కువ కానప్పటికీ దేశవ్యాప్తంగా పంటల సాగుకయ్యే సగటు ఖర్చు కంటే తక్కువే. ఓ రైతు వరి, గోధుమలు పండిస్తే హెక్టార్‌కు ఏడాదికి కనీసం రూ.70వేలు వరకు ఖర్చు అవుతుంది. అదే రెండు హెక్టార్లకు లక్షా40వేల రూపాయలు ఖర్చు అవుతాయి. ఈ క్రమంలో రైతులకు వార్షికంగా రూ.6వేలు ఇవ్వడం వల్ల వారికి ఎలాంటి ప్రయోజనం ఉండదు. మరోవిధంగా చెప్పాలంటే వారిని అవమానించినట్లు ఉంటుంది. ఈ క్రమంలో పథకం అమలుపై ఎన్నో సందేహాలు, ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ క్రమంలో మొదటి అంశం రైతులను గుర్తించడం.

భూములున్న వారితో పాటు సన్నకారు రైతులకూ ఈ పథకం వర్తిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. అయితే అది ఆచరణలో ఎలా జరుగుతుందన్నది ప్రశ్నార్థకం. ఎందుకంటే చాలా రాష్ట్రాల్లో కౌలు రికార్డులు లేవు. మహిళా రైతులకు గుర్తింపు లేదు. భూముల వివరాలూ అస్తవ్యస్తంగా ఉంటాయి. దస్తావేజులపై యజమాని పేరుపై స్పష్టత ఉండదు. ఇన్ని సమస్యలు ఉండగా, వీటిని పరిష్కరించకుండా పథకాన్ని అమలు చేయడం, ముఖ్యంగా మార్చి నాటికి తొలి విడత సాయం అందించడం సాధ్యం కాదు. కేవలం నెలరోజుల్లో సమస్యలను పరిష్కరించడం కుదరదు. అలాగే ముందుకు సాగితే భూ దస్తావేజుల్లో పేర్లు ఉన్న వారు తప్ప అసలు రైతుకు లబ్ధి చేకూరదు. తెలంగాణలోనూ అదే జరిగింది. అయితే, ఆ రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) విజయానికి 'రైతు బంధు' పథకమే దోహదపడింది. కానీ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా పథకం రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఉపయోగపడదు. భూ హక్కుల సమస్యల పరిష్కారం, నీటి ఎద్దడి, రుణమాఫీ, కనీస మద్దతు ధర, యంత్రాలు, పంట బీమా, సబ్సిడీలు, సహజ- ఆర్థిక విపత్తుల నుంచి రక్షణ, మెరుగైన వాణిజ్య ఒప్పందం వంటి అనేక డిమాండ్ల పరిష్కారానికి ఇప్పటికే దేశవ్యాప్తంగా అనేక ర్యాలీలు, ధర్నాలు, ప్రదర్శనలు, నిరసనలను రైతులు నిర్వహించారు. కానీ వీటిలో ఏ ఒక్కదానినీ ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో పరిగణనలోకి తీసుకున్నట్టు లేదు. పంట రుణాలకు సంబంధించి నాబార్డ్ వాటాల మూలధనం కేటాయింపుల్లో కోత విధించింది. 2017-18లో మొత్తం ఖర్చు రూ.3,380 కోట్లు కాగా 2018-19 బడ్జెట్‌లో కేటాయించినది రూ.3,500 కోట్లు. అందులో ఖర్చు చేసినది కేవలం రూ.2వేలు. వచ్చే ఏడాదికి మరింత కోతవేస్తూ రూ.1,500గా నిర్ణయించారు. రైతులు, గ్రామీణ ప్రజలకు సంబంధించి ఇతర రంగాల్లోనూ నిధుల ఖర్చులో ఇదే తరహా పిసినారితనం కనిపిస్తోంది. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిధుల కొరత వెంటాడుతోంది. అరకొర కేటాయింపులు సరిపోక గతేడాదికి సంబంధించి ఇప్పటికే చాలా పెద్దమొత్తంలో బకాయిలు ఉన్నాయి. కేటాయించిన రూ.55వేల కోట్లు డిసెంబరు నాటికే ఖర్చు అయ్యాయి. అనంతరం స్వల్ప పెంపుతో రూ.61వేల కోట్లు కేటాయించారు. దీనినిబట్టి రాష్ట్రప్రభుత్వాలకు చెల్లించాల్సిన బకాయిలను కేంద్రప్రభుత్వం చెల్లించదని అర్థమవుతుంది. ఈ క్రమంలో కార్యక్రమానికి సంబంధించిన ఖర్చుల్లో కోతలు పడతాయి. కూలీల చెల్లింపులో జాప్యం జరుగుతుంది. వీటన్నింటికీ మించి ఎనిమిది రాష్ట్రాల్లో తీవ్ర కరవు పరిస్థితిని మరింత జటిలంగా మారుస్తుంది.

మొత్తానికి మోడీ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రైతుల కోసం చేసిన ప్రకటనలు కేవలం జుమ్లాల ఆధారితమైనవిగా తోస్తున్నాయి తప్ప వాస్తవ ఖర్చులు, పటిష్ట విధానాలను సూచించడం లేదు. దీనివల్ల రాజకీయంగా కొంత లబ్ధి జరిగి ఉండవచ్చుగానీ అది కొనసాగే పరిస్థితి లేదు. ఈ బడ్జెట్ ఎట్టిపరిస్థితుల్లోనూ రైతులకు ఊరటనిచ్చేదిగా, వచ్చే ఎన్నికల్లో వారి ఆమోదాన్ని పొందేదిగా ఉండదు.

రచయిత్రి - ఎకనామిక్స్ ప్రొఫెసర్, జవహర్ నెహ్రూ యూనివర్సిటీ

## ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై
# ముఖ్యమంత్రికి సీపీఐ రామకృష్ణ లేఖ

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :** ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకొని సమ్మెను నివారించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం సీఎం చంద్రబాబుకి లేఖ రాశారు. ఆర్టీసీలోని 9 కార్మిక సంఘాలలో మొత్తం 8 కార్మిక సంఘాలు జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి తమ న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం ఫిబ్రవరి 6 నుంచి సమ్మెకు సిద్ధమవుతున్నాయి. నష్టాలు చవిచూస్తున్న ఆర్టీసీకి ఈ సమ్మె మరింత భారంగా పరిణమించనుంది. సమ్మె కారణంగా లక్షలాది మంది ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది.దీంతో సమ్మెను నివారించడానికి సమస్యలను పరిష్కరించాలని ఆయన లేఖలో కోరారు. ప్రస్తుతం ఏపీఎస్ ఆర్టీసీలో 53 వేల మంది ఉద్యోగులు రోజుకు 65 లక్షల మందికి పైగా ప్రయాణీకులను చేరవేస్తున్నారు. డీజిల్ రేట్ల పెరుగుదల, ప్రైవేటు అక్రమ రవాణా తదితర కారణాలతో ఆర్టీసీ నాలుగేళ్లుగా రు.3,126 కోట్ల నష్టాల్లో కూరుకుందని, ఈ పరిస్థితుల్లో సంస్థను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. 2017 ఏప్రిల్ 1 నుంచి ఆర్టీసీ ఉద్యోగుల వేతనాలను సవరించలేదు. 2013 వేతన సవరణ బకాయిలు చెల్లించలేదు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు 64శాతం ఫిట్‌మెంట్ డిమాండ్ చేస్తుండగా, ఆర్టీసీ ఉద్యోగులు సంస్థ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా 50శాతం మాత్రమే అడుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెనిర్ణయానికి వచ్చారని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వరంగంగా గుర్తిస్తామని ప్రకటించి, కమిటీ వేసినప్పటికీ ఈనాటి వరకు నివేదిక రాలేదు. నష్టాల పేరుతో సిబ్బంది కుదింపు యోచన విడనాడి, డీజిల్ పెరుగుదల భారాన్ని ప్రభుత్వమే సబ్సిడీగా భరించాలని, అక్రమరవాణా అరికట్టి, 10 ఏళ్ల టాక్స్ హాలిడే ప్రకటించి, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కార్మికులు డిమాండు చేస్తున్నారు. దీంతోపాటు కార్మికులకు రిటైర్మెంట్ వయసు 60 సంవత్సరాలకు పెంచి, ఆర్టీసీలో అద్దె బస్సులు, జోనల్ విధానాన్ని పూర్తిగా రద్దుచేయాలనిచ ఆర్టీసీకి ప్రస్తుత అవసరాల నిమిత్తం బడ్జెట్‌లో రు.3,720 కోట్లు కేటాయించాలనే డిమాండ్లతో కార్మిక సంఘాల జేఏసీ సమ్మెకు సిద్ధమైనందున, సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపట్టి సమ్మె విరమణకు ప్రభుత్వం కృషి చేయాలని రామకృష్ణ లేఖలో కోరారు.

## విభజన హామీలు తుంగలోకి
### ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజి

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** విభజన చట్టంలో హామీలను కేంద్రప్రభుత్వం తుంగలో తొక్కిందనీ, నవ్యాంధ్ర అభివృద్ధిని అడ్డుకున్న కేంద్రప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజి పిలుపునిచ్చారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మాలమహానాడు జాతీయ కార్యవర్గ సమావేశం సంఘం జాతీయ అధ్యక్షులు ధనరాశి శ్యామ్‌సుందర్ అధ్యక్షతన శనివారం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కారెం శివాజి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం దళితుల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోందన్నారు. అనేక సంక్షేమకార్యక్రమాలను నిర్వహిస్తూ దళితుల ఆర్థిక ఉన్నతికి కృషి చేస్తోందన్నారు. సామాజిక పింఛన్లను రెట్టింపు చేసి పేదలను ఆదుకుందన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ఆధ్వర్యంలో నిలబడే అభ్యర్థులకు మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని తీర్మానించారు. ఏపీలో దళితులను విచ్ఛిన్నం చేసే కుట్రతో ఎన్నికల బరిలో నిలబడే అభ్యర్థులకు తగిన గుణపాఠం చెప్పాలని తీర్మానించారు. అమరావతిలో నిర్మాణంలో ఉన్న 125 అడుగుల ఎత్తుగల డాక్టరు బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని త్వరితగతిన నిర్మించాలని కోరారు.

# మందకొడిగా ఈ-క్రాప్

- రబీకి 15.83లక్షల హెక్టార్ల వివరాలు
- పెండింగ్‌లో మరో నాలుగులక్షల హెక్టార్ల వివరాలు
- నత్తనడకన అప్‌లోడింగ్ ప్రక్రియ
- ప్రకృతి వైపరీత్యాలలో సమాచారం కీలకం



**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** రాష్ట్రంలో ఈ-క్రాప్(ఈ-పంట) నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. తరచూ సర్వర్లు మొరాయించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఆంధ్రప్రదేశ్‌లో ఈఏడాది రబీ సీజన్‌లో దాదాపు 20లక్షల హెక్టార్లలో పంటలను సాగు చేశారు. దీనిలో వరి, జొన్న, మొక్కజొన్న, కందులు, మినుములు, పెసలు, వేరుశనగ, శనగ, మిర్చి వంటి పంటలున్నాయి. గత అక్టోబరు తొలి వారం నుంచి రబీ సీజన్ ఆరంభమైంది. సీజన్ మొదలై నాలుగునెలలు ముగిసినప్పటికీ ఈ-క్రాప్ నమోదు పూర్తికాలేదు. ఇప్పటివరకు కేవలం 15.83లక్షల హెక్టార్లలో పంటల వివరాలను నమోదు చేయగలిగారు. దాదాపు నాలుగు లక్షల హెక్టార్లలో పంటల వివరాలను నమోదు చేయాల్సి ఉంది. అయితే ట్యాబ్‌ల ద్వారా వివరాలను నమోదు చేసే సమయంలో సర్వర్లు తరచూ మొరా యించడంతో క్రతువు ముందుకు సాగడంలేదు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ అధికారులు సంయుక్తంగా దీన్ని నిర్వహిస్తున్నారు. పైగా సిబ్బంది కూడా పలు పనుల్లో తలమునకలై ఉండటంతో కూడా కొంత జాప్యం జరుగుతోంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటలకు నష్టం వాటిల్లినప్పుడు, వివిధ తెగుళు ఆశించినప్పుడు కూడా పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీలను వీటి వివరాల ఆధారంగానే ఇస్తున్నారు. కొన్ని పంటలకు కనీస మద్దతు ధరలు లభించనప్పుడు ప్రభుత్వం ఇచ్చే బోనస్ సొమ్ములను కూడా దీనిలో ఉన్న వివరాల ప్రకారమే ఇవ్వాల్సిఉంటుంది. ఈనేపథ్యంలో ఈ-క్రాప్ నమోదు అత్యంత కీలకం అయ్యింది.

**ఐదుజిల్లాల్లో అత్యధికంగా నమోదు**

రాష్ట్రంలో ఐదు జిల్లాల్లో ఈ-క్రాప్ నమోదు అత్యధికంగా ఉంది. విజయనగరం జిల్లాలో 111శాతం, విశాఖపట్నంజిల్లాలో 107శాతం, చిత్తూరు జిల్లాలో 102శాతం, కృష్ణాజిల్లాలో 99శాతం, ప్రకాశం జిల్లాలో 99శాతం నమోదు అయ్యింది. బృందాలు వేగంగా పనిచేయడంతో ఈ జిల్లాల్లో ప్రక్రియ వేగంగా ఉంది.

**నాలుగు జిల్లాల్లో అథమం**

రాష్ట్రంలో నాలుగు జిల్లాల్లో ఈ-క్రాప్ నమోదు అథమంగా ఉంది. పశ్చిమగోదావరిజిల్లాలో 2.46లక్షల హెక్టార్ల పంటల వివరాలను నమోదు చేయాల్సి ఉండగా 96వేల హెక్టార్ల వివరాలను మాత్రమే నమోదు చేయగా ఇంకా 50వేల హెక్టార్ల వివరాలను నమోదు చేయాల్సి ఉంది. దీంతో 39శాతం నమోదు పూర్తయింది. గుంటూరుజిల్లాలో 1.22లక్షల హెక్టార్ల వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉండగా 65వేల హెక్టార్ల పంటల వివరాలను నమోదు చేశారు. ఇంకా 57వేల హెక్టార్ల వివరాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక్కడ 54 శాతం పూర్తయింది. నెల్లూరుజిల్లాలో 1.39లక్షల హెక్టార్ల వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉండగా 80వేల హెక్టార్ల వివరాలను నమోదు చేయగా, 59వేల హెక్టార్ల వివరాలను నమోదు చేయాలి. ఇక్కడ 57శాతం నమోదు జరిగింది. తూర్పుగోదావరిజిల్లాలో 1.79లక్షల హెక్టార్లకుగాను 1.40లక్షల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. ఇంకా 39వేల హెక్టార్లను నమోదు చేయాల్సి ఉంది. ఇక్కడ 79శాతం నమోదైంది. ఈ నాలుగు జిల్లాల్లో ప్రక్రియ పూర్తిగా నత్తనడకన సాగుతోంది. కర్నూలు, అనంతపురం, కడప, శ్రీకాకుళం జిల్లాల్లో 98శాతం పూర్తయిందని మరో 10రోజుల్లో ఇక్కడ నమోదు పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు.



## రేపట్నుంచి ప్రత్యేక హోదా భరోసా యాత్ర : రఘువీరా

**విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:** ప్రత్యేక హోదా భరోసా యాత్రను ఈనెల 4వ తేదీ నుంచి చేపట్టనున్నట్లు ఏపీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి తెలిపారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనంతపురము నుంచి శ్రీకాకుళం వరకూ 84 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో భరోసా యాత్ర ఉంటుందన్నారు. యాత్రలో ప్రతి రోజూ ఢిల్లీ నుంచి కాంగ్రెస్ నాయకులు పాల్గొంటారని ఆయన వివరించారు. ఎన్నికల సన్నద్ధత కోసం మూడ్రోజుల పాటు పీసీసీ కార్యవర్గ సమావేశాలు నిర్వహించామన్నారు. సమావేశాల్లో తీసుకున్న కీలక నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఈనెల 7నుంచి 10వరకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తులను కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీకి పంపిస్తామని, ఈ నెలాఖరులోగా అభ్యర్థుల ఎంపిక పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో 175 అసెంబ్లీ నియోజకవర్గాలు, 25 పార్లమెంటరీ స్థానాల ఇన్‌చార్జ్‌లు, జిల్లా, నగర అధ్యక్షులతో మాట్లాడినట్లు ఆయన వివరించారు. అభ్యర్థులు నేరుగా రాహుల్‌గాంధీతో అనుసంధానమయ్యే విధంగా చేస్తామని ఆయన తెలిపారు.

**ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లండి**

కాంగ్రెస్ నాయకులు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లాలని రఘువీరా పిలుపునిచ్చారు. ఆంధ్రరత్నభవన్‌లో జరిగిన పీసీసీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్సే అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలన్నారు. రాహుల్ ప్రధాని కావడం ఖాయమని, రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటులో కాంగ్రెస్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి మెయ్యప్పన్, పీసీసీ ఉపాధ్యక్షులు తులసిరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శులు జంగా గౌతమ్, సుంకర పద్మశ్రీ, పక్కాల సూరిబాబు, ఎన్.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ ఏర్పాటు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఎన్నికల నిర్వహణ కమిటీను ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ సోము వీర్రాజు, సభ్యులుగా ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, షేక్ మస్తాన్, షేక్ బాజి, ఆర్‌డీ విల్సన్, అడపా శివనాగేంద్రరావు, వాసిరెడ్డి వెంకట చైతన్య, కొమిరిశెట్టి సాంబశివరావు, యడ్లపాటి రఘునాథబాబులను నియమించారు.

## విద్యుత్‌శాఖలో 206 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ : మంత్రి కళావెంకట్రావు

**విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:** విద్యుత్‌శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు మంత్రి కళా వెంకట్రావు తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలుగా ఉన్న అన్ని ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ముఖ్యంగా విద్యుత్ శాఖలో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు విద్యుత్‌శాఖలో ఏపి ట్రాన్స్‌కో, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్ సంస్థల్లో ఏఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేసినట్లు తెలిపారు. మొత్తంగా 206 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని, ఇందులో 171 పోస్టులు ఏపీ ట్రాన్స్‌కో, 20 పోస్టులు ఏపీ ఎస్పీడీసీఎల్, 15 పోస్టులు ఏపీఈపీడీసీఎల్ ద్వారా నియామక ప్రకటన జారీ చేసినట్లు చెప్పారు. విద్యుత్ సంస్థలైన ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ డిస్కమ్స్ సమావేశంలో విద్యుత్ వినియోగదారుల పరంగా పెరిగిన అవసరాలు, ప్రాజెక్ట్ అవసరాలకు అనుగుణంగా ఈ నియామకాలు చేపట్టాలని ఉన్నతాధికారుల సమావేశంలో నిర్ణయించామని మంత్రి తెలిపారు.

## న్యాయ సహాయం అందించాలి : మధు

**విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:** అమెరికాలో తెలుగు విద్యార్థులకు తక్షణమే న్యాయ సహాయం అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు కోరారు. ఉన్నత విద్య కోసం అమెరికాలోని పలు విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందిన తెలుగు విద్యార్థులను నకిలీ విశ్వవిద్యాలయాల్లో చేరారనే ఆరోపణలతో అరెస్ట్ చేయడాన్ని ఆయన ఖండిస్తూ, ఈమేరకు శనివారం ప్రకటన చేశారు. అమెరికాలోని డెట్రాయిడ్‌లో పోలీసు అధికారుల అదుపులో ఉన్న తెలుగు విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే న్యాయ సహాయం అందించాలని ఆయన కోరారు. నకిలీ విశ్వవిద్యాలయాలపై చర్యలు తీసుకోకుండా విద్యార్థులు నకిలీ వీసాలు పొంది తమ దేశంలో అక్రమంగా ఉంటున్నారని అమెరికా ఆరోపించడం తగదన్నారు. ఈ విషయాన్ని విధాన పరంగా పరిశీలించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విద్యార్థులకు న్యాయ సహాయం అందించాలని, వారిని దేశానికి తిరిగి రప్పించే చర్యలు తీసుకోవాలని మధు విజ్ఞప్తి చేశారు.

# కలెక్టర్ కారులో ఇసుక రవాణాపై దర్యాప్తు

- బిల్లులు బయటకు రావటంపై విచారణ
- గనులశాఖ డైరెక్టర్ శ్రీధర్ ఆదేశాలు

**విశాలాంధ్ర బ్యూరో-శ్రీకాకుళం :** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన 'కలెక్టర్ కారులో ఇసుక రవాణా'పై ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. కలెక్టర్ కారు నంబరుతో ఉన్న బిల్లులు అసలు ఎలా బయటకు వచ్చాయోనన్న అంశంపై ప్రభుత్వం విచారణ చేపట్టింది. ఈ మేరకు గనులు, భూగర్భ శాఖ డైరెక్టర్ బీ శ్రీధర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా అసిస్టెంట్ జియాలజిస్టు ప్రతాపరెడ్డి విచారణ మొదలుపెట్టారు. ఇసుక అక్రమ రవాణాలో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ భారీగా లబ్ధిపొందారని అనుమానిస్తున్నారు. ఆయన ప్రస్తుతం సెలవులో ఉండటంతో విచారణ సోమవారానికి వాయిదా పడింది. 'బ్లూ ఫ్రాగ్' పేరుతో బిల్లులను అసలు ఎవరు జారీ చేశారోనన్న కోణంలో విచారణ జరుగుతోంది. బిల్లుల జారీతో తమకు సంబంధం లేదని ఆ సంస్థ వాదిస్తోంది. ఈ వ్యవహారంపై ఇప్పటికే తాము పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. ఇదే కేసులో తహశీల్దార్, స్థానిక వీఆర్వో, పంచాయితీ అధికారులను విచారణ చేయాల్సి ఉంది. వీరిని సోమవారం విచారణ చేసి కలెక్టర్‌కు తుది నివేదికను సమర్పించనున్నట్లు తెలిసింది.

**కలెక్షన్ కింగ్‌లకు నోటీసులు**

'మైనింగ్‌శాఖలో కలెక్షన్ కింగ్‌లు' అనే శీర్షికన ప్రచురితమైన మరో వార్తకు కూడా ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నట్లుగా అనుమానిస్తున్న అధికారులకు గనులశాఖ డైరెక్టర్ శ్రీధర్ సంజాయిషీ నోటీసులను జారీ చేశారు. గత నెలలో జారీ చేసిన నోటీసులు తాజాగానే సిబ్బందికి అందాయి. మైనింగ్ అధికారులు ఉసమారు రూ.150 కోట్లను అక్రమంగా వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో శ్రీకాకుళం అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ తమ్మునాయుడుతో పాటు టెక్నికల్ అసిస్టెంట్‌లు మాణిక్యాలరావు, రమణకు నోటీసులు అందాయి. ఈ ముగ్గురు సంజాయిషీ నోటీసులు అందుకున్న పది రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రైవేటు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విశాఖ డీడీ ప్రసాదరావు రెండు రోజులపాటు విచారణ నిర్వహించి ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపించారు. అనంతరం తమ్మునాయుడు విశాఖకు బదిలీకాగా, తాజాగా సంజాయిషీ నోటీసుల జారీ కలకలం రేపుతోంది.

# సంపూర్ణ మద్యనిషేధం




- చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్
- ఏపీ మహిళా సమాఖ్య డిమాండు
- మహాసభ తీర్మానాలు వెల్లడించిన దుర్గాభవాని

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో మద్యపానాన్ని సంపూర్ణంగా నిషేధించాలని ఏపీ మహిళా సమాఖ్య డిమాండు చేసింది. జనవరి 29 నుంచి 31తేదీల్లో ఏలూరులో జరిగిన రాష్ట్ర 14వ మహాసభ చేసిన తీర్మానాలను సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని వెల్లడించారు. శనివారం విజయవాడలోని దాసరి భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, పచ్చని కాపురాల్లో చిచ్చు పెట్టే మద్యాన్ని రాష్ట్రంలో నిషేధించాలని, చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నట్టు తెలిపారు. మహాసభకు ప్రతినిధులుగా వచ్చిన 308 మంది మహిళల్లో 68 మంది నిరక్షరాస్యులని, ఈ క్రమంలో మహిళల్లో అక్షరాస్యతను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు విద్య, వైద్యం, సమాన హక్కుల కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. శబరిమలలోకి అన్ని వయస్సుల మహిళలను అనుమతించాలన్న సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయలేకపోయాయని విమర్శించారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధన, ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు; కోస్తా పరిధిలోని తొమ్మిది జిల్లాలతోపాటు పోర్టుల అభివృద్ధి; గిరిజనులు, దళితుల అభివృద్ధికి ప్రత్యేక కృషి; మహిళలపై అత్యాచారాలు, పరువు హత్యల నియంత్రణకు కృషి చేయాలని తీర్మానించినట్టు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని; అసంఘటిత రంగంలో మహిళా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆమె డిమాండు చేశారు. మహిళా సాధికారిత కోసం మరిన్ని పోరాటాలు చేస్తామ న్నారు. మహాసభలను జయప్రదం చేసిన ప్రతిఒక్కరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి.జయలక్ష్మి, కోశాధికారి పంచదార్ల దుర్గాంబ, ఉపాధ్యలు గాళ్ల శారద, సహాయ కార్యదర్శులు కోలా స్వాతి, పమిడిముక్కల రాణి పాల్గొన్నారు.

# ఇది ఆరంభమే.. ఇంకా చేస్తా...

- భరోసా ఇచ్చిన సీఎంకు ఆటోవాలాల సన్మానం
- ఖాకీ చొక్కా ధరించి ఆటో నడిపిన చంద్రబాబు



**విశాలాంధ్ర-అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ఒక్క ఆటో డ్రైవర్‌కు అండగా ఉంటానని, వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తానని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు శనివారం ప్రకటించారు. ఉండవల్లిలోని సీఎం నివాసం దగ్గర తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ నేతృత్వంలోని ఆటోడ్రైవర్ల బృందంతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఆటోలపై జీవితకాల పన్నులను రద్దు చేసినందుకుగాను చంద్రబాబుకు ఆటోవాలాలు కృతజ్ఞతలు తెలిపి, ఆయనను సన్మానించారు. సీఎం మాట్లాడుతూ, ఇది ఆరంభమేనని, ఇంకా ఎన్నో చేస్తానని చెప్పారు. ఆటో డ్రైవర్లపై భారం పడకూడదే ఈ మేరకు పన్నును రద్దు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఖాకీ చొక్క ధరించి, ఆటో నడిపి సందడి చేశారు. ఆటోలో నిలబడే డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడారు. మీరు డ్రైవరు సీటులో ఉండి ఆటో నడుపుతుంటే.. నేను రాష్ట్రాన్ని నడుపుతు న్నానని, మీరంతా నా వెంట ఉండాలని అన్నారు. రాష్ట్రప్రజలు సుభిక్షంగా ఉండాలని కృషిచేస్తున్నట్టు తెలిపారు. ఆటోలు, ట్రాక్టర్లపై పన్ను మినహాయింపు వల్ల 9.79 లక్షల వాహన యజమానులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్రంలోని ఆటోడ్రైవర్లు తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఆటోలకు వెనుక రాష్ట్రప్రభుత్వం పథకాలను ప్రదర్శించి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. 'నా కోసం కాదు... రాష్ట్రం కోసం పని చేయండి. పేదల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే ధ్యేయం' అని చంద్రబాబు అన్నారు. భవిషత్తులో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెడతామని, ఇంధన ఖర్చులను తగ్గిస్తామని తెలిపారు. ఆటో ప్రయాణం సౌకర్యవంతంగా, పర్యావరణహితంగా ఉండబోతోందని చెప్పారు. అన్ని జిల్లాల ఆటోడ్రైవర్లు సంఘంలా ఏర్పడి, సమస్యలనపై చర్చించుకుని, తన దృష్టికి తెస్తే.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి హామీనిచ్చారు. ఏటా బీమా చెల్లింపు భారమవుతోందని ఆటో డ్రైవర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, 'మీకు ఏవిధంగా ఇన్స్యూరెన్స్ అమలు చేయాలో ఆయా కంపెనీలతో రాష్ట్ర అధికారులు చర్చించాకే నిర్ణయిస్తాం' అని సీఎం తెలిపారు. మహిళా ఆటో డ్రైవర్లు సైతం సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఆటో డ్రైవర్లను సీఎం వద్దకు తీసుకొచ్చిన వారిలో ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ విజయవాడ అర్బన్ ప్రధాన కార్యదర్శి పట్టాభిరాం, టీఎన్‌టీయూసీ నేతలు, టీడీపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి రమణ ఉన్నారు.

## ఫిబ్రవరి 25న చలో ఢిల్లీ
### సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు బేబీరాణి, సుబ్బరావమ్మ

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో అంగన్‌వాడీలను బీజేపీ ప్రభుత్వం మరోసారి మోసం చేసిందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధానకార్యదర్శులు బేబిరాణి, సుబ్బరావమ్మలు ధ్వజమెత్తారు. ఈమేరకు ఒక ప్రకటన చేశారు. అక్టోబరు 2018 నుంచి అంగన్‌వాడీ వర్కర్స్‌కు వేతనాలు పెంచుతూ ప్రధానమంత్రి ప్రకటన చేశారన్నారు. దీన్ని అనుసరించి అనేక రాష్ట్రాల్లో వేతనాలను అందుకోవాల్సి ఉందన్నారు. అయితే ఆ వేతనాలనే మరోసారి పెంపుదలగా చూపి భ్రమింపజేయడానికి బడ్జెట్‌లో ప్రయత్నించారని విమర్శించారు. అక్టోబరు 2018 నుంచి మార్చి 2020 వరకు పెరిగిన వేతనాలు చెల్లించడానికి రూ.10,649 కోట్లు అదనంగా కావాలన్నారు. ఈనేపథ్యంలో కేంద్రప్రభుత్వం చెల్లించాల్సిన 60శాతం వాటాకి రూ.4,250 కోట్లు అవసరంకాగా కేవలం రూ.1,944కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. 45వ ఐఎల్‌సీ సిఫార్సుల ప్రకారం కనీస వేతనాలు, పింఛన్ డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఫిబ్రవరి 25వతేదీన చలో ఢిల్లీ నిర్వహిస్తుందన్నారు. ఈనేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపనిచ్చారు.

## ఎన్నికల గారడీలా కేంద్ర బడ్జెట్
### ఎంపీ కనకమేడల రవీంద్ర విమర్శ

**విశాలాంధ్ర - అమరావతి :** కేంద్ర బడ్జెట్ ఎన్నికల గారడీ తప్ప, ప్రజా ప్రయోజనం కోసం కాదని ఎంపీ కనకమేడల రవీంద్ర విమర్శించారు. ఉండవల్లిలోని సీఎం నివాసం దగ్గర మీడియా పాయింట్ లో శనివారం ఎంపీ కనకమేడల రవీంద్ర విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేవలం ఎన్నికలలో ఉపయోగించుకుని వదిలేద్దాం అన్న చందంగా బడ్జెట్ రూపొందించారని అన్నారు. రైతుల కోసం అని చెబుతూనే అనేక ఆంక్షలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. ఐదు లక్షల ఆదాయం వరకు పన్ను లేదనడంలో కూడా మాయ ఉందని విమర్శించారు. ఒక్క రూపాయి అదనంగా వచ్చినా రూ. 13 వేలు చెల్లించాలనే వాస్తవాన్ని బహిర్గతం చేయడం లేదన్నారు. అసంఘటిత కార్మికులకు పింఛన్ అనేది ఎండమావి లాంటిదని, అది సాధ్యం కాదని మండిపడ్డారు. ఈ బడ్జెట్ ద్వారా కొంతమంది ఉన్నత వర్గాల వారు రుణాలు ఎగ వేసేందుకు దారి చూపించారని అన్నారు. ఇది ప్రజా బడ్జెట్ కాదని అమలుకు సాధ్యం కాని ఎన్నికల బడ్జెట్ మాత్రమేనని ఎద్దేవా చేశారు.

# హైకోర్టు కొత్త భవనం నేడు ప్రారంభం

- విజయవాడ చేరుకున్న సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్
- భారీ బందోబస్తు ఏర్పాట్లు



**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన తాత్కాలిక జుడీషియల్ కాంప్లెక్స్ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. ఆదివారం ఉదయం 11 గంటలకు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయి, సీఎం చంద్రబాబు జుడిషియల్ భవన సముదాయాన్ని ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సుప్రీంకోర్టు జడ్జిలు జస్టిస్ ఎన్.వి. రమణ, లావు నాగేశ్వరరావు, ఆర్.సుభాష్ రెడ్డి, హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, తెలంగాణా హైకోర్టు చీఫ్ జస్టిస్ టి.బి.రాధాకృష్ణన్‌లు పాల్గొంటారు. సుమారు 4 ఎకరాల్లో రూ.173కోట్ల అంచనా వ్యయంతో 2.52 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో తాత్కాలిక హైకోర్టును నిర్మించారు. బౌద్ధ దేవాలయం శైలి ఉట్టిపడేలా టీమ్ వన్ సంస్థ జుడీషియల్ కాంప్లెక్స్‌ను డిజైన్ చేసింది. ఎల్ అండ్ టీ నిర్మాణ సంస్థ ఈ భవన నిర్మాణాన్ని చేపట్టింది. జీ ప్లస్ 2 అంతస్తుల్లో నిర్మించిన ఈ భవనాన్ని కేవలం 189 రోజుల వ్యవధిలో సంస్థ పూర్తి చేసింది. ఈ భవనంలో న్యాయమూర్తుల కోర్టు హాలు 1240 చదరపు అడుగులు, ప్రధాన న్యాయమూర్తి కోర్టు హాలు 2480 చదరపు అడుగుల విస్తీర్ణంలో సువిశాలంగా తీర్చిదిద్దారు. ఇందులో మొత్తం 23 కోర్టు హాళ్లు ఉంటాయి. అలాగే , వాటికి అనుబంధ కార్యాలయాలు, అడ్వకేట్ జనరల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, నాయవాదుల అసోషియేషన్ హాలు, మహిళలకు ప్రత్యేకంగా అసోషియేషన్ హాలు, అడ్వకేట్ చాంబర్, వివాద పరిష్కార కేంద్రాలు, లైబ్రరీతోపాటు, కోర్టుకు అవసరమైన అన్నీ సదుపాయాలు సమకూర్చారు.

**సుప్రీం చీఫ్ జస్టిస్ గొగోయ్‌కి సీఎం స్వాగతం**

హైకోర్టు ప్రారంభోత్సవ నిమిత్తం శనివారం మధ్యాహ్నమే రాష్ట్రానికి విచ్చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌కి గన్నవరం విమానాశ్రయంలో మంత్రులు దేవినేని ఉమామహేశ్వర రావు, పి.నారాయణ, ప్రభుత్వ అధికారులు, హైకోర్టు న్యాయమూర్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం నోవాటెల్‌లో సీఎం చంద్రబాబు మర్యాదపూర్వకంగా గొగోయ్‌ని కల్సి దుశ్శాలువతో సత్క రించి స్వాగతం పలికారు. చీఫ్ జస్టిస్‌తోపాటు సుప్రీం కోర్ట్ జడ్జిలు జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ లావు నాగేశ్వ రరావు, జస్టిస్ ఆర్.సుభాష్ రెడ్డి తదితరులున్నారు.

సంపాదకీయం

# అబద్ధమేవ జయతే ?

సత్యమేవ జయతే అన్నారు. నిజం చెప్పటానికి మించిన ధర్మంలేదని మన పెద్దల ఉవాచ. 'సర్వతీర్థాభిగమనంబు సర్వవేద సమధిగమము సత్యంబుతో సరియుగావ' అని మొదలుపెట్టి 'యెరుగుమెల్ల ధర్మంబులకెందు బెద్దయండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు' అంటూ పద్యం ముగించారు ఆదికవి నన్నయ. సకల చరాచర జగత్తును అంతర్యామియై నడిపించేది ధర్మమంటారు విజ్ఞులు. అబద్ధమాడడం పిరికితనానికి లక్షణం, కనుక నిజం మాత్రమే పలకాలని సకల శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. 'నిజము పలికెడు నరులకు విజయము గలదెందు' అన్నారు వేమన. లౌకిక ప్రపంచంలో అన్నీ నిజాలే చెప్పడం సాధ్యమేనా!? నిజాలతోపాటు అబద్ధాలు, అర్ధసత్యాలు కూడా సహజీవనం సాగిస్తూనే ఉంటాయి. శుద్ధ నిజమే తప్ప అబద్ధమే చెప్పను అని మడికట్టుకు కూర్చోవడమూ కుదిరే పనికాదు. చిన్నచిన్న అబద్ధాలు ఆడైనా సరే అవతలి వారిని నొప్పించకుండా తమకు ఇబ్బంది కలగకుండా చక్కగా మేనేజ్ చేస్తుంటారు కొందరు. నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరుగువారు ధన్యులు సుమతీ అన్నారు గదా!

ప్రతిదానికి పరిణామక్రమ సూత్రం వర్తిస్తుంది. మనం పరిణామ ప్రపంచంలో జీవిస్తున్నాం గదా! నిన్నటి వరకు మన రాజకీయ నాయకులు కొంత లౌక్యం ప్రదర్శించేవారు. నిజాన్ని పోలిన అబద్ధమాడటాన్ని లౌక్యం అన్నాడో పెద్దమనిషి. కొంత అబద్ధమాడడానికి అవకాశం చిక్కుతుందన్నమాట. కొన్ని విషయాల్లో అబద్ధమాడవచ్చునని, అందువల్ల ఎటువంటి దోషమూ అంటదని పెద్దలే కొంత వెసులుబాటు కల్పించారు. 'వారిజాక్షులందు వైవాహికములందు బ్రాణ విత్తమానభంగమందు' అంటూ మొదలుపెట్టి మరికొన్ని అంశాలు జోడించి వాటి విషయంలో 'బొంకవచ్చు'నని రాయితీలిచ్చారు. దీనికి ఎవరి వెసులుబాటును బట్టి వారు మరికొన్నింటిని చేర్చుకొని మొత్తంగా ఏది నిజమో..ఏది అబద్ధమో తెలుసుకోవడానికి వీలు లేకుండా మాట్లాడేస్తున్నారు. మార్పు సహజం గదా! పరిణామక్రమం అంటే ఇదేగా!! మనలో చాలామంది సరిపెట్టుకొంటున్నారు. 'ఒపినియన్స్ అప్పుడప్పుడు ఛేంజి చేస్తూంటూనే గాని పొలిటీషియన్ కానేరడు' అని గిరీశం ఇన్నెంట్ మ్యారేజీలకి వత్తాసుగా కొత్త ఆర్గ్యుమెంటు ప్రతిపాదించాడు గదా! ఆయన బాటలోనే మన నేతలు తమ అభిప్రాయాలు, హామీలు ఛేంజి చేసుకోవడమూ, కొత్త ఆర్గ్యుమెంట్లు ప్రతిపాదించడమూ ఇప్పుడు మామూలైంది. అబద్ధాలే వారి జీవన గమనంగా, గమ్యంగా మారిపోయాయి. ఏ పార్టీ హామీ నమ్మాలో, ఏ నాయకుని ప్రకటన నిజమో ప్రజలకు అర్థంగాని అయోమయ పరిస్థితి దాపురించింది. రాజకీయ నాయకులు తమ ఉనికి కోసం, అధికారం కోసం ఎన్నెన్ని అబద్ధాలు ఆడాలో అన్నీ చెబుతున్నారు.. ఇందుకు ఏ మాత్రం వెరపు లేకుండా ప్రవర్తిస్తున్నారు. వారి మాటలు, చేతలకు జనం మతులు పోతున్నాయి. మన ఇతిహాసాల్లో అబద్ధాలాడిన ఆదర్శ పురుషులు, అధర్మం వైపు నిలిచిన పెద్దలూ ఉన్నారు. వీరందరూ అంతిమంగా లోకకల్యాణార్థమే తామూ పని చేసినట్లు రుజువు చేసుకున్నారు. మన నేతలు మాత్రం ఓట్లు, సీట్లు, తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఎన్ని అడ్డగోలు పనులైనా చేయడానికి వెనకాడడం లేదు. నిన్న చెప్పిన మాటకు నేటి చేతకు పొంతనలేకుండా వ్యవహరిస్తున్నారు. నేడిలా.. రేపు ఎలా ఉంటారో, ఏం చేస్తారో తెలియకుండా పోతోంది. ఈ పరిణామక్రమాన్ని బీజేపీ రాజకీయాలు మరింత వేగవంతం చేశాయి. 'తొండ ముదిరితే ఊసరవెల్లి' చందంగా.. సన్యాసులు, హిందూత్వ సిద్ధాంతాలు, అధికారం కలగలిసి ఓ కొత్త రసాయన పదార్థం పుట్టుకొచ్చింది. ఇప్పుడు రాజకీయం అంటే నమ్మించడం, మోసగించడం, దానికి సెంటిమెంటు, అభివృద్ధి ముసుగు తొడగడంగా పరిణామం చెందింది. తమకు అనుకూలించేవన్నీ సూత్రబద్ధమైనవీ, న్యాయ సమ్మతమైనవీ, నిజాయతీపూరితమైనవీ, అభివృద్ధిదాయకమైనవీ, అలా కాని పక్షంలో అవన్నీ అక్రమమూ, అనైతికమూ, అన్యాయమూ, అపరాధమూ అయిపోవడమనేది బీజేపీ రాజకీయం తీసుకొచ్చిన సరికొత్త నిర్వచనం. అధికార రుచి చవిచూసి ఎక్కువ కాలం కాకపోయినా దానికి అన్ని కళలు వెంటవెంటనే అబ్బాయి. అయోధ్యలో రామాలయం పేరు చెప్పి ఓట్లమీద, సీట్లమీద పట్టు తెచ్చుకుంది. పాపం! అయోధ్యపై పట్టుకోల్పోయి రాముడే అడవులు పాలయ్యాడు, కానీ అదే అయోధ్యను అడ్డుపెట్టుకొని అధికారం మెట్టు ఎక్కిన ఘనత బీజేపీదే. పురాణ పురుషుడు ఏం కోల్పోయాడో, అక్కడ నుంచి తమ అధికారాన్ని వెతుక్కోవాలని అంతకుముందు ఏ పార్టీ గుర్తించలేకపోయింది. తమ రథయాత్రతో లౌకికవాదంపై దండయాత్రగా మార్చుకోగలిగింది. కంసుడు మాదిరిగా గర్భాన్ని చీల్చి పసిగుడ్డును ముక్కలుగా నరికినా.. తమదే న్యాయమనీ, తమ తప్పు ఏమీలేదని జనంతో ఒప్పించి తిరిగి ముఖ్యమంత్రి పదవి, ఆ తర్వాత గురువుకు పంగనామాలు పెట్టి ప్రధాని పీఠం దక్కించుకోగలిగిన సామర్థ్యం ఆ పార్టీ నేతకే సొంతం. కేంద్రంలోకి వచ్చీరాగానే హేతువాదుల్నీ, సృజనాత్మక రచయితలను టార్గెట్ చేసినా.. అంతా సనాతన ధర్మరక్షణార్థమని ఫోజు పెట్టడం వారికే చెల్లింది. గోమాంసం తింటున్నాడన్న పేరుతో ఓ ముస్లింపెద్దాయనను పరమ కిరాతకంగా చంపేసినా.. ధర్మసంస్థాపనార్థం అంటూ ప్రచారం చేసుకోవడం ఆ పార్టీ ఘనత. మన శ్రీనాథుడుకీ, పోతనకూ మధ్య ఉన్నంత తేడా ఉంది కాంగ్రెస్‌కూ, బీజేపీకీ. శ్రీనాథుడు మాదిరిగా అధ్యయనం చేయకపోయినా పోతనకు చక్కని కవిత్వం చెప్పే నేర్పు పట్టుబడింది. ఓ మంచి ప్రయోగంగా దీన్ని చెబుతూ వస్తున్నాం. కానీ ఇక్కడ ఓ ప్రతికూల ఉదాహరణగా సరిపోల్చితే కాంగ్రెస్ అంత సుదీర్ఘ ప్రస్థానం లేకపోయినా బీజేపీకి అలవడిన సహజ పట్టుపరిశ్రమ దాన్ని చకచకా ముందుకు నడిపింది. దాని పరిభాషలోనే చెప్పాలంటే 'అదంతా దాని పూర్వజన్మ సుకృతం' అనుకోవాలి!? కాబట్టే ఆ పార్టీ నేతలు ప్రజల్ని ఏమార్చగలుగుతున్నారు. నిన్నగాక మొన్న పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలగారడీగా, బ్యాలెట్ బడ్జెట్‌గా సాగింది. మధ్యతరగతి కోసం, రైతులకోసం, కార్మికులకోసమే బడ్జెట్‌ను తయారుచేసినట్లు భ్రమింపచేశారు. ఇదంతా పైకి కనిపించేది, కిందనుంచి మాత్రం కార్పొరేట్లకు గుమ్మరించేశారు. బడ్జెట్ తాలింపుల వాసనలను జనాలకు చూపిస్తూ అసలు పదార్థాన్ని మాత్రం తమకు వత్తాసు పలికే కొద్దిమందికి వడ్డించేశారు. తిలక్ గేయంలో గుమస్తా భార్య చెప్పినట్లు 'బొగ్గుల్లేవు.. రాత్రికి రగ్గుల్లేవు'– మిగిలిన ఎన్నింటితోపాటుగానో.. ఈ దేశంలో తాగనీరులేని గ్రామాలు, వెలుతురు రాని పల్లెలు వేలమీద ఉన్నాయి. అప్పులు తీర్చలేక ఎందరో అన్నదాతలు బలవన్మరణం పొందుతున్నారు. పొట్టచేత బట్టుకొని పనుల కోసం లక్షలాదిమంది వలసలు పోతున్నారు. అయినా పీయూష్ గోయల్ అంకెల జిమ్మిక్కుల వంట అద్భుతంగా వండివార్చారు. ఓట్లు దండుకునేందుకు రంగం సిద్ధంచేశారు. కార్పొరేట్ మీడియా వేయి గొంతుకలతో ప్రచారం చేస్తోంది. మన మేధావుల విశ్లేషణలు, వ్యాఖ్యానాలతో ఊదరగొడుతున్నారు. నిజమేలే.. యథారాజా తథా మేధావులు గదా! అయితే ఈ వంచన, కనికట్లు ఎంత కాలమూ సాగవనేది చరిత్రలో అనేక సందర్భాల్లో రుజువైంది. నేడు జనం నరేంద్ర మోడీ మాయలో పడిపోయే అవకాశాలు సన్నగిల్లాయి. ఒకసారి మోసపోతే అది మోసగించిన వారి తప్పు. అదే పదే పదే మోసపోతే మోసపోయినవారి తప్పిదమే అవుతుందనే వాస్తవం జనానికి బాగా తెలుసు.

అమెరికాకు చెందిన ప్రసిద్ధ మనస్తత్వ శాస్త్రవేత్త డాక్టర్ రాబర్ట్ ఫెల్డ్‌మాన్ జరిపిన పరిశోధనలలో 'నిజాలు చెప్పి ఎదుటి వారిని బాధపెట్టేకంటే చిన్న అబద్ధమాడి అయినా సరే వారిని మెప్పించాలని ఆడవారు చూస్తే, డాబుకోసం, తమను గొప్పవారిగా చలామణి చేసుకోవడానికి మగవారు అబద్ధాలు వల్లిస్తున్న'ట్లు కనుగొన్నారు. మన బీజేపీ నేతలపై ముఖ్యంగా మోడీ అనుచర గణంపై ఆయన పరిశోధనలు చేస్తే.. వారెందుకు మాటమారుస్తున్నారో, అబద్ధాలాడుతున్నారో, జనాన్ని ఎలా బురిడీ కొట్టించగలుగుతున్నారో తెలుసుకొని ఆయనకు ముచ్చెమటలు పట్టడమే కాదు, చివరకు మూర్ఛపోతాడంటే అతిశయోక్తికాదు. మోసానికి కొత్త నిర్వచనం చెప్పిన ఘనత నరేంద్ర మోడీ పేరిట శాశ్వతంగా నిలిచిపోతుందంటే అతిశయోక్తి లేదు.

---

పెట్టుబడిదారీ వ్యవస్థ సార్వత్రిక సంక్షోభం

భాగం - 5

# బహుళజాతి సంస్థల దోపిడీ

ఆర్థికం



మర్ల విజయ కుమార్

1970 దశకంతో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థకు మంచిరోజులు గతించి, కష్ట కాలం ప్రారంభమయ్యిందని మనం ఇంతకు ముందు చర్చించుకున్నాము. లాభాలను కాపాడుకునేందుకు పారిశ్రామిక దేశాలలోని గుత్త పెట్టుబడిదారీ సంస్థలు ప్రపంచీకరణను వినియోగించుకుని, భారత్, చైనా, బ్రెజిల్, మెక్సికో వంటి దేశాలలో కార్మికుల జీతాలు తక్కువ కనుక, అక్కడికి పరిశ్రమలు, సర్వీసులు పెద్ద ఎత్తున తరలించటం ప్రారంభించారు. ఈ దేశాలలోని చౌకైన శ్రమ శక్తిని, ప్రకృతి వనరులను దోచుకునేందుకు నయాఉదార వాద విధానాలను ప్రపంచ దేశాలపై రుద్ది, ఆ దేశాలు పెట్టుబడులకోసం ప్రపంచ బ్యాంకు, ఐ.ఎమ్. ఎఫ్, ఇతర గుత్త ఫైనాన్స్ సంస్థల నిబంధనలకు తలొగ్గి, తమ దేశాలలోని సంపదను అడ్డంగా దోచుకునేందుకు, తద్వారా లభించిన లాభాలను తిరిగి తమ దేశానికి తరలించుకు పోవటానికి వీలుకల్పించవలసి వచ్చింది. విదేశీ పెట్టుబడులతో దేశం అతిత్వరగా అభివృద్ధి చెందుతుందని, లక్షల కోట్ల సంఖ్యలో ఉద్యోగాల కల్పన జరుగుతుందని, భారత్ వెలిగిపోతుందని కాకమ్మ కథలు చెప్పి, ప్రజలను మభ్యపెట్టి, ఎన్నికలలో నెగ్గి అధికార పీఠాన్ని ఎక్కటం పరిపాటి అయిపోయింది. అధికారంలోకి వచ్చాక, బహుళజాతి సంస్థలకు వ్యాపారానికి, తద్వారా దోపిడీకి అనువైన విధంగా చర్యలు చేపట్టటం వారి దినచర్యగా మారింది. చిటికేస్తే విదేశీ పర్యటనలు చేయటం, విదేశాలలో బడా కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నామని, ఇకనేమి, లక్షల కోట్ల పెట్టుబడులు తరలి వస్తున్నాయని, లక్షలాదిగా కొత్త ఉద్యోగాలు కల్పించబడతాయని ఊదర గొట్టటం మనం రోజూ చూస్తూనే ఉన్నాము. ఈ క్రమంలో పేద రైతుల భూములను లాక్కుని, పెద్ద కంపెనీలకు అప్పజెప్పటం, వారికి అడ్డగోలుగా పన్ను రాయితీలు, విద్యుత్తు, నీరు, తదితర సౌకర్యాలను దీర్ఘకాలిక సబ్సిడీలుగా అందించటం ద్వారా వారు స్వదేశీ, విదేశీ గుత్త సంస్థలకు ఊడిగం చేయటం, ఈ క్రమంలో తమ సొంత లాభాన్ని కూడా చూసుకోవటం పాలకుల సంస్కృతిగా మారిపోయింది. ఈ బడా కంపెనీలకు పెట్టుబడులు పెట్టటానికి, పరిశ్రమలు, వ్యాపారాలు స్థాపించటానికి కావలసిన రోడ్లు, రైల్వే లైన్లు, హెచ్ టి విద్యుత్తు లైన్లు తదితరాలు కల్పించటానికి ప్రజాధనాన్ని ఖర్చుపెట్టటమే కాకుండా, నిర్దాక్షిణ్యంగా పేదల భూములను లాక్కోవటం కూడా జరుగుతున్నది. దేశ బడ్జెట్‌లో లక్షల కోట్ల రూపాయలు ఈ బడా వ్యాపారులకు పన్నురాయితీలుగా ఇవ్వటం, తీరా ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు డబ్బు లేదని పెదవి విరచటం మామూలు అయింది. గత 30 ఏళ్ళ నయా ఉదారవాద ప్రపంచీకరణ ద్వారా సాధించినదేమిటి అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.

అడ్డగోలుగాప్రభుత్వ సబ్సిడీలతో పెట్టే వ్యాపారాలలో, పరిశ్రమలలో, ఎస్ ఇ జెడ్ లలో కార్మికులకు ఏ కార్మిక చట్టాలూ వర్తించవు. వారికి ఇచ్చే జీతాలు కనీస స్థాయిలో కూడా ఉండవు. రోజుకు 8 పని గంటల నిబంధన ఉన్నా, 10 నుండి 14 గంటలు నిర్దాక్షిణ్యంగా చాకిరీ చేయించుకోవటం, యూనియన్లను నిషేధించటం, ఇదేమిటని ప్రశ్నించిన వారిని తమ గూండాలతో చితకబాదించటం జరుగుతున్నది. అన్నీ కాంట్రాక్టు ఉద్యోగాలే. ఫ్యాక్టరీలో ఏప్రమాదం జరిగినా, కనీస వైద్య సహాయం కూడా ఇవ్వరు. గాయపడిన కార్మికులను పనినుండి తొలగించి, కొత్తవారిని తీసుకుంటారు. ఈ రకమైన దోపిడీని ప్రభుత్వం చూసీచూడనట్లుగా, లోపాయకారిగా యజమాన్యానికి వత్తాసు పలుకుతూ, కార్మికులను వారిఖర్మానికి వారిని వదిలివేస్తుంది. ఆ ఫ్యాక్టరీలు కాలుష్య చట్టాలకు ఉల్లంఘిస్తోన్నా, కార్మికులు అతి ప్రమాదభరితమైన వాతావరణంలో పనిచేస్తూ, అనారోగ్యం పాలవుతున్నా, ప్రభుత్వానికి పట్టదు. అసలు విషయానికొస్తే, ఏ పెట్టుబడిదారుడూ దేశాభివృద్ధికోసం, ఉద్యోగాల కల్పన కోసం ఇక్కడికి వచ్చి పెట్టుబడులు పెట్టడు. గత 15 ఏళ్ళలో మన దేశానికి వచ్చే పెట్టుబడులు సగటున సాలీనా 2 లక్షల కోట్ల రూపాయలకు మించలేదు. ఆ వచ్చిన పెట్టుబడులలో అధిక భాగం బడా విదేశీ గుత్త సంస్థలు తమ వ్యాపార విస్తరణకు మాత్రమే ఉపయోగించుకున్నాయి. ఉదాహరణకు కోకో కోలా కార్పొరేషన్ ప్రపంచ వ్యాప్తంగా పెట్టే విదేశీ పెట్టుబడులలో అధిక భాగం తమ పరిశ్రమల ఆధునీకరణకోసం వినియోగించబడ్డాయి. ప్రపంచ వ్యాప్త పోటీని తట్టుకోవటం కోసం తమ పరిశ్రమలను ఆధునీకరించే ఈ ప్రక్రియలో, పాత యంత్రాల బదులుగా ఆటోమేటిక్ యంత్రాలు ప్రవేశపెట్టబడతాయి. తత్ఫలితంగా, కార్మికుల సంఖ్యను తగ్గించివేస్తారు. ఇదేమని స్థానిక ప్రభుత్వం అడగదు. ఈ విధంగా మన దేశంలోకి వచ్చే విదేశీ పెట్టుబడులలో 40 శాతానికి పైగా బడా కంపెనీల అంతర్గత పెట్టుబడులే. కాని విదేశీ పెట్టుబడుల పేరుచెప్పి, ప్రభుత్వం నుండి అందుకు 2.5 రెట్లు పన్ను రాయితీలుగా పిండుకుంటారు. ఇక నైకే వంటి కంపెనీలు మార్కెట్లో 50 డాలర్లకు ఒక జత బూట్లను అమ్మితే, ఆ కంపెనీ, బ్రెజిల్, కాంబోడియా లలో కార్మికులకు ఇచ్చే జీతాలు అందులో 1.5 శాతం మాత్రమే. పైగా తమ ఉత్పత్తులలో అధిక శాతం సబ్ కాంట్రాక్టులుగా స్థానిక కాంట్రాక్టర్లకు అప్పజెప్పి, తమ చేతికి మట్టి అంటకుండా వారు లాభసాటి వ్యాపారాలను చేసుకుంటారు. చైనాలో ఆపిల్ ఫోన్లను తయారు చేసే తైవాన్‌కు చెందిన ఫాక్స్ కాన్ సంస్థకు ఫోన్ యొక్క మార్కెట్ రేటులో 3 శాతం మాత్రమే గిడుతుంది. ఆపిల్ బ్రాండు తమ అధీనంలో ఉన్న ఆపిల్ బహుళజాతి సంస్థకు 30 శాతం వాటా లభిస్తుంది. అంతర్జాతీయంగా గత 40 ఏళ్ళలో ప్రపంచీకరణ ఫలితంగా బడా గుత్త పెట్టుబడిదారీ సంస్థలకు లాభాలు వందల రెట్లు పెరిగినా, కార్మికుల జీతాలు మాత్రం ప్రపంచ వ్యాప్తంగా పెరగలేదు. తన 'పెట్టుబడి' గ్రంథంలో మార్క్స్ పెట్టుబడిదారుని లాభాలు ఇనుమడించటానికి ముఖ్య కారణం కార్మికుల జీతాలు పెరగకుండా, వ్యాపారాలు పెరగటమేనని వివరించారు. మరొక పక్కన అభివృద్ధి చెందిన దేశాలలోని కార్మికుల ఆదాయాలు కూడా ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోయాయి. ఈ దోపిడీ క్రమం దుష్ఫలితాలు మనకు ఈనాడు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. వెనుక బడిన దేశాలలోనే కాదు, ఫ్రాన్స్ వంటి అభివృద్ధి చెందిన దేశాలలోకూడా జీవన స్థితిగతులు క్షీణించి, బ్రతికే మార్గం లేక, ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ఇక ఈ విదేశీ పెట్టుబడుల చిదంబర రహస్యం ఏమిటంటే, అధికారాన్ని వెలగబెట్టే బూర్జువా నాయకులు, తమ వాటా దొంగ సొమ్మును, విదేశీ బ్యాంకులకు తరలించి, అక్కడనుండి, మారిషస్, సెయింట్ కిట్స్ వంటి చిన్న దేశాలద్వారా తిరిగి



మన దేశానికి విదేశీ పెట్టుబడుల పేరున తీసుకు వస్తున్నారు. గత 10 ఏళ్ళలో మన దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడులలో సగానికి పైగా ఈ విధంగా మన దేశంలోకి ప్రవేశించిన దొంగ సొమ్మలే. ఆకారణంచేతనే మన నాయకులకు విదేశీ పెట్టుబడులంటే అంత వల్లమాలిన ప్రేమ.

మన దేశంలో సాలీనా 35 లక్షల కోట్ల రూపాయల మేరకు నల్ల ధనం తయారవుతోందని, అందులో చాలా తక్కువ భాగం నగదు రూపంలో ఉంటుందని, మొత్తం నల్ల ధనంలో పదవ వంతు, అంటే 3.5 లక్ష కోట్ల రూపాయల సొమ్ములు విదేశీ బ్యాంకులకు తరలి వెళ్తుంటాయని అనేక ఆర్థిక సంస్థలు అంచనాలు వేస్తున్నాయి. విదేశీ యంత్రాలను, ఇతర పరికరాలను కొనుగోలు చేసే టప్పుడు ఓవర్ ఇన్ వాయిసింగ్ ద్వారానూ, సరుకులు ఎగుమతి చేస్తున్నప్పుడు అండర్ ఇన్ వాయిసింగ్ ద్వారానూ, డబ్బు మిగుల్చుకుని, బ్యాంకులనుండి కొనుగోలుకు, అమ్మకాలకు అప్పుగా తీసుకున్న సొమ్ములో కొంతభాగం నల్లధనంగా మారి, అక్కడనుండి అక్కడే విదేశీ బ్యాంకులకు చేరుతుంటుంది. ఇక అధికారంలో ఉన్న రాజకీయ నాయకులు విదేశాలకు విదేశీ పెట్టుబడులను ఆహ్వానించటానికి అనే వంకతో తరచూ చేపట్టే విదేశీపర్యటనలలో విదేశీ కంపెనీలతో లోపాయకారీగా ఒప్పందాలు చేసుకుని, కమీషన్లను విదేశీ బ్యాంకులకు అక్కడికక్కడే స్విస్ బ్యాంకులలోకి చేరే ఏర్పాట్లు చేసుకుంటారు. మన దేశానికి వచ్చే "విదేశీ పెట్టుబడు"లలో అధిక శాతం ఈ బ్యాంకులనుండి తిప్పి మనదేశానికి తమ దొంగ సొమ్ములను రాజమార్గాన తెచ్చుకుని, ఇక్కడ అడ్డగోలుగా ప్రజాధనాన్ని పన్ను రాయితీల పేరున రాబట్టుకోవటం, పేదల భూములను అభివృద్ధి పేరుచెప్పి బలవంతంగా లాక్కోవటం ఈనాడు సర్వసామాన్యంగా జరుగుతున్నది. ఈ రాక్షస ప్రక్రియనే డేవిడ్ హార్వే అనే మార్క్సిస్టు మేధావి, "కొల్ల గొట్టటం ద్వారా సంపద పోగు చేసుకోవటం"గా వివరించారు. గత 30 సంవత్సరాలుగా మనదేశంలో పాలక వర్గాల ఈ విధానాల కారణంగా సంపద తారతమ్యాలు మిన్నంటాయి. ఆక్స్ ఫామ్ సంస్థ విడుదల చేసిన లెక్కల ప్రకారం, గత ఏడాది మన దేశంలో ఉత్పత్తి అయిన సంపదలో 73 శాతం అపర ధనికుల పరమయి, కేవలం 10 శాతం మాత్రమే 80 శాతంగా ఉన్న పేద ప్రజలకు చేరింది. ఈ ఏడాది, ఈ కుబేరుల వాటా 4 శాతం పెరిగి, 77 శాతానికి చేరింది. అంటే అట్టడుగున ఉన్న పేద ప్రజల వాటా మరింత దిగజారిందన్నమాట. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మొత్తం సంపదలో ఈ నాడు 58 శాతం గుప్పెడుమంది అపర ధనికుల చేతుల్లో ఉన్నది. ప్రపంచదేశాలన్నిటిలోనూ ఈవిధంగానే లూటీ జరిగి ఆ సొమ్ము విదేశీ బ్యాంకులకు చేరుతుంటుంది. ఈ విధంగా విదేశీ కంపెనీలు, దేశీయ బూర్జువా వర్గం ప్రజలను అడ్డగోలుగా దోచుకున్న సొమ్ములు విదేశీ బ్యాంకులలోకి వచ్చి చేరుతుంటే, అమెరికా, యూరప్‌ల ఆర్థిక వ్యవస్థలలో ఒక విచిత్రమైన పరిస్థితి తలెత్తింది.

అంతకు ముందు వివరించినట్లుగా బహుళజాతి కంపెనీలకు, ఫైనాన్స్ సంస్థలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రకృతి వనరులను కొల్లగొట్టుకోవటం ద్వారానూ, కార్మికుల శ్రమ దోపిడీ ద్వారానూ అపార లాభాలు సమకూరుతున్నాయి. భారత్, చైనా దేశాలలో పదుల కోట్ల సంఖ్యలో వ్యవసాయాన్ని వదిలి, పట్టణాలకు తరలి వచ్చిన ప్రజలు బతుకు తెరువుకోసం కాంట్రాక్టు కార్మికులుగా, కూలీలుగా పరిశ్రమలలో చాలీచాలని జీతాలకు పనిచేయవలసి రావటంతో, గుత్త సంస్థలకు లాభాల పంట పండింది. అమెరికాలో ఒక కార్మికునికి ఇచ్చే జీతానికి భారత్ లో 20 నుండి, 30 వరకూ కార్మికులను వినియోగించుకోవచ్చును. పైగా వారిచేత ఎక్కువ గంటలు పనిచేయించుకోవటం, ఏ విధమైన సంక్షేమ, ఆరోగ్య పథకాలు అమలు చేయకుండా అడ్డగోలుగా పోగుచేసుకున్న లాభాలను తమ దేశాలకు తరలించుకు పోవటం జరుగుతున్నది. ఇదే కాక తమ టెక్నాలజీని వాడుకున్నందుకు వసూలు చేసే రాయల్టీల ద్వారా కూడా వారికి అపార లాభాలు వచ్చి చేరుతున్నాయి. మరొక పక్కన అమెరికాలో పరిశ్రమలు, వ్యాపారాలు మూతపడి, అక్కడ ఉద్యోగాలు తగ్గిపోయి ఆయాదేశాలలో నిరుద్యోగం ప్రబలింది. కార్మికుల జీతాలుకూడా ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోయాయి. ఫలితంగా ప్రజల కొనుగోలు శక్తి క్షీణించింది. దానితో అమెరికా, యూరప్ లలో సరుకుల వినియోగం క్షీణించటంతో, కొత్త పెట్టుబడులు పెట్టటానికి ఏ విధంగానూ పరిస్థితులు అనుకూలించక పోవటంతో, బ్యాంకులలో మూలుగుతున్న అపార ధనం కొత్త పెట్టుబడులుగా మారలేక, నిరర్థకమయ్యాయి. లాభాలు లేనిదే పెట్టుబడిదారీ వ్యవస్థ బతకలేదుకనుక, ఆ సొమ్ములను ఫైనాన్స్ పెట్టుబడులుగా మార్చి, దేశీయ, విదేశీయ వ్యాపారాలకు అప్పులుగా ఇచ్చి, వడ్డీలు వసూలు చేయటం ద్వారా కొంతకాలం పాటు వారు తమ ధనాన్ని మారకంలో పెట్టగలిగారు. మరొక ప్రక్కన, ప్రజలకు అప్పులు ఇచ్చి, తద్వారా అమ్మకాలు పుంజుకునేలా చేయగలిగినా, అంతిమంగా అది తాత్కాలిక లాభాలనే ఇవ్వగలిగింది. అప్పులు తీసుకున్నవారు తిరిగి అప్పులు చెల్లించవలసిందే కదా. ఆదాయాలు లేక, కొనుగోలు శక్తి క్షీణించిన ప్రజలు అప్పులైతే తీసుకున్నారుగాని, తిరిగి చెల్లించే స్థోమత వారికి లేక పోవటంతో, బ్యాంకులు దివాలా తీసే పరిస్థితి తలెత్తింది. అంటే మొదటగా లాభాలు క్షీణిస్తుంటే, విదేశాలకు పరిశ్రమలను, వ్యాపారాలను తరలించి, కూడగట్టుకున్న సొమ్ములను వినియోగించుకోలేక, మొదటికే మోసం వచ్చే పరిస్థితిని కొని తెచ్చుకున్నారు. గుత్త పెట్టుబడిదారీ బహుళజాతి కంపెనీలు ఈ విధంగా ప్రకృతి వనరులను వినాశనం చేసి, ప్రజలను దోచుకుని కూడబెట్టిన సొమ్ములు వినియోగించుకోలేనిది ఈ విచిత్రమైన పరిస్థితి. దానితో, మొత్తం ఆర్థిక వ్యవస్థే సంక్షోభంలో కూరుకుపోయి, దాని నుండి బయటపడే మార్గం లేక, ఆర్థిక వ్యవస్థ చప్పబడిపోయి, అచేతనమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. మార్క్స్ చెప్పినట్లుగా, పెట్టుబడి దారీ వ్యవస్థలో ఈ సంక్షోభాలు నిత్యం ముంచెత్తటం, ఈ ప్రక్రియలో సామాన్య ప్రజల జీవన స్థితులు దిగజారిపోయి, వారు తీవ్రమైన దారిద్ర్యంలో కొట్టుమిట్టాడటం ఈ వ్యవస్థ దుర్లక్షణం.

ఈ విధంగా గత 40 ఏళ్ళలో ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలు నయాఉదారవాద విధానాల ప్రభావంతో, పునర్ వ్యవస్థీకరించబడ్డాయి. పెట్టుబడిదారుల మధ్యన సాంప్రదాయక పోటీ స్థానంలో కొన్ని గుత్త పెట్టుబడిదారీ బహుళజాతి సంస్థల అధీనంలో ప్రపంచ వ్యాపారం బందీ అయింది. ప్రపంచ వ్యాప్తంగా ఫ్యూచర్స్ ట్రేడింగ్ పేరున ముడిసరుకుల, ఉత్పత్తుల ధరలను వీరే నిర్ణయిస్తారు. కొత్త పోటీదార్లు తలెత్తకుండా జాగ్రత్త పడతారు. ఏ వ్యాపారానికైనా, ఫైనాన్స్ సమకూర్చటానికి, షేర్ మార్కెట్‌లో వాటి షేర్ల ధరలను నిర్ణయించటానికి అంతిమ నిర్ణయం ఈ గుప్పెడు బహుళజాతి సంస్థలదే! ఈనాటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో శిఖరాగ్రాన బహుళజాతి గుత్త సంస్థలు, ఫైనాన్స్ సంస్థలు నిరంకుశ శాసనాధికారాన్ని చేజిక్కించుకున్నాయి. వీరిని కాదని ఏదేశం బ్రతికి బట్టకట్టలేదు. ఒక్కొక్క బహుళజాతి సంస్థ వ్యాపారం డజన్ల కొద్దీ దేశాల వార్షిక సంపద ఉత్పత్తికన్నా ఎక్కువ స్థాయిలో ఉంటుంది. మరొక పక్కన ప్రపంచ జనాభాలో అత్యధిక శాతం ప్రజలు తమ శ్రమశక్తిని అమ్ముకోవటం మినహా వేరే గత్యంతరం లేక, చాలీచాలని జీతాలతో, రోజురోజుకూ క్షీణిస్తున్న ఆర్థిక స్థితిగతులతో జీవనాన్ని వెళ్ళబోస్తున్నారు. ఈ విధంగా ప్రపంచం రెండు విభిన్న ధ్రువాలుగా విడిపోవటం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థ గతిలో తప్పనిసరిగా జరిగే క్రమమేనని మార్క్స్ 'పెట్టుబడి' గ్రంథంలో వివరించారు. లెనిన్ ఈ గుత్తపెట్టుబడిదారీ వ్యవస్థ పెట్టుబడికి అత్యున్నత దశ అని చెప్పారు.

(6వ భాగం వచ్చే ఆదివారం)

వ్యాస రచయిత : అఖిల భారత అభ్యుదయ వేదిక
జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు,
సెల్ : 09848933545

---

## గోవధపై నిషేధం : దాని పరిణామాలు

పి. ఆర్. ప్రకాశరావు

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గోవుల సంక్షేమానికై మద్యంపైన, టోల్ గేట్ల వసూళ్ళపైన 0.5 శాతం, హోల్‌సేల్ మార్కెట్లలో అమ్మకాలపై ఇదివరకే వున్న ఒక శాతం పన్నుకు మరో శాతం పన్ను విధించి గో సంరక్షణకు మహోపకారం చేశాననుకుంటున్నాడు. కానీ ఫలితం ప్రశ్నార్థకమే! అలా వచ్చిన ఆదాయంలో గోశాలలు నిర్మించి వీధులలో తిరుగుతున్న గోవులను అక్కడకు చేర్చి ఆ గోశాలల నిర్వహణను పర్యవేక్షించాలని జిల్లా అధికారులను ఆదేశించాడు. ఆచరణలో ఇప్పటికే కొన్ని స్కూళ్ళు, హెల్త్ సెంటర్లు గోశాలలుగా మారిపోయాయి. ఉత్తరప్రదేశ్ పేద రాష్ట్రంగాను పటిష్టమైన పరిపాలనలేనిదిగాను, మానవ హక్కులను పట్టించుకోని రాష్ట్రంగాను పరిగణించ బడుతుంది. అయినా ఆదిత్యనాథ్ పాలనలో వివిధ శాఖల నిధులను గోసంరక్షణకు మళ్లిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని, ఆర్థిక తదితర వనరులను వినియోగించే తీరు ఏ రకంగాను ప్రయోజనకరంగా లేదు. ఆరోగ్యానికి కేటాయింపులు బహుస్వల్పం. మానవాభివృద్ధిలో అనేక రాష్ట్రాల కంటే దిగువనే వున్నది.

గ్రామీణులు ఆవులను పాలిచ్చినంత కాలమే పోషించగలుగుతారు. గోవధనిషేధం వలన పాలివ్వని ఆవులను వీధులలో వదిలేస్తున్నారు. అవి పంటపొలాలలోనికి ప్రవేశించినా గట్టిగా కొట్టటానికి కూడా భయ పడుతున్నారు. వ్యవసాయంలో ట్రాక్టర్ల ప్రవేశంతో ఎద్దుల అవసరం దాదాపుగా లేకుండాపోయింది. అందువలన కోడె దూడలు భారమైనాయి. ఉత్తరప్రదేశ్‌లో సాలీన ఉపయోగం లేని (ముసలి) ఆవులు, ఎద్దులు 25 లక్షలు అదనంగా చేరుతున్నాయి. దీనితో రైతులు గణనీయంగా నష్టపోతున్నారు. వీటన్నిటిని ప్రభుత్వ నిధులతో పోషించవలసి వుంటుంది. రైతుల ఆర్థికపరిస్థితిని చక్కదిద్దాలనుకున్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితినే తలకిందులు చేయగల చర్యలకు పూనుకున్నారు. ఉత్తరప్రదేశ్ చర్యలనుండి బీజేపీ పాలనలో వున్న రాష్ట్రాలతో సహా ఇతర రాష్ట్రాల పాలకులు చేయకూడని పనులేవో తెలుసుకోవలసిన అవసరముంది.

(దక్కను హెరాల్డ్ సౌజన్యంతో)

---

ట్రంప్ అనాలోచిత నిర్ణయం

# విశ్వప్రళయానికి నాంది

దాసరి కృష్ణారెడ్డి

విశ్వ వసుధైక కుటుంబాన్ని సర్వత్రా కాలుష్య నివారణకు పారిస్ పర్యావరణ ఒప్పందంపై అమెరికా మొండి చేయి చూపడం ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలకు యావత్ ప్రపంచం నివ్వెరపోయింది. ట్రంప్ ప్రపంచ పర్యావరణానికి తమదే మొదటి స్థానమని ప్రజా వేదికలపై బాహాటంగా ప్రకటించడం, చివరికి పర్యావరణ పరిరక్షణకు తమ దేశాల వంతుగా నివారణకు అందివ్వాల్సిన నిధులను సవాలక్ష కారణాలు చెప్పి విశ్వవసుధైక కుటుంబానికి అంతా ఇంతా హాని కలిగించే విషయం కాదని ప్రపంచ దేశాల వారు భావించకపోవడం నిరాకరించడం ఏనాడో విశ్వ ప్రళయానికి నాంది పలుకుతుందనే నగ్న సత్యాన్ని గుర్తించకపోవటం అత్యంత బాధాకరమైన విషయం.

పర్యావరణం సమతుల్యంగా ఉండి, ప్రకృతి పరిరక్షణ జరగాలంటే గాలి, జలం, వాతావరణం, ప్రకృతి వనరులు సౌలభ్యంగా, సజావుగా కొనసాగాల్సిన పరిస్థితి ఎంతైనా ఉంది. విజ్ఞానం, శాస్త్రీయత పేరిట పెచ్చుమీరిన పారిశ్రామిక వనరులను పెంపొందించుకొని అగ్రరాజ్యం 20 శాతం పారిశ్రామికీకరణతో భూతలాన్ని 11 డిగ్రీల మేర భూతాపాన్ని పెంచడానికి కారణమయ్యిందని శాస్త్రీయ అధ్యయనాలు చాటుతున్నా తమకేమీ సంబంధం లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొట్టి పారేయడంలో ఇంగితము, విజ్ఞతను ప్రపంచదేశాలు గుర్తించి గర్హించాల్సిన అత్యవసర పరిస్థితి ఎంతైనా ఉంది.

### ప్రకృతి ప్రకోపాల నుంచి సమస్త భూమండలాన్ని రక్షించే పూచీ ఏమైంది?

2015లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా పారిస్‌లో కుదుర్చుకొన్న ఒప్పందాన్ని కాలరాచి స్వదేశీయ ప్రగతి కోసం గత మార్చిలో ఇంధన స్వావలంబనకు నిర్వాహక ఉత్తర్వుతో ట్రంప్ పెడధోరణులు అనుసరిస్తున్నారు.

ప్రపంచ దేశాల వ్యాప్తంగా పర్యావరణ కాలుష్య కాసారాన్ని ఉధృతి చేసే దేశాలలో అమెరికా ప్రథమ స్థానంలో ఉంది. అనునిత్యం బొగ్గు, పెట్రోలియం, సహజ వాయువుల్ని మండిస్తుండడంతో వాతావరణంలో గ్రీన్ హౌస్ వాయువుల పరిణామం అంతకంతకూ పెరిగి ప్రకృతి ప్రజ్వలనకు కారకమయ్యే బృహత్తర ప్రమాదం పొంచి ఉంది. ఒకసారి విడుదలైన బొగ్గు పులుసువాయువు, నైట్రస్ ఆక్సైడ్ లాంటి కర్బ నాలు పందేళ్ల పాటు వాతావరణంలో నిబిడీకృతమై ప్రకృతి ఉత్పాతాలు సృష్టించడం జరుగుతుందని ప్రకృతి, పర్యావరణ కాలుష్య శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తూనే ఉన్నారు.

పారిశ్రామిక కాలుష్య కాసారాన్ని మునుపటికంటే రెండు డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువగా ఉంచేందుకు కృషి చేయాలని 2015లో జరిగిన పారిస్ ఒప్పందంతో భూతాపాన్ని తగ్గించడమే కాకుండా ప్రకృతి విపత్తులను నివారించే మేలిమి ఒప్పందం నుండి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైదొలిగాడు స్వదేశాన్ని మరింత ప్రగతి మార్గంలో నడుపడమే తమ ధ్యేయమని సాకులు చూపుతూ ఒప్పందాలపట్ల పెడ మొహం పెడుతున్న అగ్రరాజ్యాధినేత అసంబద్ధ చర్యలకు ప్రపంచ దేశాలు గుర్రుగా ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 5,400 టన్నులు గ్రీన్ హౌస్ ఉద్గారాలను క్రమేపీ తగ్గుమొహం పట్టించాలన్న పారిస్ ఒప్పందానికి ట్రంప్ తూట్లు పొడవడానికి ప్రయత్నించడం విశ్వ వసుధకు విపత్తును కొని తెచ్చుకోవడం తప్ప మరొకటి కాదు.

భూతాప ఉత్పాతాలు, భూకంపాలు, సునామీలు, తీవ్ర గాల్పులు, భారీ వర్షాలు, పెచ్చుపెరిగిపోతున్న వరదలు, తీవ్ర కరువు కాటకాలు పరిరక్షించేందుకు మూకుమ్మడిగా ప్రపంచ దేశాల కూటమి చేసుకొన్న ఒప్పందానికి అమెరికా మోకాలొడ్డడం తీవ్ర ప్రకృతి బీభత్సాలకు తెరతీయడమేనని శాస్త్రవేత్తలు, ప్రపంచ దేశాధినేతలు మానవాళి మనుగడకు గొడ్డలిపెట్టని వ్యాఖ్యానిస్తున్నాయి. పారిశ్రామికీకరణకు ముందున్న స్థాయి కన్నా ఇప్పటికే 11 డిగ్రీల మేరకు భూతాపం పెరిగిందని, అందులో 20 శాతం అగ్రరాజ్య నిర్వాకమేనని అధ్యయనాలు చాటుతున్నాయి. 2030 నాటికి కర్బన ఉద్గారాలు ఏటా అదనంగా 300 కోట్ల టన్నులు దాకా వాతావరణంలో చేరి ఈ శతాబ్ది చివరకు 0.3 డిగ్రీల భూతాపం పెరుగుదలకు అగ్రరాజ్యమే కారణం కాగలదని శాస్త్రజ్ఞుల విశ్లేషణ. పారిస్ పర్యావరణం ఒప్పందంపై అమెరికా అత్యంత విశ్వసనీయత కనబరిచి చివరకు ట్రంప్ మాట మార్చారు. అంతేకాకుండా చైనా, ఇండియా మరి ఇతర దేశాలకు తమ దేశమేదో అలవోకగా కుప్పలు తెప్పలుగా ధనరాశులు కుమ్మరించడం వలన తమ దేశానికి బోలెడంత నష్టం వాటిల్లుతుందని ట్రంప్ అసత్యాలు, అర్ధసత్యాలను కలబోసి తిరోగామి నిర్ణయాన్ని అడ్డగోలుగా సమర్థించుకొంటున్నారు. అందుకు నిదర్శనంగా ఇంధన స్వావలంబన కార్యనిర్వాహక ఉత్తర్వును జారీ చేస్తూ, తాను కూర్చున్న కొమ్మ తానే తెగనరుకుతూ, ప్రపంచ వ్యాప్త పర్యావరణ కాలుష్యాన్ని రాజేస్తున్నారు. ఓజోన్ పొర కుచించుకుపోవడం, విశ్వ వ్యాప్త కాలుష్య కాసారాన్ని ద్విగుణీకృతం చేయడం, అగ్రరాజ్యాధినేత వక్రమార్గాన్ని అదుపులోకి తీసుకురావడం ప్రపంచ దేశాధినేతలంతా ఏకతాటిపై నిలిచి పారిస్ ఒప్పందం అమలుకు పూనుకోవాల్సిన అగత్యం ఎంతైనా ఉంది.

రచయిత ఫ్రీ లాన్సర్




**స్వర సరాగాల సంగీత నిలయం శతవసంత వేడుకలకు సిద్ధమయ్యింది. ఉద్దండ పండితుల గాన మాధుర్యంతో తడిసి ముద్దయిన ఈ నేల సాంస్కృతిక సంబరానికి సరిగమలు పలుకుతోంది.** ఎందరో మహానుభావులు....అందరికీ వందనాలంటూ స్వాగత గీతం వినిపిస్తోంది. విజయనగర అంబర వీధుల్లో మెల్లమెల్లగా గానామృత మేఘాలు కమ్ముకుంటున్నాయి. ముచ్చటగా మూడు రోజులపాటు స్వరాల వానగా కురిసేందుకు సిద్ధమయ్యాయి. తన అందెల రవళితో సమ్మోహితులను చేసేందుకు నాట్యమయూరి గజ్జెలు సర్దుకుంటోంది. ప్రపంచ సాంస్కృతిక రంగమంతా ఎంతో ఆశతో, అనురక్తితో ఎదురుచూస్తున్న విజయనగరం మహారాజా సంగీత, నృత్య కళాశాల వందేళ్ళ వేడుక ఆదివారం ప్రారంభమవుతోంది.




# శత సం...గీతం

## సాంస్కృతిక సంబరానికి వేళాయె



సంగీత, సాహిత్య ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న విజయనగరం మహారాజా ప్రభుత్వం సంగీత, నృత్య కళాశాల వందేళ్ళ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలుత సంగీత పాఠశాలగా ఆవిర్భవించిన ఈ కళాశాల ఫిబ్రవరి 5వ తేదీ నాటికి వందేళ్ళు పూర్తి చేసుకుంటోంది. ఈ అపూర్వ గడియలను పురస్కరించుకొని ఆది, సోమ, మంగళవారం మొత్తం మూడు రోజులపాటు వివిధ కార్యక్రమాల నిర్వహణకు అధికారులు రంగం సిద్ధం చేశారు. దేశవిదేశాల్లో స్థిరపడిన ఈ కళాశాల పూర్వ విద్యార్థులంతా ఈ వేడుకలకు తరలి వస్తున్నారు. ముఖ్యంగా దేశంలో, రాష్ట్రంలోని ప్రముఖ సంగీత విద్వాంసులందరికీ ఈ వేడుకలకు ఆహ్వానం అందింది. అతిథులందరికీ ఆశ్రయమిచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేసింది ప్రభుత్వం. సుమారు రూ.3 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళికను రూపొందిం చింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ శత వార్షిక వేడుకలకు కళాశాల భవనానికి మరమ్మతులు చేసి కొత్తశోభనద్దారు. ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

### వారసత్వ సంపదను భావితరాలకు అందించేందుకే



**విజయనగరానికి గొప్ప సాంస్కృతిక వారసత్వం ఉంది. ఈ ప్రాంతం కళలకు, సాహిత్యానికి పట్టుగొమ్మ. ఇలాంటి మహోన్నత వారసత్వాన్ని కొనసాగించేందుకు, మన సంగీత, సాహిత్యాల పరంపరను భావితరాలకు అందించేందుకు ఈ ఉత్సవాలు దోహదపడతాయి. అలనాటి ఎందరో ఉద్దండ పండితుల విద్వత్తును మరోసారి స్మరించడంతోపాటు, నేటి యువతలో స్ఫూర్తిని రగిలించి, సాంస్కృతిక రంగంవైపు దృష్టిపెట్టేందుకు కూడా ఈ శత జయంతి ఉత్సవాలు ప్రేరణనిస్తాయని ఆశిస్తున్నా.**

- డాక్టర్ ఎం.హరి జవహర్‌లాల్, జిల్లా కలెక్టర్

### సంగీత కళాశాల చరిత్ర ఇదీ



సంగీత, సాహిత్యాలను సమపాళ్ళలో ఆదరించిన అపూర్వ చరిత్ర పూసపాటి వంశీయుల సొంతం. వారి వంశంలో అగ్రగణ్యుడు పూసపాటి విజయరామ గజపతి మహారాజు (1883–1922) మహారాజ సంగీత నృత్య కళాశాల వ్యవస్థాపకులుగా ఎనలేని ఖ్యాతిని ఆర్జించారు. ఈ కళాశాల స్థాపన వెనుక మహారాజుకు మహోన్నత ఆశయం ఉంది. విజయరామ గజపతికి అంతరంగిక కార్యదర్శిగా చాగంటి జోగారావు పంతులు వ్యవహరించేవారు. అయిన కుమారుడు చాగంటి గంగబాబు అంధుడు. ఒకానొక సందర్భంలో గంగబాబును చూసిన విజయరామ గజపతి మనసు తీవ్రంగా కలత చెందింది. ఆ బాలుడికి భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బంది తలెత్తకూడదని, అతనికి మంచి జీవనోపాధి నివ్వాలనే ఉద్దేశం కలిగింది. దీంతో ఆస్థాన వైద్యులైన రామయ్యతో చర్చించి, సంగీత పాఠశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఫలితంగా ప్రప్రధమంగా 1919 ఫిబ్రవరి-5న శ్రీ విజయరామ గాన పాఠశాల ఆదిభట్ల నారాయణదాసు అధ్యక్షతన ఏర్పాటయ్యింది. అంతకుముందు టౌనుహాలుగా ఉన్న సుందర, సువిశాల భవనాన్ని, స్థలాన్ని ఈ గాన పాఠశాలకు మహారాజు దానం చేశారు. ఆ తరువాత ఈ పాఠశాలే మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలగా రూపుదాల్చింది.

#### ప్రధానాచార్యులు

తొలి అధ్యక్షునిగా హరికథా పితామ హులు ఆదిభట్ల నారాయణదాసు, అనంతరం పద్మశ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడు, సంగీత కళాభూషణ ద్వారం నరసింగరావునాయుడు, ద్వారం భావనారాయణ, వేదునూరి కృష్ణమూర్తి, శ్రీరంగం గోపాలరత్నం, ద్వారం దుర్గాప్రసాదరావు, పివిఎస్ శేషయ్యశాస్త్రి ప్రధానాచార్యులుగా అమూల్యమైన సేవలను అందించారు. ప్రస్తుతం బురిడి అనురాధా పరశురామ్ ప్రధానాచార్యులుగా ఉన్నారు.

#### పూర్వ విద్యార్థులు

గాత్ర విభాగంలో నూకల సత్యనారాయణ శాస్త్రి, వేదునూరి కృష్ణమూర్తి, నూకల చిన సత్యనారాయణ, బి.లక్ష్మినాయుడు, పి.సుశీల, ఘంటశాల వెంకటేశ్వరావు, సాలూరి రాజేశ్వరావు, వీణ విభాగంలో పప్పు సోమేశ్వరరావు, మంచాల జగన్నాధరావు, ఖండవిల్లి జనార్ధనాచార్యులు, అశ్వద్ధామ కవిరాయుని జోగారావు, పివిఎస్ అనంతరావు, వయోలిన్ విభాగంలో పుల్లెల పేరి సోమయాజులు, ఎన్‌సి కృష్ణమాచార్యులు, అంపోలు మురళీకృష్ణ, ఆకెళ్ల మల్లిఖార్జున శర్మ, ఇవటూరి విజయేశ్వరావు, ద్వారం సత్యనారాయణరావు మొదలగు ఎందరో విద్వాంసులు ఇక్కడ విద్యనభ్యసించి, దేశవిదేశాల్లో పేరుప్రఖ్యాతులు గడించారు. ఈ కళాశాల కీర్తిని విశ్వవ్యాప్తంగా చేశారు. అంతేకాకుండా ఈ సంగీత నృత్య కళాశాలలో అధ్యాపకులుగా పనిచేసినవారు, పూర్వ విద్యార్థులు ఆకాశవాణి, టివీల్లో స్టార్ ఆర్టిస్టులుగా పనిచేస్తున్నారు.

#### కోర్సులు

ప్రస్తుతం కళాశాలలో గాత్రం, వీణ, వయోలిన్, నాదస్వరం, మృదంగం, భరతనాట్యం, డోలు కోర్సుల్లో నాలుగేళ్ల సర్టిఫికేట్ కోర్సు, రెండు సంవత్సరాల డిప్లమో కోర్సు ఫుల్‌టైమ్ మరియు పార్ట్‌టైమ్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులకు శ్రీవరాహ నరసింహస్వామి దేవస్థానం భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తోంది. పేద విద్యార్థులకు ప్రేమసమాజం కూడా భోజన సదుపాయాన్ని కల్పిస్తోంది.

- మజ్జి వాసుదేవరావు, విజయనగరం.
ఫోన్ : 9440192538

---

**దక్షిణ భారతదేశ టూరిజమ్ అనగానే మొదటగా గుర్తుకువచ్చేది కేరళనే. అందుకనే కాబోలు కేరళను పర్యాటకానికి మారు పేరుగా చెబుతుంటారు.** మలబారు తీరం వెంబడి ఉన్న అందమైన నగరం కేరళ. దీన్ని జీవితంలో ఒక్కసారైనా చూడాలని ప్రతి ఒక్కరు ఉవ్విళ్లూరూతుంటారు. కేరళకు ఇంతటి అందాన్ని ఇచ్చింది అరేబియా సముద్రమనే చెప్పుకోవాలి. పశ్చిమాన అరేబియా సముద్రం, తూర్పున పశ్చిమ కనుమలతో సుందరమైన గమ్యస్థానాలు కేరళ ప్రత్యేకత.

గాడ్స్ ఓన్ కంట్రీగా పేరొందిన కేరళకు ప్రపంచ పర్యాటకంలోనే విశిష్టమైనటువంటి గుర్తింపు ఉంది. కేరళలోని పచ్చపచ్చని ప్రదేశాలు, కొబ్బరి తోటలు, బీచ్‌లు, ఆహ్లాదకరమైన బ్యాక్ వాటర్స్‌లో బోట్ ప్రయాణాలు, ఆయుర్వేద వైద్య సుగంధాలు, సరస్సులు వాటి అందాలతో పర్యాటకుల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తున్నాయి. కాసర్ గోడ్, కన్నూర్, వయనాడ్, కోజికోడ్, మలప్పురం, పలక్కాడ్, త్రిస్సూర్, ఎర్నాకుళం, ఇదుక్కి, కొట్టాయం, అలపుజ(అలెప్పీ) పాతనం తిట్ట, కొల్లం, తిరువనంతపురం వంటి ప్రాంతాలు కేరళ టూరిజంలోనే ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రదేశాలు. సెలవు రోజుల్లో ఆనందంగా విహరించాలనుకునే వారికి కేరళ చక్కటి ప్రదేశం. బిజీబిజీగా నగర జీవితాలతో అలసిపోయిన వారికి ఇక్కడి ప్రశాంత వాతవరణం మీలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది.

# కేరళను చూసి తీరాల్సిందే..!



### సరస్సులు


కేరళ పర్యాటక ఆకర్షణల్లో మరొకటి సరస్సులు. వెంబనాడు, అష్టముడి, పూకోడు, సస్థంకొట్ట, వీరనపూజ వెల్లాయని, పరవూర్ కాయల్, మనచిరా సరస్సులు కేరళ అందాన్ని మరింత పెంచుతున్నాయి. వెంబనాడు సరస్సును భారతదేశంలోని పెద్ద సరస్సుల్లో ఒకటిగా చెబుతారు.



### బీచ్‌లు

బీచ్‌లు ఎక్కువగా ఉన్న కేరళ ఫ్యామిలీ టూర్స్, హనీమూన్ టూర్స్, సాహస యాత్రలకైన, ఆయుర్వేద చికిత్సకు ప్రసిద్ధి చెందింది. దాదాపు 580కిలోమీటర్ల మేర బీచ్‌ను కలిగి ఉంది. వర్కాల, బేకాల్, కోవలం, మీనకున్ను, షెరాయ్, పయ్యంబాలం, శంగుముఖం, ముజుప్పిలంగాడ్ బీచ్‌లు బాగా ఫేమస్ అయ్యాయి. బీచ్‌లల్లోని ఆహ్లాదకరమైన వాతావరణం అలసిన మనసుకు ఊరటనిస్తుంది. బీచ్‌లలో సాయంత్రం సమయం ఎప్పటికి గుర్తుంచుకునే అనుభూతుల్ని ఇస్తుంది.






### హిల్ స్టేషన్స్

కేరళలోని అందమైన హిల్ స్టేషన్స్‌లో ముఖ్యమైనది మున్నార్. దక్షిణ భారతదేశంలోని హిల్ స్టేషన్స్‌తో పోలిస్తే దీనిలో వాణిజ్య కలాపాలు చాలా తక్కువ. ఒక రకంగా చెప్పాలంటే కొత్త జంటలకు ఇది అనువైన ప్రదేశంగా చెప్పుకోవచ్చు. ఇది వయానాడ్‌కు సమీపంలో ఉంది. వాగమన్, పొన్ముడి, ధెక్కడి, పీర్ మేడ్ మొదలైనవి ప్రసిద్ధి చెందిన హిల్ స్టేషన్స్, ధెక్కడి వన్యజీవులకు, సాహస క్రీడలకు ప్రసిద్ధి.

### బ్యాక్ వాటర్స్

కేరళలోని బ్యాక్ వాటర్స్ దీనికొక విశిష్ట స్థానాన్ని తెచ్చిపెట్టాయి. అలెప్పీ, కుమరకోం, తిరువల్లం, కొల్లం, కాసర్‌గోడ్‌లో బ్యాక్ వాటర్స్ ఉన్నాయి. ఈ బ్యాక్ వాటర్స్ కేరళ వచ్చిన వారికి మర్చిపోలేని అనుభూతిని ఇస్తాయి. ఈ బ్యాక్ వాటర్స్‌పై ప్రయాణించడానికి హౌస్ బోట్లు అందుబాటులో ఉన్నాయి. కేరళలో బ్యాక్ వాటర్ రిసార్ట్‌లు ఉన్నాయి. బ్యాక్ వాటర్లపై ప్రయాణించడానికి కెట్టువలములును కూడా ఉపయోగిస్తారు. కేరళ పర్యాటక శాఖ వారు వచ్చే టూరిస్ట్‌ల కోసం హౌస్ బోట్లలో అభివృద్ధి చెందిన వినోద సౌకర్యాలను కలగజేశారు. దీంతో హౌస్ బోట్‌లు నిజంగా హౌస్‌ను తలపిస్తుంది. కేరళలో ప్రతి ఏటా సాంప్రదాయక స్నేక్ బోట్ రేసు ప్రతి ఏటా కేరళలో జరుగుతుంది. ఈ రేసును చూడటానికి వేల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు.



# నేను - సుడిగుండం

(నవల) 34

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575

## నిన్నటి సంచిక తరువాయి

వెన్నెల నన్ను చూస్తోంది. నేను ఎలా ప్రతిస్పందిస్తానా అనుకుంటుందేమో!

"టెన్త్ అయింది. అక్కడితో చదువు మానేసి కుట్లూ, అల్లికల లాంటివి నేర్చుకో అన్నారు. నేను ఇంటర్ చదివి తీరుతాను అన్నాను. ఒప్పుకోలేదు. అందుకు పెద్ద యుద్ధం చేయాల్సి వచ్చింది. అప్పుడే నాకు మూర్తి పరిచయం అయ్యాడు. ఇంటర్ మీడియట్ అయ్యాక నన్ను చదువుకు పంపించలేదు. మూర్తిది వేరే కులం. అందులోనూ దళితుడు. తర్వాత మేం ఇంటి నుంచి బయటకు రావటం అంతా పెద్ద కథ" అంది.

నేను వెన్నెలని చూస్తున్నాను. అర్చన పెళ్లి తను అంగీకరించలేక పోయింది. విస్సు దళితుడు కాదు. బీ.సీ.వర్గాలకు చెందినవాడు. ఇప్పుడు గంగ విషయంలో ఎలా ఫీలవుతుందా అని చూసాను. వెన్నెల ముఖం ప్రశాంతంగా వుంది. ఎలాంటి వ్యతిరేకతా తనలో కనిపించ లేదు.

"ఇప్పుడు నిన్ను కలవటానికి కారణం వుంది బావా.... నాకు ఆ కుటుంబంతో సంబంధం లేదని వారు అనుకోవచ్చు. అయినా అక్కడ పుట్టాను. మా కుటుంబం తరపున మమ్మల్ని క్షమించమని నిన్నూ, వెన్నెలని అడగటానికి వచ్చాను" అంది.

"అవన్నీ ఎందుకు... మావయ్యా వాళ్లు ఏమీ పట్టించుకోకపోవటం వల్ల నాకు మంచి జరిగింది. పట్టించుకుని వుంటే నాలో ఇంత కసి వుండేది కాదేమో!" అన్నాను.

"ఇప్పుడు ఇవన్నీ చెప్పుకుంటానికి బాగుంటాయి. నువ్వూ అత్తలాంటి వాడివే. నువ్వు ఇప్పుడు మంచి స్థితిలో వున్నావు కాబట్టి... మనసు మంచిది కాబట్టి ఇలా అంటున్నావు. నా దృష్టిలో తప్పు తప్పే. ఇంకో అనుమానం రావచ్చు. నేను ఈ స్థితిలో లేకుంటే నువ్వు వచ్చేదానివా? ఇలా మాట్లాడేదానివా అని... నీ దగ్గరకు రావటానికి మొహమాటం అనిపించింది. భయం కలిగింది. అందుకే ఇన్ని రోజులు ఆగాను"

తర్వాత వెన్నెలని చూస్తూ...

"నేను నరసయ్య బాబాయిని కలుస్తాను. మమ్మల్ని మన్నించమంటాను" అంది.

"నువ్వు ఒక్కదానివే వచ్చావేంటి? బావగారిని తీసుకు రావచ్చు కదా" అంది.

"చెప్పాను కదా... నేను రావటానికే చాలా ఆలోచించానని. ఎప్పుడో ఒకరోజు తప్ప కుండా వస్తాం. ఆయనకి మావయ్యా వాళ్లు మూర్తి అని పేరు పెట్టుకున్నారు. మంచి వాళ్లు. కూలి పనులు చేసి చదివించుకున్నారు" అంది.

"ఇప్పుడు ఏం చేస్తున్నారు మూర్తి?"

"చిన్న ఫ్యాక్టరీలో క్లర్క్ ఉద్యోగం. నేను చిన్న బడిలో టీచర్ గా పని చేస్తున్నాను" అంది.

అర్చన గురించి వివరాలు తెలుసుకుంది. మంచి పని చేసింది అంది. ఈ తరంలో అయినా మనం సంబంధాలు మెరుగు పరుచుకుందాం అంటూ తమకు ఇంకా పిల్లలు లేరు అంది.

అప్పుడు అమ్మ గుర్తు వచ్చింది.

నావరకు నాకు తృప్తిగా అనిపించింది. గంగ నా నుండి ఏదో సహాయం ఆశించి రాలేదు. నిజంగానే గొప్ప నిర్ణయం తీసుకుంది. ఓసారి మూర్తితో రమ్మన్నాను.

ఆ తర్వాత నరసయ్య మావయ్య దగ్గరకు వెళ్లింది. ఆయనా, అత్తయ్య ఆనందంగా రిసీవ్ చేసుకున్నారంట.

నాకు అర్థం కానిది- అర్చన విషయంలో ఎందుకంతగా మావయ్య కదిలిపోయాడనేది!

*************

ఎన్నో సంచలనాలు... సంక్షోభాలు

మొదట్లో మేం సినిమాల మీద తీవ్రంగా విమర్శలు చేయటం జరిగింది. అందువల్ల వాటి వసూళ్ల మీద ప్రభావం పడింది. లక్షలూ, కోట్లతో మేం సినిమాలు చేస్తుంటే మీరు మీ విమర్శలతో మాకు నష్టం కలిగిస్తున్నారు అని వారు గగ్గోలు పెట్టారు.

'రిసిషన్' అమెరికా సమాజాన్ని కుదిపేసింది.



అప్పుడది తెలుగువారి మీద ఎలాంటి ప్రభావం చూపించిందో కవర్ చేసాం.

యుద్ధం సమయంలో, తుఫాన్లు, సునామీలు విరుచుకు పడినప్పుడు, ఎన్నికల సమయంలో, రాత్రీ పగలూ తేడా లేకుండా పని చేయటం జరిగింది.

ఇవన్నీ అటుంచితే ఛానళ్లు పెరగటం. ప్రకటనలు ఇవ్వాలంటే రేటింగ్‌ల ఆధారంగా యిస్తారు. అందులో రాజకీయాలు వున్నాయి.

ఇవన్నీ కనీసం నోట్ చేసుకునే తీరిక లేదు. అవన్నీ పాయింట్లుగా మాత్రం నా కంప్యూటర్‌లో వున్నాయి. ఏదో ఒక రోజు నేను ఇవన్నీ ఓ క్రమంలో రాస్తూ పోతాను.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే, అత్యంత సామాన్యుల్ని, వారు నిశ్శబ్దంగా చేసుకుంటూ పోతున్న కృషిని గుర్తించి వారికి అవార్డులనిచ్చే పనిని నేను మొదలు పెట్టాను. ఎన్‌కౌంటర్లు జరిగినప్పుడు మేధావులతో చర్చలు జరిపాం.

నా అదృష్టం ఏమిటంటే....

"నువ్వు ఎప్పుడూ ప్రయాణాలు చేస్తుంటావు. మా కోసం కొన్ని గంటల సమయం ఇవ్వటం లేదు" అని వెన్నెల అనలేదు. నిదా అప్పుడప్పుడు అలిగేది. మావయ్య నా దగ్గరకు రావటానికి అంగీకరించ లేదు - మధ్యలో ఎన్ని ప్రయత్నాలు చేసినా!

*************

**రహస్య సమావేశం!**

ఓ పార్టీ అధ్యక్షుడిని మనం కలవాలి ప్రభాత్... ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి అన్నాడు.



నేను రాజకీయంగా సంచలనం కలిగించే వార్తలు వుంటాయని ఆయన్ని కలుసుకున్నాను.

"మనం ఓ ఛానల్ పెట్టాలి. మొత్తం నువ్వే చూసుకోవాలి. మొదట్లో ఈ మీడియా ఇంత పవర్ ఫుల్‌గా జనం మీద ప్రభావం చూపిస్తుందని మేం అనుకోలేదు"

"నేను చూసుకోవటం ఏంటి? మీరు పార్టీ తరపున ఛానల్ పెట్టండి" అన్నాను.

"పార్టీలో అది కూడా చర్చించాం. పార్టీ ద్వారా పత్రిక పెట్టినా, ఛానల్ పెట్టినా ప్రజలు నమ్మరు. అందుకే ఈ ఛానల్ మన పార్టీని డైరెక్ట్‌గా సపోర్ట్ చేయదు. రోజు వారీ కార్యక్రమాలు నీ ఇష్టం. ఎన్నికలప్పుడు మాత్రం ప్రజాభిప్రాయం, సర్వేలతో పాటు మనకు అనుకూలంగా పని చేయాలి"

నేను ఆయన కళ్లలోకి సూటిగా చూస్తున్నాను.

"మాది నేషనల్ పార్టీ. ఇప్పుడున్నవి కూడా ఏదో ఒక పార్టీకి కొమ్ముకాసేవే. అది నీకు తెలియంది కాదు. మేం తెలుగులోనే కాదు. వీలయినన్ని భాషల్లో ఛానల్స్ తీసుకు రావాలనుకుంటున్నాం. మనకు ఎన్ని నష్టాలు వచ్చినా కంటిన్యూ చేస్తాం. అన్నింటికీ నువ్వు హెడ్ వి"

"ఇందులో నీకు నలభై శాతం వాటా వుంటుంది. నువ్వు మాకు బినామీగా వుంటావు. మిగతా విషయాల్లో ఇప్పుడు రమాకాంత్ యిస్తున్నదాని కంటే రెండు రెట్లు తీసుకో" అన్నాడు.

నేను సున్నితంగా తిరస్కరించాను.

"నన్ను నమ్మి రమాకాంత్‌గారు ఈ బాధ్యత నా మీద పెట్టారు. ముందుగా నన్ను గుర్తించింది ఆయన. నేను కంఫర్టబుల్‌గా వున్నాను. అందుకని మీ ఆఫర్‌ని అంగీకరించలేను" అన్నాను.

"నువ్వు నాకు నచ్చావు ప్రభాత్ రాజకీయాల్లోనూ, మీడియాలోనూ, మొత్తంగా సమాజంలో నీతి తక్కువయిపోతోంది. ఎవరికి వారు అభివృద్ధి కావాలనుకోవటంలో తప్పు లేదు. అయితే సంవత్సరాలుగా పార్టీలో అన్ని పదవులు అనుభవించి, ఓసారి ఎన్నికల్లో ఓడిపోగానే వేరేదారి చూసుకుంటున్న వారున్నారు. అధికారం, పదవి తప్ప వారికి ఇంకో ఎజెండా వుండదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పని చేస్తున్నప్పుడు ఆ అవలక్షణాలు ఎవరినీ విడిచి పెట్టవు" అన్నాడాయన.

చిన్నగా నవ్వాను.

"నిన్ను చూస్తే ముచ్చటగా వుంది. ఇవన్నీ వర్కవుట్ చేయటానికి యింకా సమయం వుంది. ఎన్నికలు యింకో సంవత్సరంలో జరుగుతాయి అనగా మనం మొదలు పెడతాం. ఇవన్నీ మనసులో వుంచుకో. ఇప్పటికీ మనం అంటున్నాను. ఈ ఆఫర్ ఎప్పటికీ లైవ్‌లో వుంటుంది. ఆలోచించుకో" అన్నాడు.

ఒక్కరోజులో ఇలాంటివన్నీ జరగవు అని ఆయనకు తెలుసు. ఓ ప్రయత్నం చేసాడు. నేను అతని దగ్గర నుండి వచ్చాను.

అమెరికా తన పనులు మీద వెళ్లిన రమాకాంత్ నాలుగు రోజుల తర్వాత వచ్చాడు.

"ప్రభాత్... మీ సమావేశం ఎలా జరిగింది?" అన్నాడు

నాకు ఆశ్చర్యం కలిగింది.

"నువ్వు టెంప్ట్ కావని నాకు తెలుసు. మనం ఇప్పుడు ఇతర భాషల మీద దృష్టి పెడుతున్నాం. ఆంగ్లం, హిందీ ఛానల్స్ వుంటాయి. కనీసం పదిహేను భాషల్లో మనం ఛానల్స్ పెట్టాలి. ఒక్కొక్కటి లాంచ్ చేసుకుంటూ వెళ్తాం" అంటుంటే... నేను యింకా షాకింగ్‌లో వున్నాను.

"ఈ విషయం నాకు ఎలా తెలిసింది అనుకుంటున్నావా? మీడియా అంటేనే అది" అన్నాడు చిరునవ్వుతో.

"నేను మీకు వెంటనే ఇది చెప్పాలనుకున్నాను. మిమ్మల్ని డిస్టర్బ్ చేయటం ఎందుకనుకుని మీకోసం వెయిట్ చేస్తున్నాను" అన్నాను.

"నువ్వు నాకు చెప్పలేదని ఫీల్ అవను. ఇంకోమాట... నిన్ను నా దగ్గర వుండమని అనటం లేదు. ఇది నీకు మంచి ఆఫర్ అనుకుంటే నిన్ను నాతో వుండమని ఫోర్స్ చేయను" అన్నాడు.

"నాకు అలాంటి ఉద్దేశం లేదు. పొలిటికల్‌గా ఏదన్నా సంచలనం కలిగించే విషయం అనుకుని వెళ్లాను" అన్నాను.

"నాకు తెలుసు. ఇది ఇంతటితో ఆగదు. ముందు ముందు ఇలాంటి ఆఫర్స్ చాలా వస్తుంటాయి. వివేకం కొంతకాలం పని చేస్తుంది. మనం అన్ని సమస్యలనీ మెయిన్ ఛానల్లో కవర్ చేయలేకపోతున్నాం. అందుకే ఇంకో రెండు ఛానల్స్ తెలుగులో పెడదాం. ముఖ్యంగా భక్తి ఛానల్. ఈ రోజు డబ్బు రాజకీయ నాయకుల దగ్గరా, పారిశ్రామిక వేత్తల దగ్గరా వుంటుంది. ఆ తర్వాత భక్తి. ఆధ్యాత్మికత. అంతకుమించిన వ్యాపారం వుండదు" అన్నాడు.

(ఇంకా ఉంది)

## రూ.27.84 లక్షల కోట్లతో మధ్యంతర బడ్జెట్

కేంద్రప్రభుత్వం ఈనెల ఒకటో తేదీన పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆర్థికశాఖ తాత్కాలిక మంత్రి పియూష్ గోయెల్ 2019-20 సంవత్సరానికి 27,84,200 కోట్లతో ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆదాయపన్ను పరిమితిని రూ. 5 లక్షలకు ప్రభుత్వం పెంచింది. అసంఘటిత రంగ కార్మికులకు రూ.3 వేలు పింఛను చెల్లించనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం ప్రతినెలా రూ.100 చెల్లించాలని షరతు విధించింది. రూ.75 వేల కోట్లతో పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని ఏర్పాటు చేయనుంది. ఐదెకరాల లోపు ఉన్న రైతులకు మూడు విడతల్లో




రూ.6 వేలు వంతున చెల్లించనున్నట్లు ప్రకటించింది. గ్రాట్యుటీ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. 2022 నాటికి అందరికీ ఇళ్లు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

## ఇనాక్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రదానం



ప్రముఖ రచయిత కొలకలూరి ఇనాక్ తన 'విమర్శిని' గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును జనవరి 29న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. అకాడమీ అధ్యక్షుడు చంద్రశేఖర కంబార ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఇనాక్ మాట్లాడుతూ, అవార్డు రావడం ఆలస్యమైనా ఆనందంగా ఉందన్నారు.

## అమెరికాలో నకిలీ విద్యార్థి వీసా రాకెట్ గుట్టు రట్టు

అమెరికాలో నకిలీ విద్యార్థి వీసా రాకెట్‌ను అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు ఛేదించారు. ఒక రహస్య ఆపరేషన్ నిర్వహించి తెలుగు రాష్ట్రాలకు చెందిన 8 మంది దళారులను అరెస్ట్ చేశారు. విద్యార్థి వీసా పేరిట అమెరికాలో అక్రమంగా నివసించేందుకు, ఉద్యోగం చేసుకునేందుకు వీరు 600 మందికి తోడ్పాటు అందించారని అధికారులు ఆరోపించారు. ఈ వ్యవహారంలో కొందరు విద్యార్థులనూ అదుపులోకి తీసుకుంటున్నారు. వీరిని స్వదేశాలకు పంపేందుకు చర్యలు చేపట్టారు. వీరిలో ఎక్కువమంది భారతీయులే. తెలుగువారూ పెద్దసంఖ్యలో ఉన్నారు. నిందితులపై మిచిగాన్ రాష్ట్రంలోని కోర్టులో అధికారులు చార్జిషీటు దాఖలు చేశారు. కొంతకాలం క్రితం అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు నకిలీ యూనివర్సిటీని ఏర్పాటు చేసి ఈ రాకెట్ గుట్టును రట్టు చేశారు.




## షట్‌డౌన్‌కు తాత్కాలికంగా తెర

అమెరికాలో సుదీర్ఘకాలం కొనసాగిన ప్రభుత్వ 'షట్‌డౌన్'కు తాత్కాలికంగా తెర పడింది. 'సరిహద్దు గోడ' నిర్మాణానికి నిధులు మంజూరు చేయించుకోవాలన్న తన డిమాండ్ నెరవేరకున్నా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రాజకీయ ఒత్తిడికి తలొగ్గి, ప్రతిపక్ష డెమోక్రాట్లతో తాత్కాలికంగా రాజీపడ్డారు. వచ్చే మూడు వారాల పాటు ప్రభుత్వ వ్యయానికి నిధులు అందించే బిల్లుపై జనవరి 25న సంతకం చేశారు. అంతకు ముందు కాంగ్రెస్‌లోని హౌస్, సెనేట్‌లు మూజువాణి పద్ధతిలో ఈ బిల్లుకు ఆమోదం తెలిపాయి. గోడ నిర్మాణం విషయంలో తాను వెనక్కి తగ్గేది లేదని ట్రంప్ స్పష్టం చేశారు.

## అమెరికాలో రికార్డుస్థాయికి పడిపోయిన ఉష్ణోగ్రతలు

అంతర్జాతీయ వార్తలు

అమెరికాలో కనీవినీ ఎరుగని రీతిలో శీతలగాలులు వీస్తున్నాయి. పోలార్ ఒర్టెక్స్ ప్రభావం కారణంగా ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వీస్తున్న గాలులతో అనేక రాష్ట్రాల్లో జనవరి 30 నాటికి రికార్డు స్థాయిలో మైనస్ 65 డిగ్రీల ఫారిన్‌హీట్ (మైనస్ 53 డిగ్రీల సెల్సియస్) వరకు పడిపోయాయి. దీంతో పశ్చిమ మధ్య భూభాగం (మిడ్ వెస్ట్) ఎక్కువగా ప్రభావితమైంది. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ప్రకటించారు. అత్యవసర ఆశ్రయ కేంద్రాలను ప్రభుత్వం తెరిచింది. పెద్దసంఖ్యలో విమానాలు రద్దయ్యాయి. విపరీతంగా కురుస్తున్న మంచు కారణంగా ఇప్పటివరకు నలుగురు మరణించారు. విపరీతమైన హిమపాతం, మైనస్ 10 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో బ్రిటన్‌లోనూ పలు నగరాల్లో విమానాశ్రయాలు మూసివేయవలసి వచ్చింది. అనేక పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. స్కాట్లాండ్ అతి శీతలంగా మారింది.

## 18 కక్ష్యల్లోకి పీఎస్ 4

జాతీయ వార్తలు వీక్లీ రౌండప్

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ44 వాహక నౌకలోని పీఎస్ 4 దశ 18 కక్ష్యల్లోకి ప్రవేశించిందని షార్ డైరెక్టర్ ఎస్.పాండ్యన్ తెలిపారు. నెల్లూరు జిల్లా షార్‌లో ఈనెల 26న ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇప్పటివరకు తాము పంపిన రాకెట్లు 8 కక్ష్యల్లోకి మాత్రమే వెళ్లేవన్నారు. సాధారణంగా ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకెళ్లే రాకెట్ చివరి దశ పీఎస్ 4 రోదసీలోనే ఉండి అక్కడే వ్యర్థ పదార్థంగా మారిపోతుందన్నారు. తాజాగా పంపిన సీ44లోని పీఎస్ 4 రాకెట్‌ను ఇలా వ్యర్థంగా మారకుండా ఉపయోగించుకునే వినూత్న సాంకేతికతను ఇస్రో అభివృద్ధి చేసినట్లు వివరించారు. రాకెట్ నాలుగో దశ ఉన్నత కక్ష్యలోకి వెళ్లి.. అక్కడ ఆర్బిటల్ ప్లాట్‌ఫాం (వేదిక)గా ఉపయోగపడుతుందని చెప్పారు. భవిష్యత్‌లో ఇస్రో చేపట్టే ప్రయోగాలకు ఇది ఉపకరిస్తుందని తెలిపారు.

## రాజ్‌పథ్‌లో గణతంత్ర దినోత్సవం

దేశ 70వ గణతంత్ర వేడుకలు జనవరి 26న ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో కన్నులపండువగా జరిగాయి. ఈ వేడుకల్లో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. సైనిక కవాతు ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్ర మోడీ ఇండియా గేట్ వద్ద ఉన్న 'అమర్ జవాన్ జ్యోతి'కి పుష్పాంజలి ఘటించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ లాన్స్ నాయక్ నజీర్ అహ్మద్ వానీకి అశోక్‌చక్ర పురస్కారాన్ని ప్రదానం చేశారు. కాశ్మీర్‌లో గత నవంబర్‌లో ఉగ్రవాదులతో పోరాడుతూ ప్రాణాలర్పించినందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ అవార్డును నజీర్ సతీమణి అందుకున్నారు. అనంతరం కవాతు జరిగింది. రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు.

## కేంద్ర మాజీ మంత్రి ఫెర్నాండేజ్ కన్నుమూత

సోషలిస్టు ప్రముఖుడు, ప్రజా పోరాట యోధుడు, రక్షణశాఖ మాజీ మంత్రి జార్జి ఫెర్నాండేజ్ (88) జనవరి 29న ఢిల్లీలో కన్నుమూశారు. కొన్నేళ్లుగా అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్న ఆయన చాలాకాలంగా ప్రజా జీవితానికి దూరంగా ఉన్నారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. 1974లో దేశవ్యాప్తంగా కార్మిక సమ్మెకు నాయకత్వం వహించిన కార్మిక నేతగా, కోకాకోలా, ఐబీఎం సంస్థలను దేశం విడిచి వెళ్లేలా చేసిన పరిశ్రమల మంత్రిగా, పోఖ్రాన్ అణు పరీక్షలను, కార్గిల్ యుద్ధాన్ని పర్యవేక్షించిన రక్షణ మంత్రిగా దేశంపై ఫెర్నాండేజ్ బలమైన ముద్ర వేశారు. ఆయన కర్ణాటకలో జన్మించినప్పటికీ బీహార్‌ను కర్మభూమిగా మలచుకున్నారు. ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితి విధించిన తరువాత అరెస్టయి జైలులో ఉన్నారు. 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో జైలునుంచే ఆయన నామినేషన్ వేసి గెలుపొందారు. నాలుగు దశాబ్దాల్లో బీహార్‌లోని పలు లోక్‌సభ స్థానాలకు ప్రాతినిధ్యం వహించారు. చిట్టచివరిగా 2009-10లో బీహార్ నుంచే ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు.



## సీబీఐ కేసు నుంచి వైదొలగిన జస్టిస్ రమణ

సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం.నాగేశ్వర రావు నియామకాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన వ్యాజ్యాన్ని విచారించే ధర్మాసనం నుంచి జస్టిస్ ఎన్.వి.రమణ వైదొలిగారు. తామిద్దరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారమని, ఆయన కుమార్తె వివాహానికి తాను హాజరయ్యానని తెలిపారు. అందువల్ల తాను ధర్మాసనంలో కొనసాగబోవడంలేదని, వ్యాజ్యాన్ని తగిన ధర్మాసనానికి అప్పగించాలని జనవరి 31న ఆయన ప్రధాన న్యాయమూర్తిని కోరారు. ఈ కేసు నుంచి వైదొలగిన న్యాయమూర్తుల్లో ఆయన మూడోవారు.

## నవభారత నిర్మాణానికి చేతులు కలుపుదాం : రాష్ట్రపతి

నవభారత నిర్మాణానికి కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని, దానిని సాకారం చేయడానికి అందరం చేతులు కలుపుదామని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పిలుపునిచ్చారు. 16వ లోక్‌సభ చివరి సమావేశాల సందర్భంగా జనవరి 31న పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి సెంట్రల్ హాలులో ఆయన ప్రసంగించారు. సుమారు 65 నిముషాల పాటు ఆయన ప్రసంగం కొనసాగింది. 21వ శతాబ్దానికి తగ్గట్టు భారత్‌ను శక్తిమంతమైన, స్వావలంబన దేశంగా తీర్చిదిద్దే అవకాశం ఈ ఏడాది ప్రజలకు సార్వత్రిక ఎన్నికల రూపంలో వస్తోందన్నారు. పౌరులంతా ఓటుహక్కును వినియోగించుకుని దేశీయ విధానాలు, నిర్ణయాలను నిర్దేశించాలని కోరారు. అంతకు ముందు రాష్ట్రపతికి పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రమంత్రులు, వివిధ పక్షాల నాయకులు స్వాగతం పలికారు.

## మహిళా వన్డే సిరీస్ కూడా భారత్‌దే..



క్రీడావార్తలు

భారత మహిళా క్రికెట్ జట్టు మౌంట్ మాంగనుయ్‌లో జనవరి 29న జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టును ఎనిమిది వికెట్ల తేడాతో ఓడించింది. మొదట న్యూజిలాండ్ జట్టు 44.2 ఓవర్లలో 161 పరుగులకే ఆలౌట్ అయింది. భారత్ జట్టు 35.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. మంధాన 90 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ వరుస రెండు విజయాలతో సొంతం చేసుకుంది. 1994 తరువాత న్యూజిలాండ్‌లో భారత్ సిరీస్ గెలుచుకోవడం భారత మహిళల జట్టుకు ఇదే ప్రథమం. హామిల్టన్‌లో జరిగిన మూడో, ఆఖరి వన్డేలో న్యూజిలాండ్ జట్టు 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత భారత జట్టు 44 ఓవర్లలో 149 పరుగులకే ఆలౌట్ అయింది. న్యూజిలాండ్ జట్టు 29.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 150 పరుగుల లక్ష్యాన్ని సాధించింది. భారత కెప్టెన్ మిథాలీ రాజ్ ఈ మ్యాచ్‌తో 200 మ్యాచ్‌లు పూర్తి చేసి రికార్డు సృష్టించింది.

## న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ భారత్ కైవసం

న్యూజిలాండ్‌తో మౌంట్ మాంగనుయ్‌లో జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో భారత జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపొందింది. టీమిండియా మొదట టాస్ గెలిచి 50 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 325 పరుగులు చేసింది. న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 234 పరుగులకే ఆలౌట్ అయింది. జనవరి 28న జరిగిన మూడో వన్డేలో కూడా భారత్ జట్టు ఏడు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై గెలుపొందింది. న్యూజిలాండ్ మొదట బ్యాటింగ్ చేసి 49 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌట్ అయింది. భారత్ 43 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 245 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో విజయంతో భారత్ హ్యాట్రిక్ సాధించడంతోపాటు 5 మ్యాచ్‌ల సిరీస్‌ను కూడా సొంతం చేసుకుంది. హామిల్టన్‌లో జనవరి 31న జరిగిన నాలుగో వన్డేలో న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్లు ట్రెంట్‌బౌల్ట్ (5/21), గ్రాండ్‌హోమ్ (3/26) తమ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

## ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతలు ఒసాకా, జకోవిచ్

మెల్‌బోర్న్‌లో జనవరి 26న జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్‌లో జపాన్‌కు చెందిన నొవామి ఒసాకా.. చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్విటోవాను ఓడించి టైటిల్‌ను గెలుకుంది. గతంలో యూఎస్ ఓపెన్‌ను గెలుచుకున్న ఒసాకాకు ఇది రెండో టైటిల్. ఈ విజయంతో ఒసాకా డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానాన్ని కూడా దక్కించుకుంది. ఈ టోర్నీలో మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను క్రెజికోవా (చెక్ రిపబ్లిక్)- అండీరామ్ (అమెరికా) జోడీ గెలుచుకుంది. ఫైనల్‌లో ఈ జోడీ ఆస్ట్రేలియన్ వైల్డ్‌కార్డ్ జంట అస్త్రశర్మ-స్మిత్‌లను ఓడించింది. జనవరి 27న జరిగిన పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్‌వన్ జకోవిచ్ (సెర్బియా) స్పెయిన్‌కు చెందిన నెంబర్ 2 రఫెల్ నాదల్‌పై విజయం సాధించాడు. ఈ విజయంతో జకోవిచ్ ఏడో టైటిల్‌తో అత్యధికసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ గెలిచిన ఆటగాడిగా నిలిచాడు. చెరో ఆరు టైటిళ్లు గెలిచిన ఫెదరర్, రాయ్ ఎమర్సన్‌లను జకోవిచ్ అధిగమించాడు. ఈ టోర్నమెంట్‌లో విజయంతో జకోవిచ్ వరుసగా మూడు గ్రాండ్‌స్లామ్‌లు గెలిచి సంచలనం సృష్టించాడు. మళ్లీ నంబర్‌వన్ ర్యాంకుకు చేరుకున్నాడు.

## కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద అవార్డు

సీనియర్ పాత్రికేయుడు, కవి అప్పరసు కృష్ణారావు ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద అవార్డుకు ఎంపికయ్యారు. జమ్మూ కాశ్మీర్‌కు చెందిన ప్రముఖ డోగ్రీ కవయిత్రి పద్మశ్రీ పద్మా సచిదేవ్ రాసిన కవితలను 'గుప్పెడు సూర్యుడు.. మరికొన్ని కవితలు' పేరిట తెలుగులోకి అనువదించినందుకుగాను ఆయన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. డోగ్రీ భాషలోని



ఈ కవితలను కేంద్ర మాజీ మంత్రి కరణ్‌సింగ్ ఇంగ్లిషులోకి తర్జుమా చేయగా, కృష్ణారావు తెలుగులోకి అనువదించారు.

ఈ అవార్డు కింద కృష్ణారావుకు రూ.50 వేల నగదు, ప్రశంస పత్రం అందజేయనున్నారు. కృష్ణారావు తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం వింజమూరు గ్రామంలో జన్మించారు.

## జాతీయ పతాకాన్ని ఎగురవేసిన గవర్నర్

రాష్ట్ర వార్తలు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వేడుకలో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం రాష్ట్ర ప్రజలకు సందేశాన్ని ఇచ్చారు. అంతకుముందు గవర్నర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వాగతం పలికారు. ఈ వేడుకలో రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## కియా కార్ల ఉత్పత్తి ప్రారంభం

అనంతపురం జిల్లా పెనుకొండ మండలం ఎర్రమంచి వద్ద ఏర్పాటు చేసిన కియా కార్ల పరిశ్రమలోని ప్రయోగాత్మక ఉత్పత్తి ఆరంభ వేడుక జనవరి 29న జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, భారత్‌లోని దక్షిణ కొరియా రాయబారి షిన్‌బొంకిల్, కియా అధ్యక్షుడు, సీఈఓ పార్క్, కియా ఎండీ షిమ్‌తో కలిసి ఈ ప్రయోగాత్మక ఉత్పత్తిని ప్రారంభించారు.

## రాష్ట్ర బంద్ విజయవంతం

ప్రత్యేక హోదా, విభజన సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 1న చేపట్టిన రాష్ట్రబంద్ విజయవంతమైంది. ఈ బంద్‌కు సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, తెలుగుదేశం, ఆమ్ ఆద్మీ పార్టీలు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతు పలికాయి. ఆందోళనకారులు బస్టాండ్‌లలో బస్సులను అడ్డుకోవడంతో రాష్ట్రంలో బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా వ్యాపార సంస్థలు, దుకాణాలు, కళాశాలలను స్వచ్ఛందంగా మూసివేశారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితర నేతలు వివిధ ప్రాంతాలలో ఆందోళనలో పాల్గొన్నారు.

Sunday Special

# టెన్షన్ వద్దు.. అటెన్షన్ చాలు





(విశాలాంధ్ర స్పెషల్ డెస్క్)
రాహుల్, రోహిత్, స్వప్న, షీనా వీరందరూ ఒకేచోట పెరిగిన పిల్లలు, ఆటలు,పాటల్లో చిన్నతనంనుండీ ఒకే స్కూలులో, క్లాసులో పోటాపోటీగా చదువుకునే స్నేహితులు,.. ఈ ఏడాది వీరందరూ టెన్త్, ఇంటర్ పరీక్షల సమయం దగ్గరకు వచ్చింది. తమ భవిష్యత్తును నిర్ణయించే ఈ పరీక్షలతో వీరందరిలోనూ కొట్టొచ్చినట్లు కనిపించే టెన్షన్... వీరితోపాటు ఇంట్లో పేరెంట్స్‌లో కూడా ఒకటే హడావుడి..తమకంటే కూడా తమ ఇంట్లో మరింత టెన్షన్ వాతావరణం ఉందని చెబుతున్నారు..వీరిలో ఇద్దరు మాత్రం చాలా ప్రశాంతంగా ఉండగా ఇద్దరిలో మాత్రం పరీక్షల భయంతో ఉన్నట్లుగా స్పష్టంగా తెలుస్తోంది. కష్టపడి విజయం సాధిస్తామని అనుకోవడం పిల్లలు సహజమే... కానీ మరీ ఒత్తిడి ఎక్కువైతే కూడా జ్ఞాపకశక్తిపై ప్రభావం చూపుతుందని మానసిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. హాయిగా ఆడతా పాడతా గడిపే వాతావరణం కాస్తా ఫిబ్రవరి నెల వచ్చే సరికి పిల్లలందరిలోనూ టెన్షన్.. పరీక్షల సీజన్ వచ్చేసింది. సంవత్సరమంతా ఏదో ఒక పరీక్షలే...ఇప్పుడు పెద్ద పరీక్షలన్నమాట..ఈ పరీక్షలతో పిల్లలకే కాదు.. ఇంట్లో అందరికీ టెన్షనే... ఇంట్లో వాతావరణమంతా సీరియస్... టీవీలు బంద్... సెల్‌ఫోన్లు బంద్... త్వరగా నిద్రలే... చదువుకో... చదువుకో... అన్న మాటలే...జీవితానికే పరీక్షల్లాగా...ఈ పరీక్షలు పాసవ్వడం మాట అటుంచితే సెంట్ పర్సెంట్ రాకపోతే... జీవితంలో ఏదో కోల్పోయిన భావన, తల్లిదండ్రులకేమో చిన్నతనం, కాలేజీల్లో పెద్ద తప్పుచేసినట్లుగా ఫీలింగ్...వీటన్నింటితో పిల్లల్లో మానసిక కుంగుబాటు.. ఆత్మహత్యా యత్నాలు.. ఆత్మహత్యలు...ముఖ్యంగా ఇంటి వాతావరణం ప్రశాంతంగా ఉంచవలసిన బాధ్యత తల్లిదండ్రులదే...అని సూచిస్తున్నారు. వారు చెబుతున్న కొన్ని సూచనలు, సలహాలు...


### ఒత్తిడికి కారణాలు:

♦తోటి విద్యార్థులతో పోల్చుకుంటూ లోలోపల కుమిలిపోవద్దు
♦కొన్ని పాఠ్యాంశాల్లో పరిజ్ఞానం తక్కువగా ఉంటే మొహమాట పడకుండా డౌట్స్‌ను నివృత్తిచేసుకోండి
♦గతంలో ఫలితాలను పదేపదే గుర్తు చేసుకోవడం
♦ఫలితాలు సాధించేందుకు మించిన లక్ష్యాన్నిపెట్టుకోవడం
♦ఆరోగ్య సమస్యలు, కుటుంబ సభ్యులనుండి వచ్చే విమర్శలు తోడవడం

### పరీక్షల్లో అనుకున్న విజయం సాధించాలంటే:

♦తమ భావాల్ని, ఇష్టాల్ని పంచుకోవడం, మాట్లాడటం ద్వారా వత్తిడిని ఎదుర్కోవచ్చు
♦జీవితంలోని వైఫల్యాలే విజయం సాధించేందుకు మార్గాలుగా గుర్తుంచుకోండి
♦టీవీలకు దూరంగా ఉండటంతో పాటు ప్రశాంతత కోసం రోజుకు ఒక పావుగంట ఆటలు ఆడండి
♦చదివిన జవాబులు వస్తాయో లేదోనన్న భయాన్ని విడనాడాలి. కచ్చితంగా విజయం సాధిస్తానన్న సానుకూల దృక్పథంతో ఉండాలి. పాత చెడు జ్ఞాపకాలను నెమరువేసుకోకండి
♦సరిపోయినంత నిద్ర అవసరం. ఉదయాన్నే లేచి చదవడంతో ప్రయోజనం. అర్థరాత్రి వరకు మెల కువగాఉండి చదవడంతో ఆరోగ్యం దెబ్బ తినడంతోపాటు చదివింది గుర్తు ఉండదనేది మాత్రం పలు అధ్యయనాల్లో తేలిన విషయం
♦చదివేటప్పుడు ముఖ్యమైన విషయాలను నోట్ చేసుకోవడం అలవాటు చేసుకుంటే జీవితంలో మళ్లీ మర్చిపోవడం ఉండదు. పరీక్షరోజు ఈ నోట్ చేసుకున్న విషయాలను చూస్తే మొత్తం గుర్తుకు వస్తుంది. పుస్తకం అంతా తిరగవేయవలసిన అవసరం ఉండదు.
♦సమయానికి ఆహారం తీసుకోవడం మరవద్దు..విటమిన్లు, ప్రోటీన్లు వంటి అధికంగా పోషకాలు ఉన్న ఆహారం తీసుకోండి. ఉడకబెట్టిన గుడ్లు, పాలు వంటివి..
♦పరీక్షలముందు మార్కులు వంటి వాటి గురించి చర్చలు అనవసరం
♦ఆన్‌లైన్ గేమ్స్‌ను ఆడకండి.. స్నేహితులతో అనవసర చర్చలకు దిగకండి
♦ఇంటి వాతావరణం ప్రశాంతంగా ఉంచండి.. సన్నటి సంగీతంతో ఇల్లు ప్రశాంతంగాఉంటుంది.
♦అయిపోయిన పరీక్షల గురించి డిస్కషన్స్ అనవసరం. జరగ బోయేదానిపై దృష్టి కేంద్రీకరిస్తే మంచింది. పరీక్షలు మన జీవితాన్ని శాసించలేవని మాత్రం గుర్తుంచుకోండి. ప్రతి ఒక్కరి ఎకడమిక్ రికార్డు బ్రిలియంట్‌గా ఉండపోయినా జీవితంలో ఏదో ఒక విషయంలో మాత్రం విజయాన్ని సాధించగలమని గుర్తుంచుకోండి.

# పొదుపు...హోదా... కొత్త చిట్కాలు





(విశాలాంధ్ర స్పెషల్ డెస్క్)
కారు ఒకప్పుడు విలాస వంతమైనది... అందరికీ ఉండేదికాదు. ఫ్యాషన్‌గా తమకార్లలో తాము ఒక్కరే విలాసంగా వెళ్లడం అనేది ఫ్యాషన్‌గా ఉండేది. సమాజంలో స్టేటస్ సింబల్‌గా తలంచేవారు...తాము స్వంతగా కారు నడపడంకన్నా డ్రైవర్ ఉంటే మరింత గొప్ప అనుకునేవారు. కారు మెయిన్‌టైన్ చేస్తున్నారంటే గొప్పగా ఉండేది.. అటు వంటిది ఈ మధ్య ట్రెండ్ మారింది. పెరుగుతున్న ఖర్చులు, భారమవుతున్న పెట్రోల్,డీజిల్ రేట్లతో సామాన్య మానవుడికి ఖర్చులను తగ్గించుకుం టూనే జీవితాన్ని విలాసవంతంగా గడి పేందుకు మొగ్గు చూపిస్తున్నారు. కార్ల కొనుగోళ్లు మాత్రం ఈ మధ్యకాలంలో విపరీతంగా పెరిగాయి. అయితే దీని కయ్యే ఖర్చును తగ్గించుకునేందుకు పట్టణవాసులు మొహమాటం పడట్లేదు. వారి ఆలోచనా ధోరణుల్లో కూడా మార్పు పెరి గింది. ఇంటికి రెండు కార్లు ఉంటున్నా కూడా సైకిల్ వినియోగం, టూవీలర్స్ వాడకం కూడా పెరిగింది. ఫ్యామి లీతో ఎక్కడికైనా వెళ్లా లంటే కారు మాత్రం తప్పని సరైంది. కార్ల ధరలు కూడా పెరిగాయి. కార్లను కూడా ఇప్పుడు మూడు సంవత్సరాలకోసారి మార్చేస్తున్నారు. కొత్తకొత్త మోడల్స్ వస్తున్నాయి. దీనితోపాటు కారులో ఎక్కడికైనా వెళ్లాలంటే మాత్రం తడిసి మోపెడు ఖర్చవుతోంది. కార్లలో ప్రయాణించేవారు బస్సులు ఎక్కిదిగిచేయలేక కొత్త ఆలోచనలకు, కొత్త పద్ధతులకు మొగ్గు చూపుతున్నారు. ఒకే కాలనీలో ఉండేవారు ఆఫీసులకు వెళ్లాలంటే ఒకే దారిన వెళ్లాల్సివస్తే అందరూ ఒకరికారులోనే వెళ్లి డీజిల్ మాత్రం మిగిలినవారు షేరు చేసుకోవడం సాధారణంగా మారింది. ఏదైనా ఊరు వెళ్లాలంటే ఒక్కరే వెళ్లేకన్నా తోడుంటే మంచిదన్న ఆలోచన పెరిగింది. మధ్యలో మూడో, నాలుగో టోల్‌గేట్లు, రానుబోను, వాటికయ్యే ఖర్చు బారెడు.. బోరు కొట్ట కుండా ఉండేందుకు గాను మధ్యలో తోటి ప్రయాణీకులను ఎక్కించుకోవడం లేటెస్ట్ ట్రెండ్‌గా మారింది. ఉదాహరనకు హైదరాబాదు నుండి విజయవాడ వెళ్లి రావాలంటే కారులో సుమారు టోల్‌గేట్లతో కలిపి రూ.8,000 వరకు అవుతుంది. అదే నలుగుర్ని ఎక్కించు కుంటే ఆ ఖర్చులు మనకు కలిసి వస్తాయి. అదే ప్రదేశానికి వెళ్లేవాళ్లు బస్సుకోసం వెయిట్ చేస్తుంటారు. వీరినుండి ఏసీ కారుకాబట్టి ఏసి బస్సు ఛార్జీలు వసూలు చేసి వారు చేరుకునే ప్రదేశానికి ఆన్‌ది వే లో చేర్చేందుకు కారులో ఎక్కించుకోవడం పరిపాటైపో యింది. దీనితో కారులో ఒక్కరేకాకుండా మరొక నలుగురిని ఎక్కించుకుంటే పెట్రోలు ఛార్జీలతోపాటు, టోల్‌గేటు ఛార్జీలు, ఖర్చులు కూడా కలిసివస్తాయన్న ఆలోచన పెరి గింది. దీనికిగాను అయా ప్రదేశాలకు వెళ్లి వెయిట్‌చేయ కుండా ముందస్తు ప్రణాళికగా తాజాగా దీనికి సంబంధించి వెబ్‌సైట్‌కూడా ఉంది. దాంట్లో మనం ఎన్‌రోల్ అయి ఆయా కూడలికి ఏసమయంలో వస్తామో పెడితే ఆ టైమ్‌కి ఆ మార్గాన వెళ్లేవాళ్లు బుక్ చేసుకుం టారు. మనకు సమయం కూడా కలిసివస్తుంది. వెయిట్‌చేయవలసిన పని ఉండదు కూడా.. మనం ముందు జాగ్రత్తగా ఆధార్ కార్డు నెంబరు తీసుకుంటే సరిపోతుంది. ఉదాహరణకు ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు బెంజిసర్కిల్‌లో ఉంటామని సంబంధిత వెబ్‌సైట్‌లో పెడితే ఆ టైమ్‌కి వెళ్లేవాళ్లు బుక్ చేసుకుంటారన్న మాట..ఆ విధంగా ఒక నలుగురిని ఎక్కించుకుంటే అన్ని ఖర్చులూ కలిసివస్తాయి. నలుగురితో మాట్లాడితే మనకికూడా బోరు కొట్టకుండా ఉంటుంది. సేఫ్ సైడ్‌కూడా... తోడు ఉంటా రనేది మాత్రం వాస్తం. ఈ మధ్య స్పీడ్ డ్రైవింగ్‌తో యాక్సి డెంట్లు, కూడా ఎక్కువవు తున్నాయి. బీపీ, షుగర్లు వంటి పలు రోగాలతో కార్లలోనే డ్రైవ్‌చేస్తూ హార్ట్ ఎటాక్‌లు, పక్కన ఎవరూ లేకపోవడంతో ఆసుపత్రికి తీసుకెళ్లేవారు లేకపోవడంతో అక్కడికక్కడే కుప్పకూలి పోవడం, కుటుంబాల్లోని పలు ఘర్షణలతో చోటు చేసుకుంటున్న హత్యలతో భయపడి ఈ మధ్య పట్టణవాసుల్లో ఎక్కువమంది తమ కార్లలో ఎవర్నయినా తీసుకుని వెళ్లేందుకు సుముఖత చూపిస్తున్నారు. ముఖ్యంగాయువత దీనిపట్ల సుముఖంగా ఉన్నారు. పట్టణాలనుండి పల్లెలకు వెళ్లే సమయంలో బస్సులకయ్యే ఖర్చు చాలా ఎక్కువగాఉంది. పండుగల సమయంలో అయితే అసలు టిక్కెట్టుకన్నా మూడు రెట్లు ఎక్కువ వసూలు చేయడం మనం చూస్తూనే ఉన్నాం... రైళ్లు, బస్సులు ఫుల్ రెష్‌గాఉండటంతో మనకి ఎక్కేందుకు కూడా అనువుగాఉండదు. అదే ఇటువంటి కార్లలో వెళితే సమయంతోపాటు సేఫ్ కూడా...ముఖ్యంగా పెద్దవారు, అప్పటికప్పుడు ప్రయాణాలు చేసేవారికి ఉపయోగకరంగా ఉంటుంది. మన కారుని కేవలం మనమే వాడుకోకుండా సమాజానికి కూడాఉపయోగపడేట్లు చేయడంతో మనకీ ఆత్మతృప్తి కూడా ఉంటుందనేది సత్యం.. దీనిపై విజయవాడలో ఉద్యోగం చేస్తున్న రాజమండ్రి వాసి అయిన వినయ్ స్పందిస్తూ, ఇప్పటివరకు కారులో ఎక్కడికైనా ఒక్కడినే వెళ్లేవాడిని అమ్మో ఇప్పుడు పెరిగిన డీజిల్,పెట్రోల్ రేట్లతో మా ఊరు వెళ్లి రావాలంటే రూ.4,500 అయేది... కానీ ఇప్పుడు ప్రయాణీకులను ఎక్కించుకెళ్లడం ప్రారం భించాక బస్సు రేటు పడుతోందని ఆ డబ్బులు ఇంట్లో మా ఇంట్లో ఖర్చులకు ఇస్తున్నానని చెప్పి సంతోషం వెలిబు చ్చాడు. మరొక ఉద్యోగి ఉదయ్ మాట్లాడుతూ దీనిపై మిగిలిన డబ్బుతో మా ఇంటిల్లిపాదికీ ఈసారి పండగకి బట్టలు తీసికెళ్లానని చెప్పాడు. ఈ విధంగా అవసరమైన చోట పొదుపు చేయడం ఒక విధంగా మంచిదే...

విశాలాంధ్ర బిజినెస్

| టాప్ గెయినర్స్ (సెన్సెక్స్) | | |
|---|---|---|
| కంపెనీ | ప్రస్తుత ధర | మార్పు (శాతాల్లో) |
| హీరో మోటార్‌కార్ప్ | 2,807.25 | 7.39 |
| మారుతిసుజుకి | 6,962.30 | 4.84 |
| హెచ్‌సీఎల్ టెక్ | 1,043.85 | 3.85 |
| ఐషర్ మోటార్స్ | 20,144.70 | 3.46 |
| ఏషియన్ పెయింట్స్ | 1,469.55 | 3.16 |

| టాప్ లూజర్స్ (సెన్సెక్స్) | | |
|---|---|---|
| కంపెనీ | ప్రస్తుత ధర | లాస్ (శాతాల్లో) |
| వేదాంత | 162.15 | -17.84 |
| జీ ఎంటర్‌టైన్ | 354.40 | -6.79 |
| ఎస్ బ్యాంక్ | 185.60 | -4.38 |
| ఎస్‌బీఐ | 302.70 | -3.15 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 364.90 | -2.69 |

| విదేశీమారకం విలువ (ఫారెక్స్) | | |
|---|---|---|
| కరెన్సీ | రూ.విలువ క్రి.ముగింపు | రూ.విలువ ప్ర.ముగింపు |
| డాలర్ | 71.08 | 71.24 |
| యూరో | 81.68 | 81.78 |
| పౌండ్ | 93.24 | 93.06 |
| ఆస్ట్రేలియా డాలర్ | 51.70 | 51.69 |
| సింగపూర్ డాలర్ | 52.84 | 52.81 |

| బులియన్ | | |
|---|---|---|
| బంగారం (10 గ్రాములు) | 22 క్యారెట్లు రూ. | 24 క్యారెట్లు రూ. |
| హైదరాబాద్ | 31,630 | 33,828 |
| చెన్నై | 31,680 | 33,888 |
| బెంగళూరు | 31,200 | 33,368 |
| ముంబై | 32,490 | 34,748 |
| విజయవాడ | - | 34,400 |
| విశాఖపట్నం | 31,680 | 33,800 |
| ప్రొద్దుటూరు | 31,680 | 33,260 |

| | |
|---|---|
| ముడి చమురు | 61.89 |

## ఎగుమతులకు మరింత జోష్..

**న్యూఢిల్లీ:** ఎగుమతులను మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో వాటి పథకాలకు కేటాయింపులు మరింతగా పెంచింది కేంద్రం. 2019-20లో ఎగుమతి ప్రోత్సాహక స్కీములకు రూ.4,115 కోట్ల మేర కేటాయింపులను బడ్జెట్‌లో ప్రతిపాదించింది. 2018-19లో ముందుగా రూ. 3,551 కోట్లు కేటాయించగా.. ఆ తర్వాత సవరించిన గణాంకాల ప్రకారం ఇది రూ. 3,681 కోట్లకు పెరిగింది. ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్‌లో పెట్టుబడులు, జాతీయ ఎగుమతి బీమా ఖాతా, వడ్డీ రాయితీ స్కీమ్ మొదలైన వాటికి ఈ నిధులను కేటాయించారు. బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం వడ్డీ రాయితీ స్కీమ్‌లకు కేటాయింపులు రూ. 2,600 కోట్ల నుంచి రూ. 3,000 కోట్లకు పెరిగాయి. 2011-12 నుంచి ఎగుమతులు సుమారు 300 బిలియన్ డాలర్ల స్థాయిలోనే తిరుగాడుతున్నాయి. 2017-18లో స్వల్పంగా 10 శాతం పెరిగి 303 బిలియన్ డాలర్లకు చేరాయి.

# తెలంగాణలో రియల్ గిరాకీ..

- భారీగా పెరిగిన ఆదాయం
- నోట్ల రద్దు, నగదుపై ఆంక్షలతో స్థిరాస్తి వ్యాపారం వైపు మొగ్గు



**విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిస్థాయిలో పుంజుకున్నది. రెండేండ్ల కిందటితో పోలిస్తే ఇప్పుడు ఇది అనూహ్యంగా దూసుకుపోతున్నది. మారుమూల పల్లెల్లో భూముల ధరలతోపాటు నగర శివార్లల్లో ప్లాట్ల రేట్లు కూడా భారీగా పెరుగుతున్నాయి. రాజకీయ సుస్థిరత, పెద్దనోట్ల రద్దుతో ఇందులో వెలుగులు వచ్చాయి. మరోవైపు దేశ, విదేశీ ఐటీ కంపెనీ, నివాస పరిశ్రమలు వస్తుండటంతో ఈ రంగానికి జవసత్వాలు చేకూరాయి. రాష్ట్రం లోని ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో భారీస్థాయిలో రియల్ ఎస్టేట్ పెరిగింది. సాధారణ ప్లాట్ల అమ్మకాలతోపాటు, అపార్ట్‌మెంట్లల్లోని ఫ్లాట్ల వ్యాపారం నగర శివార్లల్లో ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న కోంగరకలాన్ లో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, లాజిస్టిక్ పార్కు, అమెజాన్ తదితర బహుళజాతి సంస్థల రాకతో రియల్ వ్యాపారం ఊపందు కుంది. వేతన జీవులు, అల్పాదా య వర్గాలు, చిరువ్యాపారులు తమ స్తొమతకు తగ్గట్టుగా శివార్లల్లో ఇండ్ల స్థలాలు, భూములు కొనుగోలు చేస్తుండటంతో రియల్ బిజినెస్ వేగంగా సాగుతున్నది. ఎన్‌ఆర్‌ఐలు సైతం ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో భూముల కొను గోళ్లకు ప్రాధాన్యతను ఇస్తుండటంతో ఎకరా స్థలం కోట్లు పలుకుతున్నది. ఆయాప్రాంతాల్లో చదరపు గజం 50వేలకు చేరుకుంది. ముఖ్యంగా గండిపేట, నార్సింగి, మంచిరేవుల, మణి కొండ, మోకిల, హైదర్షాకోట్, సాతంరాయి, శంషాబాద్, బుద్వేల్ తదితర ప్రాంతాల్లో భూముల ధరలు చుక్కలను తాకాయి. ప్రస్తుతం గృహ సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, విల్లాల కొనుగోళ్లు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రియ ల్ ఎస్టేట్ వ్యాపారం మందగించినా, ప్రస్తుతం పాత ఒరవడి కొనసాగుతున్నది.

### కారణాలివే..

రియల్ వ్యాపారం బాగా పెరగడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నోట్ల రద్దు చర్య కూడా కారణమేనని ఇటు అధికా రులు, అటు వ్యాపారులు అంటున్నారు. అలాగే నగదుపై ఆంక్షలు విధించిన తరుణంలో రియల్‌ఎస్టేట్‌లో పెట్టుబడు లు పెట్టేందుకు మొగ్గుచూపారనే అంటున్నవారూ లేకపో లేదు. అలాగే ఇండ్లు, ఇండ్లస్థలాల రేట్లు రోజు రోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో ముందుగా కొనేసుకోవాలనే ఆలోచన కూడా రిజి స్ట్రేషన్లకుశాఖకు ఆదాయాన్ని తెచ్చిపెట్టి నట్టు రంగారెడ్డి జిల్లాలోని రియల్ వ్యా పారులు అంటున్నారు. అలాగే రాజకీ యంగా కూడా కొంతస్థిరత్వం రావడం కూడా కారణమేనని చెబుతున్నారు.

నగదు తరలింపుపై ఆంక్షలు విధించడం, మార్కెట్‌లో నగదు లభ్యత కొరత ఏర్పడటంతో అక్టోబరు, డిసెంబరు మాసాల్లో భూములు, స్థలాల రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గింది. తాజాగా పంచాయతీ ఎన్నికల ప్రభావం కూడా కాస్తో, కూస్తో ఉన్నప్పటికీ, వారం, పది రోజుల్లో పుంజుకునే అవకాశం కనిపిస్తున్నది. 2017, 2018 సంవత్సరాలకు సంబంధించి లెక్కలను పరిశీలిస్తే ఈసంగతి అర్థమవుతున్నది. ఈవ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయులుగా సాగుతున్నది. 12 రిజిస్ట్రేషన్ జిల్లాల్లో 2017 సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 8,19,507 దస్తావేజులను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నమోదు చేసింది. తద్వారా రూ. 3291.93 కోట్ల ఆదాయం సాధించింది. అలాగే 2018 సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 10,92,289 దస్తావేజులు కాగా, రూ. 4247.52 కోట్ల మేర ఆదాయం సమకూరింది. దస్తావేజుల్లో దాదాపు 33.29 శాతం మేర వృద్ధి కనిపించగా, అంటే 2,72,782 డాక్యుమెంట్లు రిజిష్టర్ అయినట్టు అధికారిక సమాచారం. అలాగే అదాయం సైతం 29.03 శాతం పెరిగింది. దాదాపు 2017లో కంటే 2018లో రూ.955.56 కోట్లు ఎక్కువగా వచ్చింది.

### రంగారెడ్డిలో 1.70 లక్షల దస్తావేజులు

రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారిక సమాచారం ప్రకారం 2017 ఆర్థిక సంవత్సరంలో రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్(డిఆర్) పరిధిలో అత్యధికంగా డాక్యుమెంట్లు రిజిష్టర్ అయ్యాయి. జిల్లాలో 1,70,462 డాక్యుమెంట్లు దస్తావేజులుగా నమోదయ్యాయి. తద్వారా 1226.80 కోట్ల ఆదాయం వచ్చింది. 2018లో 2,54,457 దస్తావేజులకుగాను 1513.99 కోట్లు ఆదాయం సమకూ రింది. ఇలా హైదరాబాద్ దక్షిణ జిల్లా, మేడ్చల్- మల్కాజ్ గిరి, నల్లగొండ వరంగల్ తదితర జిల్లాల్లోనూ డాక్యుమెంట్లు ఎక్కువగా దస్తావేజు చేశారు.


## ఎస్‌బీఐ లాభం రూ.4,709 కోట్లు

**ముంబై:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.4,709 కోట్ల నికర లాభం(కన్సాలిడేటెడ్) సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో రూ.1,887 కోట్ల నికర నష్టాలు వచ్చాయని ఎస్‌బీఐ తెలిపింది. కేటాయింపులు భారీగా తగ్గడం, రుణ నాణ్యత మెరుగుపడటం వల్ల భారీ నికర లాభం సాధించామని ఎస్‌బీఐ చైర్మన్ రజనీశ్ కుమార్ వెల్లడించారు. మొత్తం ఆదాయం రూ.74,191 కోట్ల నుంచి రూ.84,350 కోట్లకు పెరిగిదన్నారు. స్టాండో లోన్ పరంగా చూస్తే, గత క్యూ3లో రూ.2,416 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.3,955 కోట్లకు పెరిగిందని వివరించారు. నికర వడ్డీ ఆదాయం 21 శాతం వృద్ధితో రూ.22,691 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. దీంతో నికర వడ్డీ 2.67 నుంచి 2.92 శాతానికి చేరిందన్నారు.

### రుణనాణ్యత మెరుగు

ఈ క్వార్టర్లో నికర లాభం, వ్యాపార వృద్ధి, రుణ నాణ్యత.. ఇలా అన్ని అంశాల్లో అద్భుతమైన పనితీరు సాధించామని రజనీశ్ కుమార్ వెల్లడించారు. గత క్యూ3లో 10.35 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ3లో 8.71 శాతానికి తగ్గాయని తెలిపారు. నికర మొండి బకాయిలు 5.61 శాతం నుంచి 3.95 శాతానికి చేరాయని వివరించారు. మరికొన్ని మొండి బకాయిల రిజల్యూషన్ దాదాపు చివరి దశకు చేరిందని, ఇవి పరిష్కారమైతే స్థూల మొండి బకాయిలు 7 శాతానికి, నికర మొండి బకాయిలు 3 శాతానికి దిగివస్తాయని పేర్కొన్నారు. గత క్యూ3లో రూ.17,964 కోట్లుగా ఉన్న కేటాయింపులు ఈ క్యూ3లో రూ.14,144 కోట్లకు తగ్గాయని, మొత్తం కేటాయింపులు కూడా మూడోవంతుకు తగ్గాయని వివరించారు.

## ఆస్తుల జప్తు న్యాయం కాదు : మాల్యా



**ఢిల్లీ:** తాను చెల్లించాల్సిన రుణాలు రూ.9వేల కోట్లు కాగా, ఇప్పటికే రూ.13వేల కోట్ల ఆస్తులను జప్తు చేశారని, ఇంకా ఇది ఎంత దూరం వెళ్తుందో... ఈ మాటలు అన్నది సాక్షాత్తూ భారతీయ బ్యాంకులకు వేల కోట్ల రుణాలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యా. దర్యాప్తు సంస్థలను ఉద్దేశిస్తూ.. న్యాయం ఎక్కడుంది అంటూ ట్వీట్ చేశారు. 'ప్రతి రోజు ఉదయం తన ఆస్తులను అధికారులు జప్తు చేశారనే వార్తతోనే నిద్ర లేస్తున్నాను. వాటి విలువ ఇప్పటికే రూ.13వేల కోట్లు దాటిపోయింది. తాను చెల్లించాల్సిన రుణం వడ్డీతో సహా రూ.9వేల కోట్లు అని బ్యాంకులు చెప్తున్నాయి. ఇంకా ఈ జప్తు ఎంత దూరం వెళ్తుంది? ఇది న్యాయమేనా?' అని మాల్యా ట్వీట్ చేశారు. బ్యాంకుల కన్సార్టియం తరఫున అప్పు రికవరీ ట్రిబ్యునల్‌కు చెందిన అధికారులు ఇటీవల మాల్యా ఆస్తులను జప్తు చేశారు.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 212.74 ▲ | 62.70 ▲ | 100 ▲ | బంగారం (విశాఖపట్నం) 31,680 | 100 ▲ | వెండి (విశాఖపట్నం) 41,450 | డాలరు Vs రూపాయి |
| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం (విజయవాడ) | ప్రొద్దుటూరు 31,680 | వెండి (విజయవాడ) | ప్రొద్దుటూరు 43,829 | 71.24 |
| 36,469.43 | 10,893.65 | 31,400 | 22 క్యారెట్లు, 10 గ్రాములు | 41,800 కిలో (రూపాయల్లో) | కిలో (రూపాయల్లో) | |

ఆదాయపు పన్ను మినహాయింపులకు

# ఆధారాలతో సిద్ధంకండి







ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గరకు వస్తోంది. చాలామంది ఆదాయపు పన్ను మినహాయింపు కోసం ఏ పాలసీ తీసుకోవాలి.. ఎక్కడ పెట్టుబడి పెట్టాలి అని ఆలోచిస్తున్న తరుణమిది. ఏప్రిల్ నుంచి ఏ మాత్రం ప్రణాళిక లేనివారు, ఇప్పుడు ఒకేసారి పెట్టుబడులు పెట్టేందుకు చూస్తుంటారు. పెట్టుబడులు పెట్టి, పన్ను మినహాయింపు పొందిన వారు వాటికి సంబంధించిన ఆధారాలు యాజమాన్యానికి చూపించాల్సిన సమయమూ వచ్చేసింది. ఈ కీలక సమయంలో పన్ను ఆదా విషయంలో ఎలా ముందుకు వెళ్లాలో తెలుసుకుందాం

సంపాదించిన ఆదాయం.. పరిమితి దాటినప్పుడు చట్టం నిర్దేశించిన శ్లాబుల ప్రకారం పన్ను చెల్లించాల్సిందే. 60 ఏళ్లలోపు వారు రూ.2,50,000 ఆదాయం దాటినప్పుడు పన్ను చెల్లించాలి. 60-80 ఏళ్ల వయసులో ఉన్నవారు రూ.3,00,000 వరకూ పన్ను చెల్లించక్కర్లేదు. 85 ఏళ్లు దాటినవారికి రూ.5లక్షల వరకూ ఎలాంటి పన్నూ లేదు. అదే సమయంలో పన్ను భారం తగ్గించేందుకు ఆదాయపు పన్ను చట్టం కొన్ని వెసులుబాట్లనూ కల్పించింది. సెక్షన్ 80 సీ ప్రకారం పలు పెట్టుబడి పథకాల్లో మదుపు చేయడం ద్వారా రూ.1,50,000 వరకూ పన్ను మినహాయింపు పొందవచ్చు. సెక్షన్ 80డీ ప్రకారం ఆరోగ్య బీమా కోసం చెల్లించిన ప్రీమియానికి రూ.25 వేల వరకూ (తల్లిదండ్రుల కోసం పాలసీ తీసుకుంటే అదనంగా రూ.25వేలు, వారు సీనియర్ సిటిజన్లయితే రూ.30వేల వరకూ), సీనియర్ సిటిజన్లు వైద్య బీమా తీసుకుంటే రూ.30వేల దాకా పన్ను మినహాయింపు వర్తిస్తుంది. దీంతోపాటు గృహరుణానికి చెల్లించే వడ్డీ, జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్)లో పెట్టిన రూ.50,000లకూ పన్ను మినహాయింపు కోసం చూపించుకోవచ్చు. విద్యారుణానికి చెల్లించిన వడ్డీకి కూడా సెక్షన్ 80ఈ ప్రకారం పూర్తి మినహాయింపు ఉంటుంది.

**ఆదా ఒక్కటే సరిపోతుందా?**

చట్టం కల్పించిన వెసులుబాట్లను ఉపయోగించుకునేందుకు నిర్ణీత పెట్టుబడి పథకాలను ఎంచుకోవాలి. ఇందులో ప్రధానంగా ఈపీఎఫ్, వీపీఎఫ్, పీపీఎఫ్, ఎన్‌పీఎస్, జీవిత బీమా, పన్ను ఆదా ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఈఎల్ఎస్ఎస్‌లవంటివే కాకుండా.. పిల్లల ఫీజులు, గృహరుణం అసలు ఇలా అనేకం ఉంటాయి. చాలామంది పన్ను ఆదా కోసం ఎంచుకునే పథకాల్లో పెట్టుబడికి హామీ ఉందా లేదా అని చూస్తుంటారు. సురక్షిత పథకాలు 7-8 శాతం మించి రాబడి ఇవ్వవన్నది తెలిసిందే. అయినప్పటికీ.. చాలామంది ఈ పథకాలను మాత్రమే పరిశీలిస్తుంటారు. అంతకన్నా ఎక్కువ రాబడి వచ్చేందుకు అవకాశం ఉన్నప్పటికీ.. నష్టభయం ఉండటంతో వాటిని ఎంచుకునేందుకు ఇష్టపడరు. ఈఎల్ఎస్ఎస్‌లను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. పిల్లల ఫీజులు, జీవిత బీమా కూడా నిజానికి పెట్టుబడులు కావు. పెట్టుబడి పథకాలు ఎంచుకునేప్పుడు పన్ను ఆదా ఒక అదనపు అవకాశంగా చూడాలి. పన్ను ఆదా కోసం అవసరమైనంత మేరకే ఈ నిర్ణీత పెట్టుబడుల్లో పెట్టాలి.

**ఇంకా ఎంత పొదుపు?**

2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను.. పన్ను ఆదా కోసం మీరు పెట్టిన పెట్టుబడులు, చెల్లించిన బీమా ప్రీమియాలు, పిల్లల ఫీజులు అన్నీ కలిపి ఎంత అయ్యాయో లెక్కలేసుకోండి. వాటికి సంబంధించిన రశీదులన్నీ తీసి పెట్టండి. మీ సంస్థలోని సంబంధిత విభాగాన్ని సంప్రదించి, అన్ని వివరాలూ సమర్పించండి. ఇంకా ఎంత పొదుపు చేసేందుకు అవకాశం ఉందో తెలుసుకోండి. ఒకవేళ మీరు ఇప్పటికే పూర్తి పెట్టుబడులు పెడితే.. వారు మీ వద్ద నుంచి ఎక్కువ పన్ను వసూలు చేయకుండా చూసుకోవచ్చు. మీరు ఆధారాలు సమర్పించేలోపే అధికంగా టీడీఎస్ పడినా బాధపడకండి. రిటర్నులు సమర్పించి, రిఫండు పొందే అవకాశం ఉంది.

పథకాలను ఎంచుకునేప్పుడు వాటిలో ఎంత కాలం కొనసాగించాలన్నదీ ముఖ్యమే. ఉదాహరణకు పీపీఎఫ్ ఖాతాను కనీసం 15 ఏళ్లు కొనసాగించాలి. జీవిత బీమా పాలసీలకూ నిర్ణీత వ్యవధి ఉంటుంది. తక్కువ వ్యవధి ఉండాలంటే.. ఈఎల్ఎస్ఎస్‌లే ముందు వరుసలో ఉంటాయి. వీటి కనీస వ్యవధి మూడేళ్లే.

**పన్ను జమ అవుతోందా?**

మీరు చెల్లించిన ఆదాయపు పన్ను శాఖకు జమ అవుతుందా లేదా తెలుసుకునేందుకు ఫారం 26ఏఎస్‌ను పరిశీలించవచ్చు. దీనికోసం ఇన్‌కంట్యాక్స్ ఇండియా ఈఫైలింగ్ వెబ్‌సైటులో లాగిన్ అయితే సరిపోతుంది. పన్ను జమకు సంబంధించిన వివరాలు ప్రతి మూడు నెలలకోసారి మొబైల్ నెంబరుకు సందేశం వస్తుంటాయి. కాబట్టి, మీ మొబైల్ నెంబరును ఈఫైలింగ్ వెబ్‌సైటులో అప్‌డేట్ చేసుకోండి..

**ఇవన్నీ చూసుకోండి..**

మీ ఆదాయాన్ని బట్టి, యాజమాన్యం మీకు వర్తించే పన్నును మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్) విధిస్తుంది. దీన్ని తప్పించుకోవాలంటే.. మీరు పన్ను ఆదా కోసం పెట్టిన ప్రతి పెట్టుబడినీ యాజమాన్యానికి సమర్పించాల్సి ఉంటుంది.

**బీమా :**

జీవిత బీమా పాలసీలు తీసుకుంటే.. మీరు తీసుకున్న పాలసీకి సంబంధించి చెల్లించిన ప్రీమియం రశీదు నకళ్లు సమర్పించాలి. యులిప్, టర్మ్, ఎండోమెంట్, మనీ బ్యాక్ పాలసీ ఏదైనా దానికి చెల్లించిన ప్రీమియానికి పన్ను ఆదా ఉంటుంది. దీంతోపాటు ఆరోగ్య బీమా పాలసీకి చెల్లించిన ప్రీమియం రశీదునూ ఇవ్వండి.

**మ్యూచువల్ ఫండ్లు :**

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడి పన్ను ఆదాకు సరిపోవు. ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు (ఈఎల్ఎస్ఎస్)లో మదుపు చేసినప్పుడే పన్ను ఆదా వర్తిస్తుంది.

**ప్రజా భవిష్య నిధి :**

సాధారణంగా ఈపీఎఫ్‌ను జీతం నుంచే మినహాయిస్తారు. కాబట్టి దీనికి ప్రత్యేకంగా ఆధారం చూపక్కర్లేదు. ప్రజా భవిష్య నిధి, జాతీయ పొదుపు పత్రాలు, కిసాన్ వికాస పత్రాల్లాంటివి ఎంచుకుంటే వాటికి సంబంధించిన రశీదులు సమర్పించాలి.

**జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్) :**

రూ.50వేల వరకూ ఇందులో మదుపు చేసి, సెక్షన్ 80సీకి అదనంగా పన్ను మినహాయింపు పొందవచ్చు. దీన్ని ఎంచుకున్నప్పుడు, ఆ చెల్లింపులకు సంబంధించిన ఆధారాలు ఇవ్వడం మర్చిపోకండి.

**పిల్లల ఫీజు :**

పన్ను అసెసీ గరిష్ఠంగా ఇద్దరు పిల్లలకు చెల్లించిన ట్యూషన్ ఫీజును మినహాయింపు కోసం చూపించుకోవచ్చు.

**రుణాలు :**

గృహరుణానికి చెల్లించిన వడ్డీకి రూ.2,00,000 వరకూ, అసలు సెక్షన్ 80సీ మినహాయింపు పరిమితి మేరకు పన్ను ఆదా కోసం చూపించవచ్చు. మీ బ్యాంకును సంప్రదించి, రుణ చెల్లింపులకు సంబంధించిన ఆధారాలు తీసుకొని, వెంటనే యాజమాన్యానికి ఇవ్వండి.

**ఇంటి అద్దె :**

అద్దె ఇంట్లో ఉన్నప్పుడు ఇంటి అద్దె భత్యానికి (హెచ్ఆర్ఏ) మినహాయింపు చూపించుకోవచ్చు. దానికి సంబంధించిన రశీదును వెంటనే మీ కార్యాలయంలో సమర్పించండి.

## డిమ్యాట్ ఎకౌంట్ అంటే ఏమిటి?

బ్యాంకు ఖాతా మాదిరే డిమ్యాట్ ఎకౌంట్ పని చేస్తుంది. మీ బ్యాంకు నిల్వ బ్యాంకు లావాదేవీలను పుస్తకంలోనే లెక్కిస్తారు.. కాకపోతే భౌతికంగా నగదుని తీసుకెళ్లాల్సిన అవసరం లేదు. ఎలక్ట్రానిక్ ఫామ్ రూపంలో సెక్యూరిటీస్ పద్ధతిలో డెబిట్, క్రెడిట్‌లు జరుగుతాయి.

**What is Demat Account**

సెబి మార్గదర్శకాల ప్రకారం - డిమెటరియలైజ్డ్ రూపంలో తప్ప ఏ రూపంలో విక్రయించకూడదు. అందువల్ల మీరు స్టాక్ ఎక్స్ఛేంజ్ ద్వారా వాటాల క్రయవిక్రయాలు జరపాలనుకుంటే మీరు తప్పనిసరిగా ఒక డిమ్యాట్ ఎకౌంట్‌ను కలిగి ఉండాలి.

**డిమ్యాట్ ఎకౌంట్ ఎలా పని చేస్తుంది :**

మీరు వాటాలను కొనుగోలు చేసినప్పుడు, బ్రోకర్ మీ వాటాల హోల్డింగ్స్ ఈ డిమ్యాట్ ఎకౌంట్ క్రెడిట్లు ప్రకటనలో ప్రతిఫలిస్తాయి. మీరు ఇంటర్నెట్ ప్లాట్ ఫామ్ ఆధారంగా ట్రేడింగ్‌ను నిర్వహిస్తున్నారు కాబట్టి ఆన్ లైన్‌లో మీ హోల్టింగ్స్‌ను చూడొచ్చు. సాధారణంగా బ్రోకర్ షేర్స్‌ను T +2 అని, ఆ తర్వాత వాణిజ్య రోజు ం 2 రోజులుగా విశ్వసిస్తాడు. మీరు ఎప్పుడైనా వాటాలను





అమ్మదలిస్తే, వివిధ స్టాక్ వివరాలు నింపి డెలివరీ సూచనల నోటుని మీ బ్రోకర్‌కు ఇవ్వాలి. మీ ఖాతా వాటాలను డెబిట్ చేసిన తర్వాత అప్పుడు మీరు అమ్మిన వాటాలకు డబ్బు చెల్లిస్తారు. అదే మీరు ఆన్ లైన్‌లో ఇంటర్నెట్ ద్వారా ట్రేడింగ్ నిర్వహిస్తుంటే వాటంతటవే షేర్స్ డెబిట్ అయి, మీ ఖాతాల్లో డబ్బు క్రెడిట్ అవుతుంది. భారతదేశంలో మొత్తం రెండు డిపాజిటరీస్ ఉన్నాయి. అవి ఒకటి నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీస్ లిమిటెడ్ (NSDL),

రెండవది సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ (CDSL).

**డిమ్యాట్ ఎకౌంట్ ఓపెన్ చెయ్యడం వల్ల ఉపయోగాలు:**

భౌతిక రూపాలలో వాటాలను ఉంచాల్సిన అవసరం లేదు వాటాలలో ఒక వాటా క్రయవిక్రయాలు జరపవచ్చు బదిలీ సంఖ్యపై స్టాంపు డ్యూటీ లేదు బదిలీ దస్తావేజు అవసరం లేదు.

## అలరించిన ఆశ్రిత-సుమ చమక్కులు



వైయస్సార్ పాదయాత్ర నేపథ్యంలో తెరకెక్కిన 'యాత్ర' ఈ నెల 8న ప్రపంచవ్యాప్తంగా రిలీజవుతోంది. దాని ప్రీరిలీజ్ వేడుకలో వైయస్ విజయమ్మ పాత్రధారి ఆశ్రిత తన స్పీచ్‌తో అదరగొట్టింది. ఒక మహానాయకుడి భార్య పాత్రలో నటించే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉంది. ఆ అవకాశమిచ్చిన దర్శకనిర్మాతలు మహి విజయ్‌లకు కృతజ్ఞతలు అని తెలిపారు. ఈ వేదికపై యాంకర్ సుమ, ఆశ్రితల మధ్య చమక్కులు సభికుల్ని ఆద్యంతం అలరించాయి. సుమ గారు మీలాంటి స్పాంటేనియస్ యాంకర్ లేరమ్మా.. అంటూ ఆశ్రిత పొగిడేశారు. నన్ను పొగిడితే బిస్కెట్ వేసినట్టు అంటారా? నావి పాము చెవులు.. వినేశాను అంటూ అభిమానుల స్పందనపై వ్యాఖ్యానించి నవ్వులు పూయించింది సుమ.





## 'ఉరీ' విజయం మరువలేనిది

బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్ ఆనందంలో తేలుతున్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'ఉరీ: ది సర్జికల్ స్ట్రైక్' చిత్రానికి విశేషమైన స్పందన లభించింది. సినిమా ఎంతో స్ఫూర్తి దాయకంగా ఉందంటూ విమర్శకులు, సినీ ప్రముఖులతోపాటు నాయకులు కూడా మెచ్చుకున్నారు. సినిమా బాక్సాఫీసు వద్ద దేశవ్యాప్తంగా రూ.175 కోట్లు వసూలు చేసింది. విదేశాల్లో రూ.35 కోట్లకుపైగా రాబట్టిందని సినీ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చిత్ర బృందం సంబరాలు చేసుకుంది. విక్కీ ప్రేక్షకులకు ధన్యవాదాలు చెబుతూ సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. "జోష్ ఎలా ఉంది'? ('ఉరీ'లోని డైలాగ్) అని అడుగుతూ ప్రతి రోజూ మీరు (నెటిజన్లు) చేస్తున్న పోస్టులు, వీడియోలు చూస్తూనే ఉన్నాను. ఇప్పుడు ఎంత జోష్‌లో ఉన్నాననే విషయాన్ని ఒక్క మాటలో చెప్పలేను. ఇది కేవలం సినిమాలోని ఓ డైలాగ్ మాత్రమే కాదు.. దాన్ని మీరు ఓ ఎమోషన్‌లా ప్రత్యేకంగా మార్చేశారు. దీన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాను' అని పోస్టు చేశారు. ఆయన వేసుకున్న చొక్కాపై కూడా 'జోష్ ఎలా ఉంది?' అని రాసి ఉంది.



## బ్లాక్‌డ్రెస్‌లో మెరిసిన సామ్

అందాల తార సమంత ఓవైపు షూటింగ్‌లతో బిజీగా ఉన్నా ఫోటోషూట్లకు సరిపడినంత సమయం కేటాయిస్తోంది. అలాగే సామాజిక మాధ్యమాల్లో నిరంతరం అభిమానులకు టచ్‌లో ఉంటున్నారు. లేటెస్ట్‌గా బ్లాక్ డిజైనర్ డ్రెస్‌లో సామ్ ఫోటోషూట్ యువతరాన్ని ఆకర్షిస్తోంది. బ్లాక్ డ్రెస్‌లో ముచ్చటగా ఒదిగిపోయిన ఈ ఫోటోని ఇప్పటికే ఐదున్నర లక్షల మంది సామాజిక మాధ్యమాల్లో వీక్షించారు. ఆమె నటిస్తున్న మజిలీ ఇక రిలీజ్‌కి రెడీ అవుతోంది. నాగచైతన్య ఈ చిత్రంలో కథానాయకుడిగా నటిస్తున్నాడు. 2019లో బ్లాక్ బస్టర్‌తో సత్తా చాటాలన్న లక్ష్యంతో ఉందంట. చైతూ - సమంత కాంబినేషన్‌లో మరిన్ని చిత్రాలకు సంతకాలు చేసే ఆలోచన ఉన్నట్టు సమాచారం.



## ర్యాంప్‌పై పడబోయిన యామీ గౌతమ్

ఫెయిర్ అండ్ ల్లీ బ్రాండ్ అంబాసిడర్‌గా గుర్తింపు పొందిన నటి యామీ గౌతమ్. బాలీవుడ్‌లో కాబిల్‌లాంటి ప్రయోగాత్మక చిత్రంలో హృతిక్ సరసన నటించి మెప్పించింది. అంధురాలైన ప్రేమికురాలిగా ఎమోషనల్ పెర్ఫామెన్స్‌తో మైమరిపించింది. 'విక్కీడోనర్' లాంటి బ్లాక్‌బస్టర్‌తో ఎంట్రీ ఇచ్చి యువత గుండెల్లో స్థానం సంపాదించుకుంది. ప్రస్తుతం పలు హిందీ చిత్రాలకు సంతకాలు చేసిన యామీ ముంబై లాక్మే ఫ్యాషన్ వీక్ తొలిరోజు ర్యాంప్ వాక్‌తో అదరగొట్టేసింది. అయితే ఈ వేదికపై యామీ హైహీల్స్ ఇబ్బంది పెట్టాయి. నేలపై వేలాడుతూ పొడవుగా ఉన్న తన డ్రెస్‌కి హై హీల్స్ తాకి జారి పడబోయి తమాయించుకుంది. అయితే ఆ సమయంలో యామీ ఆ ప్రమాదం నుంచి తనని తాను కవర్ చేసుకున్న తీరు ఆసక్తికరం.



తమిళ 'అత్తారింటికి దారేది'పై

## నెగటివ్ టాక్

తమిళ 'అత్తారింటికి దారేది' సినిమాపై నెగటివ్ టాక్ వచ్చింది. తెలుగులో 'అత్తారింటికి దారేది' సినిమా భారీ సక్సెస్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమాను తమిళంలో శింబు హీరోగా తెరకెక్కించారు. శింబు సరసన కేథరిన్, మేఘ ఆకాశ్ నటించారు. కీలకమైన పాత్రలో రమ్యకృష్ణ నటించింది. శుక్రవారం తమిళ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బ్యాడ్ టాక్ తెచ్చుకుంది. కథాకథనాల పరంగా ఈ సినిమా మొత్తం ఆసక్తిగా లేదని, శింబు ఓవరాక్షన్ విసుగు పుట్టించిందని.. టాక్. ఇంకా తెలుగులో సమంతలా మేఘా ఆకాశ్ ఆకట్టుకోలేక పోయిందని, సింబు స్టైలిష్‌గా కనబడినా డైలాగులు బాగున్నా తమిళ ప్రేక్షకులను మెప్పించలేకపోయిందని సమాచారం.

## కోట్లు కూడబెట్టలేదు... : హేమ



క్యారెక్టర్ ఆర్టిస్ట్ హేమ ఎంత ఎనర్జిటిక్‌గా ఉంటారో ఆఫ్ ది స్క్రీన్ కూడా అంతే ఎనర్జీతో ఉంటారు. ఇటీవల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, సినిమా ఇండస్ట్రీలో కోట్ల రూపాయలేమీ సంపాదించలేదని, కానీ తనకు ఇతర ఇన్‌కమ్ సోర్సెస్ ఉన్నాయని వెల్లడించింది. తన పేరెంట్స్ బాగా ఉన్నవాళ్ళేనని, అత్తమామలు కూడా డబ్బున్న కుటుంబమేనని తెలిపింది. కానీ తన నాన్నగారు మొదట్లో మేస్త్రిగా పని చేసి చాలా కష్టపడ్డారని తెలిపింది. మిమ్మల్ని బయట 'గయ్యాళి' అని అనుకుంటున్నారు కదా అని అడిగితే అదేమీ లేదని.. ముక్కుసూటిగా ఉండడం వల్ల కొందరు అలా పొరపాటు అభిప్రాయం ఏర్పరచుకొని ఉండొచ్చని అన్నారు.



## తెలుగులో అవకాశాలు మున్నాళ్ల ముచ్చటేనా

కియారా అద్వానీ తన మొదటిచిత్రం "భరత్ అనే నేను"లో పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకుంది. దీంతో అదే నిర్మాణ సంస్థలో మరో చిత్రం చేయడానికి అవకాశం కొట్టేసింది. అయితే ఈ సారి అంచనాలు తలకిందులయ్యాయి. బోయపాటి దర్శకత్వంలో రామ్‌చరణ్ సరసన "వినయ విధేయ రామ" చిత్రంలో నటించిన ఈ చిత్రం ఆశించిన స్థాయిలో లేకపోయే సరికి కాస్త నిరాశలో పడింది. మరోపక్క బాలీవుడ్‌లో 'అర్జున్ రెడ్డి' రీమేక్‌గా వస్తున్న "కబీర్ సింగ్" చిత్రంలో షాహిద్ కపూర్ సరసన నటిస్తోంది. తెలుగులో ఆఫర్లు లేక బాలీవుడ్ వైపే మొగ్గు చూపుతోంది. 'కబీర్ సింగ్' చిత్రం మరిన్ని ఆఫర్లు తెచ్చిపెడుతుందని బోలెడన్ని ఆశలతో ఉంది. ప్రస్తుతానికి తెలుగులో ఆఫర్లు కరవై అవకాశం కోసం ఎదురుచూస్తోంది. ఏది ఏమైనా ఆమె తెలుగులో నటించడం అనేది మూన్నాళ్ల ముచ్చటగా ముగుస్తుందో లేదో సమయమే నిర్ణయించాలి.

## మోడీ ర్యాలీలో తొక్కిసలాట



**తంకూర్‌నగర్ (పశ్చిమ బెంగాల్) :** ఉత్తర 24 పరగణాలలోని తంకూర్‌లో జరిగిన ప్రధాని మోడీ ర్యాలీలో తొక్కిసలాట జరగడంతో పలువురికి గాయాలయ్యాయి. దీంతో ఆయన తన ప్రసంగాన్ని కుదించుకుని మరో ర్యాలీకి వెళ్లారు. మతువా వర్గానికి చెందిన వందలాది మంది మద్దతుదార్లు ప్రాంగణానికి వెలుపల వేచిచూస్తున్నవారు ప్రధాని రాకతో ఒక్కసారిగా సభావేదికపైకి దూసుకురావడంతో ఈ పరిస్థితి తలెత్తింది. మహిళలు, పిల్లలకు గాయాలయ్యాయని పోలీసులు వెల్లడించారు. మోడీ ఆ గుంపును వేదికవద్దకు రావద్దని అక్కడే ఉండాలని కోరినప్పటికీ ఫలితం లేకపోయింది. కుర్చీలను విసురుకోవడంతో ముందు భాగంలోని మహిళలకు గాయాలయ్యాయి. పలువురు మహిళలు, పిల్లలు స్పృహకోల్పోయారు. వారందరినీ ప్రాథమిక చికిత్స అందించామని అధికారులు తెలిపారు.

## ఘర్షణలో కుష్వాహాకు గాయాలు




**పాట్నా :** పోలీసులతో జరిగిన ఘర్షణల్లో రాష్ట్రీయ లోక్ సమత పార్టీ (ఆర్ఎల్ఎస్పీ) అధినేత ఉపేంద్ర కుష్వాహా సహా మరికొంతమంది నాయకులు గాయాలపాలయ్యారు. ఆర్ఎల్ఎస్పీ ఆక్రోష్ మార్చ్ నిర్వహిస్తుండగా ఈ ఘటన జరిగింది. కుష్వాహా వర్గానికి చెందిన నాయకుడు జగ్‌దేవ్ ప్రసాద్ జయంతి సందర్భంగా వారు ఈ మార్చ్‌ను చేపట్టారు. విద్యా సౌకర్యాలు మెరుగు చేయాలని నినాదించారు. మార్చ్ గవర్నర్ ఇంటికి రెండు కిలోమీటర్ల దూరంలోనే పోలీసులు మార్చ్‌ను అడ్డుకున్నారు. తనపై పిడిగుద్దులు పడటంతో కుష్వాహా రోడ్డుపైనే బైటాయించారు. రాష్ట్రంలో నియంతృత్వం సాగుతోందని, అందుకే పోలీసులు తమపై అమానుషంగా దాడి చేశారన్నారని మండిపడ్డారు. గాయపడిన ఆయనను పాట్నా మెడికల్ ఆసుపత్రికి తరలించారు. అయితే కేంద్రంలో విద్యాశాఖ సహాయ మంత్రిగా ఉండి కుష్వాహా ఏం చేశారని ముఖ్యమంత్రి నితీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అన్ని స్థానాల్లో పోటీ



**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని ఢిల్లీ మాజీ సీఎం, ఆ పార్టీ నేత షీలా దీక్షిత్ తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీతో కాంగ్రెస్ పొత్తును కొట్టిపారేశారు. ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాలకు గెలుపు అభ్యర్థులను పోటీలో ఉంచుతామని తెలిపారు. కొత్త, పాత ముఖాలు ఉంటాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీతో కాంగ్రెస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాల మధ్య ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఓడినా, గెలిచినా అన్ని స్థానాల్లో పోటీ చేస్తామన్నారు. కాంగ్రెస్ ఆధీనంలోని 15 ఏళ్ల ఢిల్లీ పాలన చారిత్రాత్మకమని తెలిపారు. ప్రజలను ఆప్ తప్పుదారి పట్టిస్తోందని, దీనికి ఢిల్లీ ప్రజలు త్వరలో గట్టి సమాధానం చెబుతారన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ గెలుపుకు విస్తృత అవకాశాలున్నాయని షీలా దీక్షిత్ వెల్లడించారు. అయితే ఢిల్లీ, పంజాబ్, హర్యానాలో ఒంటరిగా పోటీ చేస్తామని ఆప్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# మోడీకి ప్రత్యామ్నాయం



**న్యూఢిల్లీ:** మళ్లీ కేంద్రంలో అధికారపగ్గాలు చేజిక్కించుకునేందుకు బీజేపీ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నది. నరేంద్రమోడీ నేతృత్వంలోనే ఎన్నికలకు వెళ్లాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ప్రకటించారు. మోడీకే ప్రజల మద్దతు ఉందనీ, ప్రతిపక్షాలు ఎవరు ఆయన దరిదాపుల్లోకి రారని ధీమా ఉన్నా లోలోపల మాత్రం ఆ పార్టీ నేతల్లో భయాందోళన నెలకొంది. ఎన్నికలకు ముందు ప్రజలను ఆకర్షించేందుకు ఎన్ని హామీలు గుప్పించినా మోడీ పట్ల అనుకున్నంత ఆదరణ పెరగడం లేదు. బీజేపీతో కలిసి నడవడానికి మిత్రులు సాహసం చేయడం లేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి మోడీ బొమ్మతో ఎన్నికలకు వెళ్లినా ఫలితాల అనంతరం సీట్ల ఆధారంగా మరో వ్యక్తిని తెరపైకి తీసుకురావడానికి ఆర్ఎస్ఎస్ వ్యూహాలు రచిస్తున్నట్టు తెలిసింది. 2014లో వచ్చిన సీట్లను ఈ ఎన్నికల్లో గెలుచుకోవడం అసంభవమన్నది బీజేపీ నేతల అంచనా. కొన్ని పార్టీల మద్దతుతో అధికారంలో రావాలంటే 150పైగా సీట్లు గెలవాల్సి ఉంది. అలా అయితే మిత్రుల మద్దతు పొందాలన్నా ప్రధానిగా మరో వ్యక్తిని తీసుకురావాలన్నది ఆర్ఎస్ఎస్ ఆలోచన. అందులో భాగమే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు అని తెలుస్తోంది. హామీల నేరవేర్చడంపైనా, ఎన్నికల్లో ఓటమిపైనా, పదిశాతం రిజర్వేషన్లు అమలు చేసినప్పుడు ఉపాధి అంశంపైనా పరోక్షంగా మోడీని వ్యతిరేకిస్తూ నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు చేయడం వెనుక ఆర్ఎస్ఎస్ హస్తం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. మోడీపై వ్యతిరేకతను ప్రతిపక్షాలు క్యాష్ చేసుకోకుండా గడ్కరీ చేత మాట్లాడించి ఉంటారని పలువురు సీనియర్ నేతలు అభిప్రాయపడ్డారు. ఇది ఆర్ఎస్ఎస్, బీజేపీ వ్యూహంలో భాగమేనని జాతీయ మీడియా కథనం. ఆర్ఎస్ఎస్‌కు నమ్మకస్తుడైన గడ్కరీ మోడీని విమర్శించడమంటే ఆర్ఎస్ఎస్‌ను తప్పుబట్టే. ఐదేళ్లు మంత్రిగా ఉంటూ ఏనాడూ పల్లెత్తు మాటనని వ్యక్తి

### ఆర్ఎస్ఎస్ తర్జనభర్జన

ఎన్నికల సమయంలో స్పందించడమేంటన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఎన్నికల అనంతరం మిత్రులను సంపాదించాలంటే గడ్కరీకి సాధ్యమన్న అభిప్రాయంతోనే ఆయనను తెరపైకి తెచ్చిందన్న ప్రచారం జరుగుతున్నది. మోడీకి వ్యతిరేకంగా విమర్శలు చేస్తున్నా గడ్కరీని తప్పుపట్టలేదంటే, అదంతా వ్యూహంలో భాగమేనంటున్నారు పరిశీలకులు.

అధికారంలో ఉన్నన్ని రోజులు దేశాభివృద్ధి విషయంలోనూ, సామాన్యప్రజలకు లబ్ధి చేకూర్చే ఏ ఒక్క పనిని మోడీ చేయలేదన్న విమర్శలు న్నాయి. ఎన్నికల సమయంలో ఆయా వర్గాల ప్రజలను ఆకట్టుకునేందుకు కొన్ని కార్యక్రమాలు చేపడుతున్నా అవి ఏ మేరకు ఓట్ల రూపంలో పడతాయన్నది ఆ పార్టీ నేతల్లో ఇప్పటికీ అనుమానంగానే ఉంది. మరోవైపు అయోధ్య పేరుతో హిందువుల ఓట్లకు గాలం వేయడానికి ప్రయత్నిస్తున్నది. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు రాజేందుకు వ్యూహాలు సిద్ధం చేసిందన డానికి బీజేపీ నేతలు వ్యాఖ్యలే నిదర్శనమని తెలుస్తోంది. చివరికి ప్రధాని మోడీ కూడా అయోధ్య, శబరిమల అంశాలపై సుప్రీంకోర్టు తీర్పులను వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. ప్రతిపక్షాల్లో బలహీనతలు ఉన్నా యంటూ ప్రచారం చేస్తూ మోడీలాంటివారు ఉండబోరని ఆకాశాకెత్తేస్తున్నా వారిలో ఎక్కడచోట భయాందోళన నెలకొంది. ఎన్‌డీఏ కూటమిలో ఉన్న మిత్రుల్లో ఇప్పటికే 17 మంది పార్టీలు దూరమయ్యాయి. మిత్రులతో సంబంధం లేకుండా 2014 ఎన్నికల్లో సొంతబలంతోనే అధికారం చేపట్టినా ఈ సారి ఆ పరిస్థితి లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మోడీ అధికారం లోకొచ్చాక మొదట్లో కొన్ని రాష్ట్రాల్లో గెలిచినా ఆ తర్వాత జరిగిన ఉపఎన్నికలు, ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చిత్తుగా ఓడిపోయింది. బీజేపీకి బాగా పట్టున్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్‌ల్లో బీజేపీ ఓడింది. కర్నాటకలోనూ పరాభావం తప్పలేదు. తెలంగాణలోనూ ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఉపఎన్నికల ఫలితాల్లో ఘోరంగా దెబ్బతింది. దీనకంతంటికీ మోడీ అనుసరిస్తున్న విధానాలతో ప్రజలు విసుగెత్తడమేనని విశ్లేషకుల అభిప్రాయం.

## ప్రధాని మోడీ పోస్టర్లు తొలగింపు

**కోల్‌కతా :** లోక్‌సభ ఎన్నికల కోసం పశ్చిమ బెంగాల్‌లోని బరద్వానీ జిల్లాలో బీజేపీ తలపెట్టిన ర్యాలీకోసం ఏర్పాటు చేసిన మోడీ పోస్టర్లను తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కార్యకర్తలు తొలగించారు. దీంతో ఇరువర్గాలకు మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ ఘటనలో బీజేపీ కార్యకర్తలు గాయాలపాలయ్యారని ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయంతన్ బసు తెలిపారు. బీజేపీ కార్యకర్తలను టీఎంసీ కార్యకర్తలు బెదిరించారన్నారు. మోడీ ఫోటోలతో ఉన్న పోస్టర్లపై టీఎంసీ నాయకుల ఫోటోలను అతికించారన్నారు. ఈ ఆరోపణలను టీఎంసీ నాయకులు కొట్టి వేశారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోస్టర్లపై నల్లరంగు సిరా పూశారని వారు ఆరోపించారు. రెండు పార్టీల కార్యకర్తలకు గాయాలయ్యాయని. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నామని పోలీసులు వెల్లడించారు.

## షాబుద్దీన్ మేనల్లుడి కాల్చివేత

**సీవాన్ :** రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) ఎంపీ మహ్మద్ షాబుద్దీన్ మేనల్లుడు యూసుఫ్ శుక్రవారం రాత్రి కాల్చివేతకు గురయ్యారరి ఎస్పీ నవీన్ చంద్ర ఝా తెలిపారు. ఆయనను హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారన్నారు. ఘటనా స్థలంలో ఖాళీ తుపాకీ, మూడు బుల్లెట్లు లభించాయన్నారు. షాబుద్దీన్ సివాన్ నుంచి నాలుగుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. రాజీవ్ రోషన్ హత్యకేసులో అతనికి 11ఏళ్ల జైలు శిక్ష పడింది. జర్నలిస్టు రాజ్‌దేవ్ రంజన్ కేసులో షాబుద్దీన్‌తో సహా మరో ఏడుగురిపై కోర్టు విచారణ జరిపిన వారం రోజుల్లో ఈ హత్య జరగడం గమనార్హం.

## రాబర్ట్ వాద్రాకు ఊరట



**న్యూఢిల్లీ :** వ్యాపారవేత్త, సోనియాగాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రాకు మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ కోర్టు ఈనెల 16 వరకు ముందస్తు బెయిలు మంజూరు చేసింది. ఈనెల 6న ఈడీ ఎదుట హాజరై వారి దర్యాప్తుకు సహకరించాలని ప్రత్యేక జడ్జి అరవింద్ కుమార్ ఆదేశించారు. లండన్‌లోని బ్రియాన్‌స్టోన్ స్వేర్‌లో 1.9 మిలియన్ల పౌండ్లతో వాద్రా ఆస్తులు కొన్నారని ఆరోపణలు ఉన్నాయి.

## ముగ్గురి మృతదేహాల వెలికితీత

**శ్రీనగర్ :** జమ్మూకాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో మంచుచరియలు విరిగిపడి మృతి చెందిన ముగ్గురి మృతదేహాలను వెలికి తీశామని అధికారులు తెలి పారు. ఫాల్గం- అరు రోడ్‌లో శుక్రవారం మంచు యంత్రంతో సహాయక కార్యక్రమాలు చేపడుతుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుందని అధికారులు తెలిపారు. ఒకరు ప్రాణాలతో బయటపడ్డారని, అతనికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామన్నారు. మంచు చరియలు విరిగిపడే ప్రదేశంలోకి వెళ్లరాదని ప్రభుత్వం హెచ్చరించింది.

## దుష్ప్రచారంపై అన్ని రాష్ట్రల్లో ఎఫ్ఐఆర్



**న్యూఢిల్లీ :** ప్రియాంకాగాంధీ క్రియాశీలక రాజకీయాల్లోకి ప్రవేశించగానే ఆమెపై దుష్ప్రచారం మొదలైంది. దీంతో అన్ని రాష్ట్రాల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కాంగ్రెస్ మహిళా విభాగం భావిస్తోంది. ఆమె రాకను అడ్డుకునేందుకు బీజేపీ అనేక వ్యక్తిగత దూషణలకు పాల్పడిందని. దీనిపై దేశవ్యాప్తంగా సోమవారం అన్ని రాష్ట్రాల రాజధానుల్లో ఫిర్యాదు చేయాలని నిర్ణయించినట్లు ఉత్తరప్రదేశ్ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దేవ్ ఒక వీడియోను ట్విటర్‌లో పోస్టు చేశారు. ప్రియాంక కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులు కాగానే ఆమెపై బురద చల్లుతున్నారన్నారు. దీనిపై ఢిల్లీలో ఎఫ్ఐఆర్ నమోదు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర రాజధానుల్లోని పోలీసు అధికారులకు ఫిర్యాదులు అందిస్తామని, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. బీహార్ మంత్రి వినోద్ నారాయణ్ ఝా మాట్లాడుతూ ప్రియాంక గాంధీ అందంగా ఉంటారని అందాన్ని చూసి ఎవరూ ఓట్లెయ్యరన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు విజయవర్గీయ మాట్లాడుతూ చాక్లెట్ ముఖంతో లోక్‌సభలో అడుగు పెడితే బలమైన నాయకులు కరవు అవుతారన్నారు. మరో బీజేపీ ఎమ్మెల్యే సురేంద్ర సింగ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రావణుడని, అతని సోదరి ప్రియాంక శూర్పణఖ అన్నారు.

### ఓటమి గుణపాఠంతోనే

## జనాకర్షక బడ్జెట్

- ఎన్నికలకు ముందు విధాన నిర్ణయం
- అనుకూలంగా ఉండొచ్చని బీజేపీ అంచనా



**న్యూఢిల్లీ :** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో గుణపాఠం నేర్చుకున్న మోడీ సర్కార్, లోక్‌సభ ఎన్నికలకు రెండు నెలల ముందు విధానపరమైన నిర్ణయాలతో కూడిన బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. గతంలో బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో భంగపాటును ఆ పార్టీ జీర్ణించుకోలేకపోతోంది. ఉద్యోగులు, రైతులు, కార్మికులు ఆయా రాష్ట్రాల్లో వ్యతిరేకంగా ఓటు వేయటం వల్లే ఓటమి చెందామనే యోచనలో బీజేపీ యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ఆ వర్గాల ఓట్లను పొందే ఉద్దేశంతోనే 2019-20 బడ్జెట్‌లో వరాల జల్లు కురిపించిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాదిలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో అన్ని వర్గాల ఓట్లను పొందే ఉద్దేశంతో జనరల్ కేటగిరిలో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఈబీసీ)లకు పది శాతం రిజర్వేషన్లను కల్పించే చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించింది. అలాగే ఉద్యోగుల ఎప్పటి నుంచో ఆదాయపన్ను పరిమితిని పెంపు కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా ఆదాయ పరిమితిని రూ.5 లక్షలకు పెంచగా, రైతులకు రూ.6 వేలు సాయాన్ని ప్రకటించింది. అసంఘటితరంగ కార్మికులకు రూ.3 వేలు పింఛన్ ఇవ్వాలని కూడా కేంద్రం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఇన్నాళ్లు బీజేపీపై వ్యతిరేకంగా ఉన్న వారు రైతులకు రూ.6 వేలు సాయంతోపాటు వడ్డీ రాయితీ పథకంతో అనుకూలంగా మారే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

### భారత విద్యార్థుల కోసం

## అమెరికాలో ప్రత్యేక హాట్‌లైన్

- 24 గంటలు పని చేసేలా ఎంబసీ ఏర్పాట్లు
- నకిలీ వర్సిటీ రాకెట్‌లో 130 మంది అరెస్టు
- వారిలో 129 మంది భారతీయులేనని నిర్ధారణ
- దౌత్యపరమైన చర్యలు చేపట్టాలన్న మంత్రి సుష్మా




**న్యూఢిల్లీ /వాషింగ్టన్ :** నకిలీ యూనివర్సిటీలో చేరి అమెరికాలో అరెస్టయిన భారతీయ విద్యార్థుల కోసం భారత రాయబార కార్యాలయం ప్రత్యేకంగా హాట్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. ఇది 24 గంటలపాటు పని చేస్తుందని కార్యాలయం శనివారం వెల్లడించింది. విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులకు నిరంతరం అందుబాటులో ఉండేందుకు నోడల్ అధికారిని కూడా నియమించింది. టెక్సాస్‌లోని డిటెన్షన్ సెంటర్‌లో ఉన్న భారత విద్యార్థులను అక్కడి భారత రాయబార కార్యాలయ అధికారులు కలిశారు. విద్యార్థులకు అన్ని విధాల సాయం చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థి వీసా ముసుగులో వందలాది మంది విదేశీయులు అమెరికాలో అక్రమంగా నివశించేందుకు, ఉద్యోగం చేసుకునేందుకు వీలు కల్పించిన ఎనిమిది మంది దళారులను అమెరికాలోని ఇమిగ్రేషన్ అధికారలు అరెస్టు చేశారు. నకిలీ విద్యార్థి వీసాలతో ఉంటున్న 130 మది విదేశీయులను అరెస్టు చేయగా, వారిలో 129 మంది భారతీయులేనని అమెరికా వెల్లడించింది. ఈ నేపథ్యంలో కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి సుష్మా స్వరాజ్, అమెరికా రాయబార కార్యాలయ అధికారులు రంగంలోకి దిగారు. అమెరికా అరెస్టు చేసిన విద్యార్థులను విడిపించేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు మంత్రి సుష్మా స్వరాజ్ తెలిపారు. భారత విద్యార్థులను అరెస్టు చేయటంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వారిని తక్షణమే విడిపించేందుకు దౌత్యపరమైన చర్యలు చేపట్టాలని అమెరికన్ ఎంబసీని కోరారు. రాయబార కార్యాలయం ఏర్పాటు చేసిన హాట్‌లైన్ 24 గంటలపాటు అందుబాటులో ఉంచాలని సూచించారు. అండర్ కవర్ ఆపరేషన్‌లో భాగంగా అధికారులు ప్రారంభించిన డెట్రాయిట్ ఫార్మింగ్‌టన్ యూనివర్శిటీ నకిలీదని విద్యార్థులకు తెలియదని ఇమ్మిగ్రేషన్ అటార్నీ అధికారులు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో ఫెడరల్ అధికారుల తీరును తప్పుబట్టారు. అమెరికాలో కొన్ని యూనివర్శిటీలు తొలి రోజునుంచే కరిక్యులర్ ప్రాక్టికల్ ట్రెనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తాయని, ఇది కూడా అలాంటిదేనని భావించి విద్యార్థులు చేరినట్లు తమకు తెలిసిందని అట్లాంటా అటార్నీ మైఖేల్ సోఫో తెలిపారు. విద్యార్థి వీసాలను దుర్వినియోగం చేసేవారిని వలపన్ని పట్టుకోవాలని అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగానే ఐసీఈలోని అంతర్గత భద్రత దర్యాప్తుకు చెందిన ప్రత్యేక ఏజెంట్లు మిషిగన్ రాష్ట్రంలోని డెట్రాయిట్ ప్రాంతంలో ఫార్మింగ్‌టన్ హిల్స్‌లో ఫార్మింగ్‌టన్ విశ్వ విద్యాలయాన్ని ఒక చిన్న భవనంలో ఏర్పాటు చేశారు. వర్సిటీకి సంబంధించిన సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ విషయం తెలియని ఎనిమిది మంది 600 మంది విద్యార్థులను నకిలీ యూనివర్సిటీలో చేర్పేందుకు ప్రయత్నించి అధికారులకు చిక్కారు. ఎనిమిది మంది ఏజెంట్లతో పాటు 130 మంది విద్యార్థులను అరెస్టు చేయగా, వారిలో 129 మంది భారత విద్యార్థులు కావటం గమనార్హం.


### భీమాకోరెగావ్ కేసు

## తేల్తుంబ్డే అరెస్టు..విడుదల

- పూనే పోలీసులకు సెషన్స్ కోర్టు మొట్టికాయలు
- సుప్రీం ఆదేశాలు బేఖాతరు
- అరెస్టుపై మేధావులు, విద్యావేత్తల ఆగ్రహం




**పూనే :** ప్రముఖ రచయిత, విద్యావేత్త అనంద్ తేల్తుంబ్డే అరెస్టుపై పూనే పోలీసులకు సెషన్స్ కోర్టు మొట్టికాయలు వేసింది. తేల్తుంబ్డేను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించింది. ఆయన అరెస్టును అక్రమంగా పేర్కొన్నది. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణపై తేల్తుంబ్డేను పూనె పోలీసులు శనివారం తెల్లవారుజామున ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్టు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఫిబ్రవరి 11వ తేదీ వరకూ తేల్తుంబ్డేను అరెస్టు చేయవద్దని ఆదేశించింది. బెయిల్ కోసం తేల్తుంబ్డే ప్రయత్నించుకోవచ్చని స్పష్టంచేసింది. పూనేలోని ప్రత్యేకకోర్టు శుక్రవారం తేల్తుంబ్డే ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించడంతో పూనే పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. తేల్తుంబ్డే అరెస్టును ఏసీపీ శివాజీ పవార్ ధృవీకరించారు. కాగా, ప్రభుత్వ వ్యతిరేక వాణి వినిపిస్తున్న కవులు, కళాకారులు, మేధావులు, విద్యావేత్తలను నరేంద్రమోడీ ప్రభుత్వం అణచివేస్తోంది. కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఇప్పటికే కొంతమంది మేధావులు, హేతువాదులను పొట్టనబెట్టుకున్న మోడీ ప్రభుత్వం భీమాకోరెగావ్ కేసులో అనేకమందిని అరెస్టు చేసింది. కొంతమంది జైలులో ఉన్నారు. తాజాగా ప్రముఖ రచయిత, విద్యావేత్త ఆనంద్ తేల్తుంబ్డేను పూనె పోలీసులు అరెస్టు చేశారు. మావోయిస్టు పార్టీతో




ఆయనకు సంబంధాలు ఉన్నట్టు పోలీసులు ఆరోపిస్తున్నారు. ముంబై విమానాశ్రయానికి చేరుకున్న ఆనంద్‌ను పూనే పోలీసులు తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. దీనితో 2018లో జరిగిన భీమాకోరెగావ్ హింస కేసులో అరెస్టు అయిన వారి సంఖ్య పదికి చేరింది. ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో తెల్లవారుజామున 3.30 గంటలకు తేల్తుంబ్డేను అరెస్టు చేసినట్టు పోలీసు వర్గాలు వెల్లడించాయి. అక్కడి నుంచి ఆయనను పూనే తీసుకెళ్లారు. పూనే కోర్టు ఆదేశాలను బోంబే హైకోర్టులో సవాల్ చేయడానికి తేల్తుంబ్డే ముంబైకి వచ్చారు. అంతకుముందు తేల్తుంబ్డే, ఆయన సోదరుడు మిలింద్ తేల్తుంబ్డేకు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని, అందువల్ల ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల పవార్ పూనే పోలీసుల తరపున వాదించారు. మరోవైపు, తేల్తుంబ్డే అరెస్టును ఆయన మద్దతుదారులు తీవ్రంగా ఖండించారు. తేల్తుంబ్డేను అరెస్టు చేయవద్దంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పోలీసులు తుంగలో తొక్కారని నిందించారు. ముందస్తు బెయిల్‌పై విచారణ కోర్టు నిర్ణయం వరకే అరెస్టు చేయవద్దని సుప్రీం చెప్పినట్టు పూనే పోలీసులు వాదిస్తున్నారు. తాము ఆదేశాలిచ్చిన తర్వాత నాలుగు వారాల వరకూ తేల్తుంబ్డేను అరెస్టు చేయవద్దని సుప్రీం అంతకుముందు ఆదేశించింది. ఆ నాలుగువారాల గడువు ఇంకా పూర్తికాకుండానే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. పూనే పోలీసుల తీరుపై ఐఐఎం అహ్మదాబాద్ సహా మేధావులు, విద్యావేత్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన అరెస్టును ఖండించారు.

## రైతు జాబితా సిద్ధం చేయండి

- మార్చి కల్లా రూ.2 వేలు వేస్తాం
- రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం లేఖలు
- రైతు పథకం అమలుకు ఆరాటం



**న్యూఢిల్లీ :** ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. రైతులకు గాలం వేయడానికి నరేంద్రమోడీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. చిన్న, మధ్యతరగతి రైతులను సత్వరమే గుర్తించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం లేఖలు రాసింది. మార్చి చివరికల్లా అన్ని వివరాలు సిద్ధం చేయాలని తెలిపింది. బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా రైతులకు మొదటి విడతగా రూ.2 వేలు పంపిణీ చేయడానికి సిద్ధమైంది. ఐదు ఎకరాల వరకు రైతులకు ఏడాదికి రూ.6 వేలు సాయం చేయడానికి కేంద్రం బడ్జెట్‌లో రూ.75 వేల కోట్లు ప్రకటించింది. ఈ పథకం కింద మొదటి విడతగా రైతులకు మార్చి చివరినాటికి రూ.2వేలు బ్యాంకు ఖాతాల్లో జమజేస్తామని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్ శనివారం చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే 12 కోట్ల మంది రైతులకు రూ.2 వేల చొప్పున పంపిణీ చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.20 వేల కోట్లు మంజూరు చేసింది. రాజీవ్‌కుమార్ శనివారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యవసాయ ప్యాకేజీని అమలు చేయడం పెద్దకష్టమేమీ కాదని చెప్పారు. అయితే, సమయం తక్కువ ఉన్నందున ఈశాన్య రాష్ట్రాల్లో ఈ పథకం అమలు కొంత ఇబ్బందిగా ఉండవచ్చని వ్యాఖ్యానించారు. 'ఈ ప్రతి పాదనపై కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ కసరత్తు ప్రారంభించింది. యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతాయనడంలో సందేహం లేదు. అత్యవసర ప్రాతిపదికన కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించాయని రాజీవ్ చెప్పారు. వ్యవసాయ మంత్రిత్వశాఖ కార్యదర్శి ఫిబ్రవరి ఒకటినే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శులు చర్యలు ప్రారంభించా రన్నారు. 'చిన్న, మధ్యతరగతి రైతుల వివరాలన్నీ సేకరించండి. లబ్ధిదారులను గుర్తించండి. గ్రామాల్లో పర్యటించి రైతు పేరు, స్త్రీనా లేక పురుషుడా?, ఆ రైతు ఎస్సీనా, ఎస్టీనా? తెలుసుకోండి. ఆ పేర్ల జాబితాను గ్రామ పంచాయతీ బోర్డులో అంటించండి. ఈ సాధ్యమైనంత వరకూ ఈ ఆర్థిక సంవ త్సరంలోనే డబ్బులు పంపిణీ చేస్తాం' అని ఆ లేఖలో పేర్కొన్నట్టు రాజీవ్ వివరించారు. ఉత్తరప్రదేశ్ సహా అత్యధిక రాష్ట్రాల్లో భూముల డిజిటలైజేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, ల్యాండ్ రికార్డులు కూడా డిజిటలైజేషన్ జరిగాయని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు చెప్పారు. 'మీరు తహశీల్దారు ఆఫీసుకు వెళితే అక్కడ కంప్యూటర్ నుంచి ల్యాండ్ రికార్డుకు సంబంధించిన ప్రింట్ అవుట్ వస్తుంది. దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో ల్యాండ్ రికార్డులు డిజిటలైజ్ అయ్యాయి. అందువల్ల ఈ పథకం అమలులో ఇబ్బందులేమీ ఉండవు' అని ఆయన చెప్పారు. పీఎం కిసాన్ పథకం కింద ఫిబ్రవరి ఒకటి నాటికి ల్యాండ్ రికార్డుల్లో ఎవరి పేరు ఉంటుందో వారే భూ యజమానులని, వారికే ఆర్థిక లబ్ధి చేకూరుతుందని రాజీవ్ వివరించారు. ఈశాన్య రాష్ట్రాల్లో భూములపై కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, తక్కువ సమయం ఉండటం వల్ల భూ యజమానులను గుర్తించడం కష్టంగా ఉంటుందన్నారు. ఈశాన్యంలో ఈ పథకం అమలుకు ప్రత్యామ్నాయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రమంత్రుల కమిటీ, ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆమోదం పొందాలన్నారు. ఏడాదికి రూ.6 వేలు లేదా నెలకు రూ.500 ఏ మూలకు వస్తాయని అడుగగా చిన్న రైతులకు రూ.500 అంటే తక్కువేమీ కాదని రాజీవ్ చెప్పుకొచ్చారు. మీరు ఏ పేద రైతు ఇంటికి వెళ్లి చూడండి..ఇంటి అవసరాలకు వాడుకుంటాడు. పిల్లలను పాఠశాలకు పంపడానికి ఉపయోగిస్తాడు. వ్యవసాయానికి నీటిని కొనుక్కోవడానికి వినియోగిస్తాడని చెప్పారు.

# చర్మకారులు, డప్పు కళాకారుల నిరసన



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : సమాజంలో ఎంతో వెనుక బడిన మాదిగ చర్మ కారులు, డప్పు కళాకారులను ఆదుకోవ డానికి ప్రత్యేక మాదిగ కార్పోరే షన్ ఏర్పాటు చేయాలని నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు, డప్పు కళాకారుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కవలకుంట్ల గోవింద ప్రసాద్ మాదిగ డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం విజయవాడ ధర్నాచౌక్ వద్ద శనివారం నుంచి రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పశువుల పచ్చి చర్మాల కొనుగోలు, అమ్మకాలను మాదిగలు నిర్వహించుకునేలా ప్రభుత్వం తక్షణం జీవో విడుదల చేయాలన్నారు. దేవాదాయ ధర్మాదాయశాఖ పరిధిలోని అలయాలల్లోని చెప్పుల స్టాండ్‌ల నిర్వహణలను మాదిగలకే ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో తోళ్ళ పారిశ్రామిక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ ఉపకులాలకు లబ్ధి చేకూరేలా జీవో నంబరు 25ను అమలు చేయాలన్నారు. చెప్పులు కుట్టుకునే మాదిగలకు ఎటువంటి అంక్షలు లేకుండా మూడు లక్షల రూపాయల వరకు రుణం మంజూరు చేయాలన్నారు. ఈ నిరసనలో పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు తాతపూడి ప్రభుదాసు మాదిగ, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు పాలేటి అమృత, పి.సుబ్బయ్య మాదిగ, వరద రాజులు, గోవిందరాజులు, డి.రామచంద్రయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

# టీడీపీలో 'కోట్ల' చేరిక తెలియదు



విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు : కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరే విషయం తనకు తెలియదని రాష్ట్ర ఉపముఖ్య మంత్రి కేఈ కృష్ణమూర్తి తెలిపారు. కర్నూలులోని ప్రభుత్వ అతిథిగృహంలో శనివారం ఆయన కర్నూలు జిల్లా విజన్ కార్యచరణ ప్రణాళిక విడుదల చేశారు. ఈ సందర్భంగా కేఈ కృష్ణ మూర్తి వద్ద కోట్ల అంశాన్ని పాత్రికేయులు ప్రస్తావించగా కోట్లకు ఏ టికెట్ ఇస్తారన్న విషయం మాట్లాడకపోవడమే మంచిదని సమాధానమిచ్చారు. సూర్యప్రకాష్‌రెడ్డి టీడీపీలో చేరడం, చేరకపోవడం, ఎక్కడ నుంచి పోటీ చేస్తారన్న అంశాన్ని సీఎం చూసుకుంటారన్నారు. నాకు ఎటువంటి సంబంధం లేదన్నారు. టీడీపీలో బీసీలకు అన్యాయం జరగబోదన్నారు. బీసీగా తనకు ముఖ్యమంత్రి అన్యాయం చేయరన్నారు. ఈయన వెంట ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ మల్లెల రాజశేఖర్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



## అడగకపోతే ఎప్పటికీ న్యాయం జరగదు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : రాష్ట్ర విభజనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంతో నష్టపోయిందని, ఈ అన్యాయాన్ని పార్లమెంటు వేదికగా అడగకపోతే ఎప్పటికీ మనకు న్యాయం జరగదని పార్లమెంటు మాజీ సభ్యులు ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. ప్రస్తుత లోకసభలోనైనా ప్రశ్నించి ఉంటే కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం జరిగేదని, అప్పుడు దేశమంతా తెలిసేదన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని వైజంక్షన్ ఆనం రోటరీ హాలులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల తర్వాత ఏర్పడే లోకసభలోనైనా ఈ అంశంపై ఎలా వ్యవహరించాలో రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంద న్నారు. చంద్రబాబును కలిసి చెప్పినప్పుడు ఎంపీలతో మాట్లాడించారని, తాను వివరించినా ఎందుకో సరైన ప్రశ్న రాలేదన్నారు. లోకసభ ప్రచురించిన ప్రొసీడింగ్స్ లో ఆ రోజు ఏం జరిగిందో స్పష్టంగా ఉందని, దాని ఆధారంగానే న్యాయస్థానంలో కేసు వేసి వాయిదాలకు వెళ్తున్నానన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ వేసి ఉంటే బాగుండేదని అరుణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. సమావేశంలో పొడిపిరెడ్డి అచ్యుతదేశాయ్, అల్లు బాబీ, బందారు మధు, పసుపులేటి కృష్ణ పాల్గొన్నారు.

## 4, 5 తేదీల్లో జపాన్ జాబ్ ఫెయిర్

విశాలాంధ్ర - విశాఖపట్నం (మధురవాడ) : విశాఖలోని గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం వేదికగా దేశంలో తొలిసారి ఈ నెల 4, 5 తేదీలలో 'జపాన్ జాబ్ ఫెయిర్' నిర్వహిస్తున్నట్లు గీతం వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ శనివారం ఇక్కడ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గీతం ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ విభాగం, లీప్ (లుక్ ఫర్ ఎంప్లాయీస్ ఇన్ ఆంధ్రప్రదేశ్) సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జపాన్‌కు చెందిన టోక్యోల్యాబ్, డెన్సో, ఎన్‌జపాన్ తదితర కంపెనీల నుంచి 13 మంది ప్రతినిధులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన 300 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రత్యేక పోర్టల్ ద్వారా ఇప్పటికే పేర్లు రిజిస్టర్ చేసుకున్నట్లు పేర్కొన్నారు ప్రాథమిక ఎంపికకు సంబంధించిన ఇంటర్వ్యూలను జపాన్ జాబ్ ఫెయిర్‌లో నిర్వహిస్తారన్నారు. ఎంపిక అయిన విద్యార్థులకు 12 లక్షల నుంచి 15 లక్షల రూపాయిల వార్షిక వేతనం వచ్చే అవకాశం ఉందన్నారు. ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, యు.ఐ, యుఎక్స్ డెవలపర్ వంటి నైపుణ్యాలకు సంబంధించి ఎంపికలు ఉంటాయన్నారు. గీతం సహా వివిధ విద్యాలయాల విద్యార్థులను స్క్రీనింగ్ ద్వారా జపాన్ కంపెనీలు ఇప్పటికే ఎంపిక చేసుకున్నట్లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న గీతం ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ అధికారి గురుమూర్తి గంగాధరన్ తెలిపారు.



## వస్త్రాలపై వ్యాట్ రద్దు చేయకపోతే మరో పోరాటం తప్పదు

విశాలాంధ్ర - విజయవాడ (వన్‌టౌన్) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వస్త్రాలపై విధించిన వ్యాట్‌ను రద్దుచేయకపోతే పోరాటం తప్పదని ఏపీ టెక్స్‌టైల్స్ ఫెడరేషన్ అధ్యక్షులు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి అన్నారు. విజయవాడ కృష్ణవేణి క్లాత్ మార్కెట్‌లోని ఫెడరేషన్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వస్త్ర వ్యాపారస్తులంతా సంఘటిత ఉద్యమాల ఫలితంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి బహిరంగ సభలో వ్యాట్ ట్యాక్స్ పూర్తిగా రద్దు చేస్తునట్లు హామీ ఇచ్చినా అమలు కాలేదన్నారు. నేటికీ కమర్షియల్ ట్యాక్స్ శాఖ అధికారులు వస్త్ర వ్యాపారులను నోటీసులు జారీచేస్తూ పన్ను చెల్లించాలని వత్తిడి చేస్తున్నారన్నారు. వ్యాట్ అంశాన్ని చంద్రబాబు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళినా కనీస స్పందనలేదన్నారు. ఫెడరేషన్ కోశాధికారి వెలంపల్లి రామచంద్రరావు మాట్లాడుతూ 2011-13 నాటి వ్యాట్ ట్యాక్‌ను అప్పటి ముఖ్యమంత్రి రద్దుచేసినా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కమర్షియల్ ట్యాక్స్ అధికారులు వస్త్ర వ్యాపారులకు నోటీసులు జారీ చేస్తూ వేధిస్తున్నారన్నారు. అయితే వస్త్ర వ్యాపారస్తులు ఎటువంటి వ్యాట్‌ను వసూలు చేయలేదన్నారు. పొరుగు రాష్ట్రం తెలంగాణలో వ్యాట్ వసూళ్ళ పూర్తిగా ఎత్తివేశారని, ఆంధ్రాలో మాత్రం నోటీసులు జారీ చేయటం విడ్డూరంగా వుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే జోక్యం చేసుకుని వ్యాట్ ట్యాక్స్ రద్దుచేసేలా చర్యలు తీసుకోలేకపోతే వస్త్ర వ్యాపారులు మరోసారి ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి బచ్చు ప్రసాద్, నాయకులు పొట్టి ఆంజనేయులు, వల్లంకొండ ప్రసాద్ పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ - కాకినాడ మధ్య 10 ప్రత్యేక రైళ్లు

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాద్-కాకినాడటౌన్, హైదరాబాద్- కాకినాడటౌన్ మధ్య ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 10 ప్రత్యేక రైళ్ళు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఇక్కడ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 7,9,15,21 తేదీల్లో రైలు నంబరు 07436గా సికింద్రాబాద్‌లో రాత్రి 08.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 06.25 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబరు 07435గా ఈనెల 8,10,17,24 తేదీలలో కాకినాడ టౌన్‌లో రాత్రి 10.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 08.50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు కాజీపేట, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపూడి, సామర్లకోట రైల్వే స్టేషన్లలో ఆగుతుంది. ఈనెల 5వ తేదీన హైదరాబాద్‌లో రాత్రి 06.50 గటంలకు రైలు నంబరు 07001గా బయలుదేరి మరుసటి రోజు ఉదయం 06.00 గంట లకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 6వ తేదీ రాత్రి 09.00 గంటలకు రైలు నంబరు 07002గా కాకినాడటౌన్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 08.15 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపూడి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

# కష్టాల కడలిలో విశాఖ షిప్‌యార్డ్ !

- అర్డర్ల కోసం యాజమాన్యం ఎదురుచూపు
- వేతన బకాయిల కోసం కార్మికుల ఆందోళన
- అయోమయంలో తొలి నౌకా నిర్మాణ కేంద్రం



విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో : దేశంలోనే తొలి నౌకా నిర్మాణ కేంద్రం విశాఖ షిప్‌యార్డు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతోంది. ఆర్డర్ల కోసం ఎదురుచూస్తోంది. గతంలో ఆర్డర్లను సకాలంలో పూర్తిచేసిన కార్మికులు వేతన సవరణ బకాయిల కోసం నిరీక్షిస్తున్నారు. ప్రైవేటు పోర్టులు, షిప్‌యార్డ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో తొలి షిప్‌యార్డ్ ఇలాంటి దుస్థితిని ఎదుర్కొనడం ఆవేదన కలిగిస్తోంది. విశాఖ సాగరతీరంలో భారతదేశపు తొలి నౌకా నిర్మాణం కేంద్రం సింధియా స్టీమ్ నావిగేషన్ లిమిటెడ్ నిర్మాణానికి మహారాష్ట్రకు చెందిన శేర్ వాల్‌చంద్ హీరాచంద్ శ్రీకారం చుట్టారు. 1941 జూన్ 21న అప్పటి భారత కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ భూమిపూజ నిర్వహించారు. ఇక్కడ రూపుదిద్దుకున్న తొలి నౌక 'జలఉష'ను స్వాతంత్ర్యా నంతరం తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జలప్రవేశం చేయించారు. ఆ తర్వాత చిన్నచిన్న నౌకల తయారీతో మొదలైన షిప్‌యార్డ్ ప్రస్థానం అంచె లంచెలుగా విస్తరిస్తూ వేల కార్మిక కుటుంబాలకు జీవనా ధారంగా మారింది. 1960వ దశకంలో ఈ సంస్థను జాతికి అంకితంచేసి హిందుస్థాన్ షిప్‌యార్డ్‌గా నామకరణ చేశారు. దేశంలో ఎక్కడాలేని రీతిలో పెద్ద బిల్డింగ్‌డాక్, స్లిప్‌వేస్ ఈ యార్డు సొంతం.

**ఉత్పత్తుల తయారీలో ప్రత్యేకం**

వాణిజ్య నౌకలతో పాటు ప్రయాణికుల రవాణా నౌకల తయారీకి హిందుస్థాన్ షిప్‌యార్డు ప్రత్యేకం. భారతదేశ తీరగస్తీ దళాలకు ఐపీవీల నిర్మాణంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. పోర్టు ట్రస్టులకు అవసరమైన బొలార్డ్ టగ్‌లు, ఓఎన్జీసీకి రిగ్‌లు ఇక్కడ తయారవుతాయి. భారత నౌకాదళానికి చెందిన యుద్ధనౌకలకు మరమ్మతులు, జలాంతర్గాములకు రీఫిట్ పనులను చేస్తారు. నిర్మాణంలో కొంత జాప్యమైనా నాణ్యతలో రాజీ లేకుండా ఉత్పత్తులను అందించడంలో షిప్‌యార్డ్ కార్మికుల నైపుణ్యత ఆదర్శనీయమే. పీఎంవో నియంత్రణలో ప్రతిష్ఠాత్మకంగా ఓఎస్వీ నౌక రూపుదిద్దుకుంటోంది. త్వరలో ఎల్పీడీల తయారీ ఆర్డర్ల కోసం సంస్థ నిరీక్షిస్తోంది.

**ఉద్యోగుల వెతలెన్నో..**

హిందుస్థాన్ షిప్‌యార్డులో విశేష సేవలు అందించిన 2,500 మంది విశ్రాంత ఉద్యోగులకు వేతన బకాయిలు రావాల్సి ఉంది. వీటి కోసం రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొంతకాలంగా ఆందోళన కొనసాగుతున్నాయి. ఎనిమిదేళ్లుగా వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ సంఘం ప్రతినిధులు అనేకసార్లు యాజమాన్యాన్ని కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు. 2009 నుంచి 2011 మార్చి వరకు 27 నెలల వేతన సవరణ బకాయిల్లో ఒక్కో ఉద్యోగికి కనీసం రూ.2 లక్షల వరకు అందాల్సి ఉంది. ఇప్పటివరకు 200 మంది విశ్రాంత ఉద్యోగులు తమ కష్టార్జితాన్ని అనుభవించకుండానే తనువు చాలించినట్లు సమాచారం. 1,200 మంది ఉద్యోగులు లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు మొత్తాల కోసం నిరీక్షిస్తున్నారు. ఇవి కూడా ఒక్కొక్కరికి కనీసం రూ.లక్ష నుంచి గరిష్టంగా రూ.6 లక్షల వరకు రావాల్సి ఉన్నట్టు తెలుస్తోంది. పింఛన్ రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు మాత్రమే రావడంతో ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. జింక్ తరహాలో రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

**ఎల్సీరీస్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ సాధ్యమేనా..**

షిప్‌యార్డులోని ఎల్సీరీస్ ఉద్యోగుల్లో 112 మందిని గతంలో పర్మినెంట్ చేశారు. ఇంకా 312 మంది ఎదురు చూస్తున్నారు. రెండు మూడేళ్లుగా వీరందర్నీ పర్మినెంట్ చేస్తామంటూ యాజమాన్యం, న్యాయం జరుగుతుందని కార్మిక సంఘాల నేతలు భరోసా ఇస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో గడచిన రెండు నెలల నుంచి ఎల్సీరీస్ ఉద్యోగుల వేతనం రూ.18 వేలకు పెంచి చెల్లిస్తున్నారు. పర్మినెంట్ చేస్తామన్న యాజమాన్యం కేవలం వేతనం మాత్రమే పెంచడంపై కార్మికసంఘాలు, ఉద్యోగులు మండిపడుతున్నారు. ఈ పెంపు కూడా 2017 జనవరి 19న పీఎస్‌యూల్లో కాంట్రాక్టు కార్మికులకు కనీసవేతనం రూ.18 వేలు చెల్లించాలన్న ప్రభుత్వ జీవోను నేడు కంపెనీలో అమలుచేస్తున్నారు తప్ప వేతనం పెంపు కాదని కార్మికులు పేర్కొంటున్నారు. షిప్‌యార్డు యాజమాన్యం మాత్రం ఆర్డర్లు వస్తే ఉద్యోగులకు ఆశాజనకంగా ఉంటుందని భరోసా కల్పిస్తోంది.

# చంద్రగిరిలో ఉద్రిక్తత

- పసుపు,కుంకుమ పంపిణీలో వివాదం
- వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ
- ఒకరిపై ఒకరు పరస్పర దాడులు



విశాలాంధ్ర - చంద్రగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన పసుపు కుంకుమ, పెన్షన్ల పంపిణీలో శనివారం చిత్తూరు జిల్లా చంద్రగిరిలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైసీపీ, టీడీపీ కార్యకర్తలు పరస్పరందాడులకు దిగడంతో గందరగోళం నెలకొంది. పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేశారు. చంద్రగిరి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం పసుపు కుంకుమ చెక్కులు, పెన్షన్ల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు మరోపక్క పసుపు, కుంకుమ జాకెట్లు ఇవ్వడానికి వైసీపీ నాయకులు మరో షెల్టర్ సిద్ధం చేశారు. అధికారుల అనుమతితోనే వైసీపీ నాయకులు సిద్ధమయ్యారు. ప్రభుత్వ కార్యక్రమానికి ఎదురుగా ప్రైవేటు కార్యక్రమం నిర్వహించకూడదని, వెంటనే తొలగించాలని చంద్రగిరి ఎంపీడీవో వెంకట నారాయణ, నోడల్ ఆఫీసర్ లక్ష్మి, సీఐ ఈశ్వరయ్యలు వైసీపీ నాయకులను కోరారు. వైసీపీ నేతలు ససేమిరా అనడంతో టీడీపీ నాయకులు ఆ పార్టీకి చెందిన షెల్టర్‌ను తొలగించేందుకు ప్రయత్నించారు. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. టీడీపీ నాయకులు చంద్రబాబు జిందాబాద్ అని, వైసీపీ నాయకులు జైజగన్ అంటూ నినదించారు. మరోసారి టీడీపీ, వైసీపీ నేతలు కొట్టుకున్నారు. డీఎస్పీ వినోద్ కుమార్ పరిస్థితిని అదుపు చేశారు. ఘర్షణలో వైసీపీకి చెందిన ఒంటె శివశంకర్‌రెడ్డి స్వల్ప అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రికి తరలించారు. చెవిరెడ్డి పసుపు కుంకుమ పంపిణీ షెల్టర్ ధ్వంసం చేయడంతో టీడీపీ నాయకులపై వైసీపీ నేతలు విమర్శలు చేశారు. అనంతరం చంద్రగిరి బాలుర కళాశాల ఆవరణంలోనే వైసీపీ నాయకులు మహిళలకు పెద్ద ఎత్తున పసుపు కుంకుమ జాకెట్లు అందజేశారు.


# గోదావరిలో ముగ్గురు గల్లంతు

- పుట్టిన రోజు వేడుకలో విషాదం
- అంతా ఐటీసీ కంపెనీ కార్మికులే
- నాటు పడవలతో గాలింపు



విశాలాంధ్ర - కుక్కునూరు : పశ్చిమ గోదావరిజిల్లా కుక్కునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని బూర్గంపాడు మండలం శ్రీధర వేలేరు గ్రామ పరిధిలో శనివారం గోదావరి నదిలో స్నానానికి దిగిన ముగ్గురు యువకులు గల్లంతు అయ్యాయి. నాటు పడవల సాయంతో ముమ్మర గాలింపు చేపట్టారు. కుకునూరు పోలీసుల కథనం ప్రకారం.. బూర్గంపాడు మండలం రెడ్డిపాలేనికి చెందిన గాది విజయ్‌కుమార్‌రెడ్డి ఐటీసీ కంపెనీలో పని చేస్తున్నారు. శనివారం విజయ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు కావడంతో ఇదే కంపెనీలో పనిచేస్తున్న స్నేహితులైన సారపాక గ్రామానికి చెందిన గాదె పృథ్వీరెడ్డి, బూర్గంపాడు మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన కుందూరు సతీష్‌రెడ్డి, కుందురు శ్రీనివాసరెడ్డి (23), నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన తిరుమలరెడ్డి శివరెడ్డి (24), కారంపూడి దుర్గ శేషు (25) అంతా కలిసి శ్రీధర వేలేరు శివారులో గోదావరి గట్టుకు వెళ్లారు. విజయ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. సరదాగా నదిలో స్నానం చేయడానికి ఆరుగురు దిగారు. నది ప్రవాహం ఉధృతంగా ఉండడంతో కుందురు శ్రీనివాసరెడ్డి, తిరుమలరెడ్డి శివరెడ్డి, కారంపూడి దుర్గాశేషు కొట్టుకుపోయారు. మునిగిపోతూ గట్టిగా కేకలు వేసినా రక్షించేందుకు మిగిలిన ముగ్గురు స్నేహితులు చేసిన ప్రయత్నాలు ఫలితమివ్వలేదు. స్థానికులు కుకునూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గల్లంతైన వారి కోసం నాటు పడవల సాయంతో గాలింపు చేపట్టారు. నీటిలో కొట్టుకు పోయిన యువకుల కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది రాత్రి వరకు గాలింపు కొనసాగించారు.

# ఏయూలో లోక్‌సభ మాజీ స్పీకర్ బాలయోగి స్మారక ప్రసంగం



విశాలాంధ్ర - విశాఖసిటీ : లోక్‌సభ మాజీ స్పీకర్, ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థి జీఎంసీ బాలయోగి స్మారక ప్రసంగాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశారు. స్మారక ప్రసంగం ఏర్పాటు కోసం రూ.6 లక్షలు నిధిని శనివారం ఏయూ సెనేట్ మందిరంలో వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావుకు రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు, మాజీ ఎంపీ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ లోక్‌సభ స్పీకర్‌గా విశేష ప్రతిభ చూపిన జి.ఎం.సి బాలయోగి తన వ్యక్తిత్వంతో మంచి గుర్తింపు పొందారన్నారు. అక్టోబర్ ఒకటో తేదీన ఆయన జయంతి రోజు స్మారక ప్రసంగం ఉంటుందన్నారు. ధర్మనిధి, స్మారక ప్రసంగాలతో వర్సిటీ విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ కోటి రూపాయల ధర్మనిధి ఏర్పాటు చేయాలన్నది తన సంకల్పమన్నారు. ఎనిమిది ధర్మనిధి ప్రసంగాలు ఏర్పాటు చేసిన లక్ష్మీప్రసాద్‌కు ఆచార్య జి.నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాదరావు, పాలక మండలి సభ్యులు ఆచార్య ఎస్.బాబయ్య, రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్ పాల్గొన్నారు. తొలుత బాలయోగి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# 'బుట్టా' సీటు గ్యారంటీ ఎంత?

- చంద్రబాబు నిర్ణయం కోసం తమ్ముళ్ల ఎదురుచూపు
- వైసీపీలోనూ టికెట్ల కుమ్ములాట
- రసవత్తరంగా కర్నూలు జిల్లా రాజకీయం

విశాలాంధ్రబ్యూరో - కర్నూలు : సార్వత్రిక ఎన్నికల సమరానికి సమయం దగ్గర పడుతున్న వేళ కర్నూలు జిల్లాలో రాజకీయాలు కాక పుట్టిస్తున్నాయి. వేగంగా మారు తున్న రాజకీయ సమీకరణలు నేతలకు దడపుట్టిస్తున్నాయి. నాలుగు దశాబ్దాలుగా రాజకీయ వైరమున్న కోట్ల - కేఈ కుటుంబాలు రెండూ సైకిల్‌పై స్వారీకి సిద్ధం కావడంతో తెలుగుతమ్ముళ్ళలో ఆందోళన పట్టుకుంది. కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరికతో తమ పరిస్థితి ఏమిటని కొందరు నాయకులు తలలు పట్టుకుంటున్నట్టు సమాచారం. గత ఎన్నికల్లో రాజకీయాల్లో అడుగుపెట్టిన బుట్టా రేణుక వైసీపీ తరపున ఎన్నికల బరిలో నిలిచి పార్లమెంటు సభ్యురాలిగా విజయం సాధించారు. ఆదోని, పత్తికొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆస్పరి తదితర ప్రాంతాలలో ఆమె సామాజికవర్గం అంతా ఏకం కావడంతో ఆమె పార్లమెంటులో అడుగు పెట్టారు. వైసీపీలో చోటుచేసుకున్న పరిణామాలతో ఆమె టీడీపీ తీర్థం తీసుకున్నారు. పార్టీలో చేరిక సమయంలో కర్నూలు ఎంపీ సీటు ఆమెకు ఇచ్చేందుకు చంద్రబాబు నాయుడు అంగీకరించినట్లు సమాచారం. కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి టీడీపీలో చేరికతో బుట్టారేణుక పార్లమెంటు సీటుపై కారుమేఘాలు కమ్ముకున్నాయి. ఈమెకు ఏవిధంగా న్యాయం చేస్తారనేది చర్చనీయాంశం అయ్యింది. ఎమ్మిగనూరు, కర్నూలు లేదా పాణ్యం శాసనసభ స్థానాల నుంచి రేణుకను పోటీ చేయిస్తారని పుకార్లు వస్తున్నాయి. ఎమ్మిగనూరు, కర్నూలు సిట్టింగ్ ఎమ్మెల్యేలు రంగంలో ఉన్నారు. పాణ్యానికి ప్రస్తుతం ఏరాసు ప్రతాపరెడ్డి ఇన్‌చార్జిగా ఉన్నారు. పాణ్యం సిట్టింగ్ ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి ఉండగా ఇటీవల వైసీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆ స్థానం నుంచి పోటీ చేసేలా ప్రచారం చేసుకుంటున్నారు. పాణ్యం నుంచి తానే పోటీ చేస్తానని ప్రకటిస్తున్నారు. వైసీపీ పాణ్యం సీటు కాటసానికి కేటాయిస్తే మాత్రం గౌరుచరితారెడ్డి టీడీపీలో చేరుతారనే పుకార్లు షికారు చేస్తున్నాయి. కర్నూలు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఎస్వీ మోహన్‌రెడ్డి ఉన్నప్పటికీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ కుమారుడు టీజీ భరత్ నగరంలో పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. రాబోయే ఎన్నికలలో తమకే కర్నూలు సీటు వస్తున్నందున ఆశీర్వదించాలని భరత్ కోరుతున్నారు. చిన్నబాబు నారా లోకేష్ కర్నూలు పర్యటనలో ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎంపీగా బుట్టారేణుకను తిరిగి గెలిపించాలని కోరడంతో వారిద్దరికీ సీట్లు ఖరారు అయినట్లేనని భావించారు. ఈ నేపథ్యంలో సూర్యప్రకాష్‌రెడ్డి సీఎం వద్ద ఆలూరు, డోన్ శాసనసభ స్థానాలు తన కుటుంబానికి ఇవ్వాలని కోరినట్లు ప్రచారం సాగుతోంది. డోన్ నుంచి గత ఎన్నికలలో ఓటమి చెందిన కేఈ ప్రతాప్ నిత్యం ప్రజలతో మమేకమవుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రచారం చేస్తున్నారు. రాబోయే ఎన్నికలలో తానే పోటీ చేస్తానని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆలూరు స్థానం నుంచి కోట్ల సుజాతమ్మ గత ఎన్నికలలో కాంగ్రెస్ తరపున పోటీ చేసి 28 వేల ఓట్లు సాధించారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ వైసీపీ అభ్యర్థిపై స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. కోట్ల టీడీపీలో చేరడంతో సుజాతమ్మ డోన్ లేదా ఆలూరు నుంచి పోటీకి ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తున్నది. కర్నూలు పార్లమెంటు నియోజకవర్గం, డోన్, ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు చంద్రబాబు నిర్ణయంకోసం వేచిచూస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ, వైసీపీలో మరిన్ని వలసలు ఉంటాయనే ప్రచారం సాగుతోంది. మాజీ ఎమ్మెల్యే పాటిల్ నీరజారెడ్డి గత ఎన్నికల నాటి నుంచి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డితో విభేదాల కారణంగా తటస్థంగా ఉంటున్నప్పటికీ సంధ్యాల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి గైర్హాజరు కావడంతో ఆయన టీడీపీలో చేరతారని పుకార్లు వచ్చినా ఆమె పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీడీపీ, వైసీపీలు సీట్ల పంపిణీ చేపడితే భంగపడిన నాయకులు కోరిన స్థానం దక్కని పక్షంలో జనసేన లేదా మరో పార్టీలో చేరే అవకాశం లేకపోలేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఎన్నికల నాటికి ఎవరు ఏ పార్టీలో ఉంటారో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

## గూడూరు మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లపై అట్రాసిటీ కేసు

విశాలాంధ్ర - గూడూరు : నెల్లూరు జిల్లా గూడూరు మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇటీవల కమిషనర్ వై. ఓబులేసును దూషించిన ఘటనలో శుక్రవారం రాత్రి మున్సిపల్ వైస్ ఛైర్మన్ శీలం కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, వాటంబేటి శివకుమార్‌తోపాటు మరికొంత మందిపై గూడూరు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయ్యింది. వన్‌టౌన్ ఎస్ఐ హుస్సేన్ బాషా శనివారం స్టేషనలో అట్రాసిటీ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. నాలుగు రోజుల క్రితం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం అనంతరం తెలుగుదేశం పార్టీకి చెందిన కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించారన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది బయటకెళ్లకుండా అడ్డుకోవడంతోపాటు కార్యాలయ ప్రాంగణంలోని సీసీ కెమేరాలను నిలిపివేశారన్నారు. మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లోకి చొరబడినట్టు తెలిపారు. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపం చెందిన మున్సిపల్ కమిషనర్ ఓబులేసు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఘనంగా ప్రరవే వార్షికోత్సవం

## సిరిపురం నుంచి హిందీభవన్ వరకు 'వాక్ విత్ రైటర్స్'

**విశాలాంధ్ర-విశాఖ సిటీ బ్యూరో :** ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) పదేళ్ల వార్షికోత్సవ సంబరాలు నగరంలో ఘనంగా జరిగాయి. ప్రరవే ఆధ్వర్యంలో శనివారం విశాఖపట్నం ఏయూలోని హిందీశాఖలో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ భవన్‌లో 'సమాలోచన-వార్షిక సదస్సు' జరిగింది. "స్త్రీ అస్తిత్వ చైతన్యం, సాంస్కృతిక సవాళ్లు" అంశంపై పలువురు వక్తలు ప్రసంగించారు. సదస్సుకు ముందు 'వాక్ విత్ రైటర్స్" నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కృష్ణాబాయి, జి.సీతామహాలక్ష్మి, కత్తి పద్మ, అనిల్ డ్యాని ప్రారంభించారు. సిరిపురం నుంచి హిందీభవన్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం ప్రరవే జాతీయ అధ్యక్ష,కార్యదర్శులు జెండా ఆవిష్కరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత అధ్యక్షతన సభ ప్రారంభమైంది. సదస్సు లక్ష్యాలను జాతీయ కార్యదర్శి కేవన్ మల్లీశ్వరి తెలియచేశారు. కె.సతీష్‌చందర్ ప్రారంభోపన్యాసం చేయగా, ముఖ్యఅతిథి జి. కళ్యాణరావు పాల్గొని మాట్లాడారు. అనంతరం బోల్షివిక్స్ సదస్సు పత్రాల పుస్తక ఆవిష్కరణను ఎం. లక్ష్మీ నిర్వహించారు. అరుణాంక్ లత పుస్తక సమీక్షచేశారు. సమన్వయకర్తలుగా డైసీ బెంజిమన్, బేబీ షామిలి వ్యవహరించారు. భోజన విరామం తరువాత మొదటి సమావేశం 'పితృస్వామిక సంప్రదాయాలు- లైంగిక అధిపత్య ధోరణులు' అనే అంశంపై తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ తిరునగరి దేవకీదేవీ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. 'వివక్ష సాంస్కృతిక వ్యక్తీకరణ వ్యవస్థలు, రూపాలు' అంశంపై కొండవీటి సత్యవతి ప్రసంగించారు. 'సింగిల్ విమెన్ జీవితం సామాజిక సాంస్కృతిక సమస్యలు' అంశంపై సజయ, 'లైంగిక దాడులు, వేధింపులు సాంస్కృతికమూలాలు' అంశంపైఇలా బందగీ, 'పితృస్వామిక సంప్రదాయాలు రాజకీయ కోణాలు' అంశంపై ఆచార్య ఎం.నళిని ప్రసంగించగా, సమన్వయకర్తలుగా కొమర్రాజు రామలక్ష్మీ, అమరజ్యోతి వ్యవహరించారు. అనంతరం జరిగిన రెండో సమావేశంలో 'మహిళలు-కుల, మత, జాతి సాంస్కృతిక సవాళ్లు' అంశంపై ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ పుట్ల హేమలత అధ్యక్షతన జరిగింది. 'కుల వ్యవస్థ అంతర బాహ్య సాంస్కృతిక సవాళ్లు' అంశంపై ప్రియాంక, మత వ్యవస్థ-అంతర బాహ్య సాంస్కృతిక సవాళ్లు అంశంపై జహారా, ఆదివాసీ మహిళా-సామాజిక సాంస్కృతిక సవాళ్లపై పద్దం అనసూయ, ప్రత్యామ్నాయ సంస్కృతి నిర్మాణం స్త్రీల నిర్మాణం అంశంపై బి.అనూరాధ ప్రసంగించగా, మందరపు హైమవతి, కొలిపాక శోభారాణి సమన్వయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి6.30 వరకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరసం, విరసం, జనసాహితి, సాహితీ స్రవంతి, వికాసం, మంజీరా రచయితల సంఘం, తెలంగాణ రచయితల సంఘం, ఉత్తరాంధ్ర రచయితల కళాకారుల వేదిక, తెలంగాణ రచయితల వేదిక, సాహితీ మిత్రులు, కథా సాహితి, శ్రీకాకుళ సాహితి, స్నేహా కళా సాహితి, తెలుగు సాహితీ సాంస్కృతిక సంస్థ, యువ స్పందన, కృష్ణా జిల్లా రచయితల సంఘం, మనోజ్ఞ సాహిత్య సాంస్కృతిక అకాడమీ, చైతన్య వేదిక, సహజ సాంస్కృతిక సంస్థ, పెన్నా రచయితల సంఘం, సాహిత్య సురభి, వరంగల్ రచయితల సంఘం, గోదావరి సాహితీ మిత్రులు, శ్రీలేఖ సాహితి, మిత్ర సాహితి, మొజాయిక్ ఫౌండేషన్, స్ఫూర్తి సాహితి సామాఖ్య, ఉటుకూరి లక్ష్మీకాంతమ్మ పీఠం, గుంటూరు జిల్లా రచయితల సంఘం, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పుస్తకాల పురుగులు గ్రూప్, సంస్కృత గ్లోబల్ స్కూల్, ఎమెస్కో, గురదక్షిణ చారిటబుల్ ట్రస్ట్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు ఎ.విమల, అరసం విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చందు సుబ్బారావు, విరియాల గౌతమ్, సభ్యులు పీఏ రాజు, రచయిత పేరిచర్ల లక్ష్మీకాంతమ్మ, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి. రమణమూర్తి, శివలక్ష్మీ పార్వతి, యలవర్తి రాజేంద్రప్రసాద్, మండపాక కామేశ్వరరావు, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.


సదస్సులో ప్రసంగిస్తున్న ప్రరవే జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత




# ఏఐటీయూసీలో130 మంది చేరిక

**విశాలాంధ్ర-అనకాపల్లి:** భవన నిర్మాణంలో పెయింటింగ్ వర్క్ చేస్తున్న 130 మంది కార్మికులు ఏఐటీయూసీ కార్మిక సంఘంలో జిల్లా కార్యదర్శి కోనలక్ష్మణ ఆధ్వర్యంలో చేరారు. వీరికి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎన్.భద్రం లు ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ. భవన నిర్మాణ రంగ కార్మికులు సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం అయిందని అన్నారు. కార్మిక సమస్యలు పరిష్కారించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో కార్మికులు పాల్గొని ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆల్లం శంకర్, బండారు వెంకటేష్, సునీల్,సతీష్, శివ, నానాని, గణేష్, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# చౌకీదారంటేవారికి భయం

- అందుకే గద్దె దించాలంటున్నారు
- బెంగాల్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ
- విపక్షాలపై మోడీ ఎదురుదాడి



**దుర్గాపూర్ :** ప్రధాని నరేంద్రమోడీ పశ్చిమబెంగాల్‌లో శనివారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. వరుస సభల్లో పాల్గొని మమతా బెనర్జీ ప్రభుత్వం, ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేశారు. నాలుగేళ్ల వరకూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకోవడానికి ఇష్టపడని విపక్ష నేతలు ఇప్పుడు ఆలింగనాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీకి వ్యతిరేకంగా మహాకూటమి ఏర్పాటునకు ప్రతిపక్షాలు ప్రయత్నం చేయడాన్ని నిందించారు. అవినీతికి పాల్పడ్డారని విమర్శలు చేసుకుంటూ జైలుకు పంపుతామని పరస్పరం సవాల్ చేసుకున్న నేతలే ఇప్పుడు ఒక్కటవుతున్నారని మోడీ అన్నారు. దుర్గాపూర్‌లో జరిగిన బీజేపీ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. చిట్‌ఫండ్స్ నుంచి రక్షణ ఒప్పందాల వరకూ డబ్బులు దోచుకున్న వారికి...ఈ కాపలాదారుడు ఇష్టముండడని మోడీ వ్యాఖ్యానించారు. 'ఎవరికి వారు విడిపోయిన చాలామంది ఇటీవల కోల్‌కతాలో కలిశారు. వారంతో మోడీని గద్దెదించుతామని ప్రతినబూనారు' అని టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ నిర్వహించిన బ్రిగేడ్ ర్యాలీలో పాల్గొన్న 20 ప్రతిపక్ష పార్టీల నాయకులనుద్దేశించి మోడీ అన్నారు. 'వారి ఫొటోలు చూడండి. వారంతా భయపడిపోతున్నారు. కొంతమంది కొడుకులు, కొంతమంది అల్లుళ్లు, ర్యాలీలో పాల్గొన్నవారిలో చాలామంది తప్పుడు నాయకులే. అయినా వారంతా కోల్‌కతాలో ఒకే వేదికను పంచుకున్నారు' అని ప్రధాని నిందలు వేశారు. 'అవినీతి, బ్లాక్‌మనీని దేశం నుంచి తరిమికొట్టేందుకు మీ చౌకీదారు (కాపలాదారుడు) చర్యలు ప్రారంభించాడు. పన్నుఎగవేత, మోసం కేసుల్లో దేశంలో అత్యంత శక్తివంతమైన, ఘనకీర్తి గల కుటుంబం సైతం కోర్టులు చుట్టూ తిరుగుతోంది' అని గాంధీ కుటుంబాన్ని ఉద్దేశించి ఆరోపణలు చేశారు. 'నేను అవినీతిపై పోరాడుతున్నందునే ప్రతిపక్షాలు భయపడుతున్నాయని చెప్పుకొచ్చారు. ప్రత్యేకించి మమతను లక్ష్యంగా చేసుకొని మోడీ విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలోని మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను మమత ప్రభుత్వం చంపేసిందని అన్నారు. బెంగాల్‌లో విచారణలు చేపట్టకుండా కేంద్ర ప్రభుత్వ అధికారులను మమత అడ్డుకుంటున్నారని ఆరోపించారు. 'దీదీ..మీరు ఏ తప్పు చేయకపోతే ఎందుకు భయపడుతున్నారు? మీ భయానికి కారణమేంటి?' అని ప్రశ్నించారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తనకు వ్యతిరేకంగా దాఖలైన కేసులు ఎదుర్కోవడానికి ఢిల్లీలో తాను 9 గంటలు కూర్చున్నానని, సీబీఐ విచారణను తాను ధైర్యంగా ఎదుర్కొన్నానని చెప్పారు. అప్పుడు యూపీఏ అధికారంలో ఉందని గుర్తుచేశారు. మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలు, కలలు నెరవేర్చడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో టోలబాజీ టాక్స్‌ను వసూలు చేస్తోందని ఆరోపించారు. అంటే నిర్దాక్షిణ్యంగా బెదిరించి దోచుకుంటుందని అన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాల దగ్గర నుంచి విద్యాసంస్థల్లో ఉద్యోగాలు వరకూ అంతా దోపిడీయేనని అన్నారు. ఎవరైతే ట్రిపుల్ టి చెల్లిస్తారో వారి పని అయినట్టేనని అన్నారు. ఇది ఎల్లకాలం కొనసాగదని చెప్పారు. బెంగాల్‌లో ప్రజాస్వామ్యాన్ని మమత ఖూనీ చేసిందని ఆరోపించారు.


మాట్లాడుతున్న ముప్పాళ్ల

# వరికపూడిశెల ప్రాజెక్టు కోసం పోరు

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల
- ప్రాజెక్టు సాధన సమితి నిరసన దీక్ష

**విశాలాంధ్ర-వినుకొండ :** వరికపూడిశెల (దొమ్మర్లగొంది) ప్రాజెక్టు సాధన ఉద్యమంలో సీపీఐ పూర్తి భాగస్వామ్యం వహిస్తుందని ఆ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. గుంటూరు జిల్లా వినుకొండలోని స్థానిక జాషువా కళా ప్రాంగణం ఎదుట శనివారం వరికపూడిశెల ప్రాజెక్టు సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన దీక్ష జరిగింది. దీక్షకు గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోటా నాయక్ అధ్యక్షత వహించారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ముప్పాళ్ల మాట్లాడుతూ ప్రాజెక్టు సాధించే వరకూ విశ్రమించేది లేదని, ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కృష్ణాపరీవాహక ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆందోళనలు చేసి విజయం సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి ఇద్దరు ముఖ్యమంత్రులు శంకుస్థాపనలు చేసినా నేటికీ పనులు ప్రారంభం కాలేదన్నారు. ఈ నెల 5న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో వరికపూడిశెల ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని డిమాండు చేశారు. లేకుంటే 6న జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందన్నారు. ఆరు నెలల్లో గోదావరి జలాలను కృష్ణాడెల్టాకు రప్పించి తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరించామని చెప్పారు. ఏపీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణాంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల్లోపే ప్రాజెక్టు పనులు ప్రారంభించి నిర్మాణం పూర్తి చేయాలన్నారు. వైసీపీ నేత బ్రహ్మనాయుడు మాట్లాడుతూ 1995లోనే ఈ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగినా పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణం జరగలేదని మండిపడ్డారు. తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. మాజీ ఎమ్మెల్యేలు మక్కెన మల్లికార్జునరావు, వీరపనేని యలమందరావు, న్యాయవాది దామర్ల వెంకటేశ్వరరావు, ఎ.మారుతి, విష్ణు పాల్గొన్నారు.

# రైతులు ఇప్పుడు గుర్తొచ్చారా...?

- కార్పొరేట్‌లకు మోడీ ఊడిగం
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



**విశాలాంధ్ర బ్యూరో-కడప :** కేంద్ర బడ్జెట్‌పై సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ విమర్శలు గుప్పించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మోడీ ప్రభుత్వానికి రైతులు, మధ్యతరగతి ప్రజలు కనిపించారా అని నిలదీశారు. నాలుగున్నరేళ్లు మోడీ నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. ఓటమి భయంతో వరాలు కురిపిస్తున్నారని నారాయణ విమర్శించారు. అధికారం చేపట్టిన నాటి నుంచి కార్పొరేట్‌లకు రూ.80 లక్షల కోట్లు దోచిపెట్టిన మోడీ ప్రభుత్వం చివరి రోజుల్లో రైతు జపం చేస్తోందని అన్నారు. కడపలో కామ్రేడ్ ఎన్.శివరామిరెడ్డి సంస్మరణ సభలో పాల్గొనేందుకు వచ్చిన కె.నారాయణ శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం లౌకికవ్యవస్థకు ప్రమాదకారిగా మారిందని అన్నారు. బీజేపీ అధికారంలోకి రాకముందు 2.25 లక్షల కోట్లు నిరర్ధక ఆస్తులుండగా అవి 2017 నాటికి 11 లక్షల కోట్లకు చేరాయన్నారు. బ్యాంకులు దోచుకున్నవారికి మోడీ సర్కారు అండగా నిలిచిందన్నారు. నల్లధనం పైసా వెనక్కి తీసుకురాలేదు. పెద్దనోట్ల రద్దుతో ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశారు. పెద్ద నోట్లరద్దు సంపన్నవర్గాలు, దోపిడీదారులు, ఆర్థిక మోసగాళ్లకు మేలు చేకూర్చిందన్నారు. రైతులకు న్యాయం జరగాలంటే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండు చేశారు. సీబీఐలో అవినీతి పరులకు మోడీ అండగా నిలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రాజ్యాంగబద్ధ వ్యవస్థలను తమ స్వార్థానికి వినియోగించుకుంటున్నారని చెప్పారు. మోడీ ప్రభుత్వాన్ని ఓడించడానికి విపక్షాలు ఏకమయ్యాయని నారాయణ చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రంపై అసెంబ్లీలో నిరసన చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే మొన్నటి వరకూ మోడీతో అంటకాగి ఆయనను పొగిడింది చంద్రబాబే గదా అని అన్నారు. చంద్రబాబు కూడా ఎన్నికల కోసమే సంక్షేమ పథకాల పాట పాడుతున్నారని నారాయణ విమర్శించారు.

### ఆవులపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదా : ఓబులేసు

కేంద్రానికి ఆవులపై గల ప్రేమ ప్రజలపై లేదా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు ప్రశ్నించారు. అసంఘటిత రంగ కార్మికులు 10 కోట్ల మందని కేంద్రం చెబుతోందని, కానీ తమ లెక్కల ప్రకారం 43 కోట్ల మంది ఉన్నారన్నారు. రూ.3 వేలు పెన్షన్ ప్రకటిస్తే... రూ.500 కోట్లు ఎలా సరిపోతాయన్నారు. ఆవుల సంరక్షణకు రూ.750 కోట్లు కేటాయించారన్నారు. రాష్ట్రాలతో సంప్రదించకుండా ఫెడరల్ వ్యవస్థను మోడీ ప్రభుత్వం దెబ్బతీస్తోందని విమర్శించారు. చంద్రబాబు పంచనదుల సంగమంతో సీమను సస్యశ్యామలం చేస్తామంటున్నారని, ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి కాకుండా ఎలా చేస్తారని ప్రశ్నించారు. చిత్తూరు జిల్లా మదనపల్లి, వాయల్పాడులకు నీళ్లు ఇవ్వకుండా కుప్పానికి నీళ్లు తీసుకుపోవడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో సీపీఐ, సీపీఎం, జనసేన, లోక్‌సత్తా, ఆమ్ ఆద్మీ తదితర పార్టీలతో కలిసి ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య, చిత్తూరు జిల్లా కార్యదర్శి రామానాయుడు పాల్గొన్నారు.

# విద్య ప్రైవేటీకరణపై పోరు

## ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా మహాసభలో సుబ్బారావు, రంగన్న పిలుపు



**విశాలాంధ్ర - మదనపల్లె :** విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణపై ఉద్యమం తీవ్రతరం చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ సుబ్బారావు, జి.రంగన్న పిలుపునిచ్చారు. పాలకుల విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి విద్యార్థులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) చిత్తూరు జిల్లా 22వ మహాసభలు శనివారం మదనపల్లెలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణంలో జరిగాయి. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.శశికుమార్ అధ్యక్షత వహించారు. అంతకుముందు బీటీ కళాశాల గ్రౌండ్ నుంచి బెంగళూరు బస్టాండ్, తారకరామా వీధి, బాలికల జూనియర్ కళాశాల మీదుగా జిల్లా పరిషత్ హైస్కూలు వరకు విద్యార్థులు మహాప్రదర్శన నిర్వహించారు. ఎంవీ సుబ్బారావు, జి.రంగన్న సహా ఏపీయూఎస్ఎంఏ జిల్లా ప్రధాన కార్యదర్శి, విశ్వం అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు. బహిరంగ సభలో నాయకులు మాట్లాడుతూ కేంద్రం చివరి బడ్జెట్‌లోనూ ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తామన్న కేంద్ర విద్యాసంస్థల ప్రస్తావన లేకపోవడం దారుణమని నిందించారు. అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీ, విజయనగరంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేసినా నిధులు ఇవ్వలేదని ఆరోపించారు. కడప ఉక్కు పరిశ్రమ, రామాయపట్నం పోర్టు ఊసే లేదన్నారు. రైతులకు గాలం వేసేందుకు ఏడాదికి ఆరు వేలు ఇస్తామని ప్రకటించిందని సుబ్బారావు, రంగన్న చెప్పారు. రైతులు, సామాన్యులు, మధ్యతరగతి వర్గాలన్నింటినీ మోడీ ప్రభుత్వం మోసగించిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థపై దృష్టిపెట్టాలని, పోలవరం, రాజధాని, విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు పరిశ్రమ, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు నిధులు కేటాయించాలని కేంద్రాన్ని డిమాండు చేశారు. రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్పొరేట్ విద్యావ్యవస్థపై పోరాటం తప్పదని హెచ్చరించారు. విద్య కాషాయీకరణలో మోడీ సర్కారు బిజీగా ఉందని నిందించారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి పేర్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఆ హామీలు ఎందుకు అమలు చేయలేకపోయిందని నిలదీశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వలేకపోయినా కొడుకు లోకేష్‌కు మాత్రం ఇచ్చుకున్నారని విమర్శించారు. ప్రత్యేకహోదా, విభజన హామీల సాధనలో బాబు పూర్తిగా విఫలమయ్యారన్నారు. విద్య, వైద్యం, ఉపాధి హక్కుల రక్షణ కోసం 18న ఛలో ఢిల్లీకి రావాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మన్నవరం, శ్రీసిటీ లాంటి సంస్థల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని, టీటీడీ సంస్థల్లో హాస్టల్స్ సీట్లు పెంచాలని, ఎయిడెడ్ కళాశాలల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండు చేశారు. సభలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు చలపతి, మురళి, విష్ణు, ఉదయ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.రవి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి.క్రిష్టప్ప, నియోజకవర్గ కార్యదర్శి సాంబశివ, విజయన్, సురేష్, మదనపల్లె డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పవన్, సుబ్బరాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు మాధవ్, నవీన్, శిల్పా, రోజా, దేవి, కోమల, కౌషిక్, ప్రజానాట్యమండలి కళాకారులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాలు, వివిధ పార్టీల నాయకులు


# ఆర్టీసీ రక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

- సంస్థకు రూ.3,720 కోట్లు కేటాయించాలి
- కార్మికులకు వేతన సవరణ చేయాలి
- 6న జరిగే సమ్మెను జయప్రదం చేయాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

**విశాలాంధ్ర-గుంటూరు :** ఏపీఎస్ ఆర్టీసీని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.హనుమంతరావు అన్నారు. ఏపీఎస్ఆర్టీసీ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో 'ప్రజా రవాణా పరిరక్షణ, ప్రభుత్వ బాధ్యత-కార్మికులకు మెరుగైన వేతన సవరణ' అనే అంశంపై గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో అన్ని ట్రేడ్ యూనియన్లు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం శనివారం జరిగింది. ఈయూ జిల్లా అధ్యక్షులు జీటీ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో హనుమంతరావు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 6 నుంచి కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు చెప్పారు. రెండేళ్లుగా ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణ చేయకుండా నష్టాల పేరుతో ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంబిస్తుందని మండిపడ్డారు. సంస్థ నష్టాలకు కార్మికులు కారణం కాదన్న విషయాన్ని గ్రహించాలన్నారు. 2014లో ఉద్యోగుల సంఖ్య 64 వేలు ఉండగా ప్రస్తుతం 53 వేలకు పడిపోయిందని అన్నారు. నాడు వార్షిక ఆదాయం రూ.3,500 కోట్లు ఉండగా, నేడు రూ.6,500 కోట్లకు చేరిందన్నారు. ఉద్యోగుల సంఖ్య తగ్గుతున్నప్పటికీ ఆదాయం పెరిగిన విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. వేతన సవరణపై ముఖ్యమంత్రి, రవాణామంత్రి, ఆర్టీసీ ఛైర్మన్‌లను పలుసార్లు కలిశామన్నారు. వారి నుంచి సరైన హామీ రాకపోవడంతో తప్పని పరిస్థితిలో సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని వెల్లడించారు. ఆర్టీసీ పరిరక్షణకు ప్రభుత్వం రూ.3720 కోట్లు కేటాయించాలని డిమాండు చేశారు. మూడు రోజులలో ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రానిపక్షంలో సమ్మె తప్పదని, సమ్మెకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా, కార్మికసంఘాలు, ప్రజలు సహకరించాలని కోరారు. సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల కోర్కెలు న్యాయమైనవన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వరాల జల్లు కురిపిస్తున్న ప్రభుత్వాలు ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యాయని మండిపడ్డారు. ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మెకు సీపీఐ మద్దతిస్తుందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను కార్మికవర్గం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి డీవీ స్వామి మాట్లాడుతూ గత్యంతరం లేకే సమ్మెపై నిర్ణయం తీసుకున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలే ఆర్టీసీ నష్టాలకు కారణమన్నారు. సంపద సృష్టించే కార్మికులకు వేతనాలు పెంచడానికి చేతులు రావడం లేదని విమర్శించారు. సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జోసఫ్ సుధీర్‌బాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎం.కోటేశ్వరరావు, బి.కోటేశ్వరరావు, జోనల్ ఛైర్మన్ ఎన్‌వీకే రావు, జిల్లా కార్యదర్శి ఎం.సత్యనారాయణ, కోశాధికారి ఏ.ప్రసాద రావు, కార్మిక పరిషత్ జిల్లా కార్యదర్శి రాజేష్, వైఎస్సార్‌సీపీ మజ్దూర్ జిల్లా అధ్యక్షులు జిలాని, ఎల్ఐసీ యూనియన్ జిల్లా నాయకులు సురేష్, ప్రోగ్రెసివ్ ఫోరం జిల్లా నాయకులు మురళీకృష్ణ, ఏఐటీయూసీ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల అంజిబాబు, ఏ.అరుణ్‌కుమార్, సీఐటీయూ నగర కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# జయరామ్ హత్యకేసులో పురోగతి

- మేనకోడలు శిఖా చౌదరి, రాకేష్‌రెడ్డి కీలకం
- పోలీసుల అదుపులో ఏడుగురు అనుమానితులు
- కొద్ది గంటల్లోనే తేలనున్న కేసు మిస్టరీ
- చాలెంజ్‌గా తీసుకున్న కృష్ణా ఎస్పీ త్రిపాఠి



**విశాలాంధ్ర - నందిగామ/హైదరాబాద్ :** ఎన్ఆర్ఐ, కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్, ఎక్స్‌ప్రెస్ టీవి మాజీ ఎండీ చిగురుపాటి జయరామ్ (55) హత్యకేసులో పోలీసులు పురోగతిని సాధించారు. కొద్ది గంటల్లోనే నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టేందుకు కృష్ణాజిల్లా నందిగామ పోలీసులు కసరత్తు చేస్తున్నారు. ఈ కేసును ఎస్పీ త్రిపాఠి చాలెంజ్‌గా తీసుకున్నారు. హత్య కేసులో కీలకంగా భావిస్తున్న జయరామ్ మేనకోడలు పులవర్తి మాధురి అలియాస్ శిఖా చౌదరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నందిగామ డీఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ త్రిపాఠి, డీఎస్పీ బోస్, సీఐ రమణ విచారణ చేస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే నాలుగు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగగా, విచారణలో కీలక విషయాలను పోలీసులు రాబట్టినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి హైదరాబాద్‌లోని పలువురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. పది రోజులుగా హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో ఉంటున్న జయరామ్‌తో మరో వ్యక్తి ఉన్నట్లు తేలింది. ఇప్పటికే సీసీ ఫుటేజ్‌ని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఆ వ్యక్తి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. హత్యకేసులో ప్రధాన నిందితురాలిగా భావిస్తున్న మేనకోడలు శిఖా చౌదరితోపాటు ఆమె చెల్లెలు మనీష చౌదరి, స్నేహితులు రాకేష్‌రెడ్డి, శ్రీకాంత్, కారు డ్రైవర్ శ్రీరామ్, జయరామ్ సోదరి సుశీల, కారు డ్రైవరు సతీష్‌ను అదుపులోకి తీసుకుని వేర్వేరుగా విచారణ చేస్తున్నారు. జయరామ్‌పై విషప్రయోగం చేసి హత్య చేసినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైనట్లు తెలిసింది. దీనిని మరింత రూఢీ చేసుకునేందుకు కీలక భాగాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు.

### ఆర్థిక లావాదేవీలే కారణమా...

జయరామ్ హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. దర్యాప్తులో భాగంగా నందిగామ పోలీసులు జూబ్లీహిల్స్‌లోని జయరామ్ ఇంట్లో సీసీ పుటేజ్‌ను స్వాధీనం చేసుకున్నారు. జయరామ్‌ను హైదరాబాద్‌లోనే హత్య చేశారని పోలీసులు అనుమానిస్తున్నారు. జయరామ్ హత్య తర్వాత ఆయన ఇంటికి తన మేనకోడలు శిఖాచౌదరి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. వాచ్‌మన్ అడ్డగించినా ఇంట్లోకి బలవంతంగా వెళ్లి, గదిలో అల్మారాను తెరిచేందుకు యత్నిస్తుండగా ఫోన్‌కాల్ రావడంతో హడావుడిగా వెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలింది. శిఖా చౌదరికి రాఖేష్‌రెడ్డి అనే వ్యక్తి రూ.4.50 కోట్లు అప్పు ఇవ్వగా దానిని జయరామ్ తీర్చినట్లు సమాచారం. ఈ విషయంపై రెండేళ్లగా శిఖా చౌదరి, రాఖేష్‌రెడ్డి, జయరామ్ మధ్య వివాదం జరుగుతుందని తెలిసింది. జగ్గయ్యపేట మండలం, చిల్లకల్లు వద్ద జయరామ్‌కు చెందిన 10 ఎకరాలను శిఖా చౌదరి పేరిట జయరామ్ రిజిస్ట్రేషన్ చేసి పత్రాలను తనవద్దే ఉంచుకున్నడు పలు కంపెనీలలో శిఖా చౌదరి మేజర్ షేర్ హోల్డర్‌గా ఉన్నట్లు పోలీసులకు కీలక సమాచారం అందింది. ఈ నేపథ్యంలో జయరామ్ భార్య పద్మశ్రీకి పోలీసులు ఫోన్‌చేసి అడుగగా ఆమె కూడా ఆమెపైనే అనుమానం వ్యక్తం చేసినట్లు తెలిసింది. రాకేష్‌రెడ్డి, శ్రీకాంత్, శేఖర్‌రెడ్డితో ఉన్న సంబంధాలపై కూడా ఆరా తీస్తున్నారు.

### ఎంపీ సోదరుడుపైనా అనుమానాలు

సంచలనం కలిగిన జయరామ్ హత్య కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక ఎంపీ సోదరుడు పాత్ర ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో జయరామ్‌తో కలసి వ్యాపారం చేసిన అతను, ప్రస్తుతం విడిగా వ్యాపారం చేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఇద్దరు వ్యాపారులను పోలీసులు విచారణ చేస్తున్నారు. గతంలో ఎక్స్‌ప్రెస్ చానల్ నిర్వహణ సమయంలో ఆర్థిక లావాదేవీలపైనా పోలీసులు దృష్టి సారించారు.

### అంత్యక్రియలు ఆలస్యం

జయరామ్ అంత్యక్రియలు మరికొద్దిరోజుల పాటు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. అమెరికా నుంచి భార్య, పిల్లలు రావాల్సి ఉంది. పొగమంచు కారణంగా భారత్‌కు వచ్చే విమానాలు నిలిచిపోయాయి. దీంతో వారు వచ్చేందుకు రెండు రోజుల సమయం పడుతుందని బంధువులు తెలిపారు. జయరామ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అతని మేనమామ గుత్తా పిచ్చయ్య చౌదరికి అప్పగించారు. జయరామ్ మృతదేహం ప్రస్తుతం హైదరాబాదులోని బసవతారకం కేన్సర్ ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచారు.

# కాంగ్రెస్‌లోకి రిషిమిత్ర జంప్

**పాట్నా :** బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ పార్టీ (జేడీయూ)ను వీడి రిషి మిత్రా కాంగ్రెస్‌లోకి వెళ్లారు. సీఎం బీజేపీతో మిత్రత్వం నడపడం తనకు కష్టంగా మారిందని అందువల్లే పార్టీ మారుతున్నానన్నారు. రిషి తాత లలిత్ నారాయణ్ మిశ్రా 1970లో కాంగ్రెస్‌లో అతిపెద్ద నాయకుడు. రిషిని పార్టీలో చేర్చుకుంటున్నామని బీహార్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (బీపీసీసీ) మదన్ మోహన్ ఝా తెలిపారు. ఆయన తన సొంత గూటికి చేరుకోవడం ఆనందం కలిగిస్తుందన్నారు.

# విజయంతో ముగిస్తారా..!



- భారత్-న్యూజిలాండ్ మధ్య ఆఖరి వన్డే నేడు
- గెలుపుతో ముగించాలని టీమిండియా
- అడ్డుకోవాలని చూస్తున్న కివీస్
- ధోనీ ఫిట్...ఆడే అవకాశం

వెల్లింగ్టన్ : వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత్‌కు న్యూజిలాండ్ నాలుగో వన్డేలో గట్టి షాకే ఇచ్చింది. కోహ్లి, ధోనీ జట్టులో లేని తరుణంలో హామిల్టన్ పిచ్‌ను సరిగ్గా ఉపయోగించుకుని స్వింగ్ బౌలింగ్‌తో టీమిండియాను ఓ ఆటాడుకుంది. సిరీస్ గెలిచేశామన్న ధీమాతోనో ఏమో టీమిండియా కూడా పేలవ షాట్ సెలక్షన్‌తో మూల్యం చెల్లించుకుంది. సిరీస్ కోల్పోయినా భారత్‌కు పుంజుకునే అవకాశం ఇవ్వకుండా ఐదో మ్యాచ్‌లోనూ ఆధిపత్యం చూపేందుకు కివీస్ సిద్ధమవుతుండగా..రోహిత్ సేన విజయంతో సిరీస్ ముగించేందుకు సాధన చేస్తున్న వేళ వెల్లింగ్టన్‌లో నేడు సిరీస్ చివరి మ్యాచ్ జరుగనుంది. మూడు, నిలుగు వన్డేలకు గాయం కారణంగా దూరమైన ధోనీ తిరిగి ఫిట్‌నెస్ సాధించాడని బ్యాటింగ్ కోచ్ బంగర్ తెలుపడంతో, ధోనీ చివరి మ్యాచ్‌లో ఆడేది ఖాయంగానే కనిపిస్తుంది. ప్రపంచ కప్ సన్నాహంగా సిరీస్‌ను పరిగణిస్తున్న వేళ దినేష్ కార్తిక్ జట్టులోకి తీసుకుంటే శుబ్‌మన్ గిల్‌కు మరో అవకాశం ఉండకపోవచ్చు. మరోసారి మిడిలార్డర్ వైఫల్యం జట్టు మేనేజ్‌మెంట్‌ను కలవరపెట్టే విషయమే. మిరి చివరి మ్యాచ్‌లో రాయుడు, జాదవ్‌ల ఆటతీరు ఏలా ఉండనుందో చూడాలి. స్వయంగా కెప్టెన్ రోహిత్ నాలుగో వన్డేలో బ్యాట్స్‌మెన్ ప్రదర్శనపై పెదవి విరవడంతో...రోహిత్ ఈ మ్యాచ్‌లో శిఖర్‌తో కలిసి కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. పాండ్య ప్రదర్శన బౌలింగ్‌లోనూ, బ్యాటింగ్‌లోనూ కీలకం కానుంది. త్వరలో టీ20 సిరీస్ ఉన్న కారణంగా భువీకి విశ్రాంతినిస్తే..షమీ జట్టులో చేరే అవకాశం ఉంది. ఖలీల్ గత మ్యాచ్చుల్లో విఫలం కావడంతో మేనేజ్‌మెంట్ సిరాజ్‌ను ప్రయోగించవచ్చు. స్పిన్ ద్వయం చాహల్, కుల్దీప్‌లు బౌలింగ్ విభాగంలో కీలకం కానున్నారు. సిరీస్ కోల్పోయినా పట్టుదలతో ఆడిన న్యూజిలాండ్ నాలుగో వన్డేను ఏకపక్షంగా గెలుచుకుంది. అదే జోరును టీ20 సిరీస్‌కు వెళ్లేముందు కొనసాగించాలని చూస్తుండవచ్చు. నాలుగో మ్యాచ్‌లో కివీస్ టాపార్డర్‌లో మార్పులు చేసింది. విఫలమవుతున్న మన్రోను తప్పించి నికోల్స్‌ను ఓపెనింగ్‌కు పంపి మంచి ఫలితాన్నే రాబట్టింది. గాయం కారణంగా గప్టిల్ మ్యాచ్‌కు దూరం కావడంతో మన్రో తిరిగి జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. కేన్ విలయమ్సన్, రాస్ టేలర్ మంచి ఫాంలో ఉండడం న్యూజిలాండ్‌కు కలిసి వచ్చేదే. ఇక బౌలింగ్ విషయంలో కివీస్ భారత్ కంటే బలంగా కనిపిస్తుంది. నాలుగో వన్డేలో భారత వెన్ను విరిచిన బౌల్ట్‌ను టీమిండియా ఎలా ఎదుర్కుంటుంతో చూడాలి. ఆల్ రౌండర్ గ్రాండ్ హోమీ గత మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసి మంచి ప్రదర్శనే చేశాడు. నీషమ్, స్పిన్నర్ ఆస్టల్ కూడా భారత బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టారు. ఇటువంటి పరిస్థితుల్లో భారత్ గెలవాలంటే శ్రమించక తప్పదు. వెల్లింగ్టన్‌లోని వెస్ట్‌పాక్ స్టేడియం పిచ్ నుంచి మంచి బౌన్స్ వచ్చే వీలుండడంతో తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు భారీ స్కోరు చేసే అవకాశం ఉంది. స్పిన్నర్లు రాణించవచ్చు. ఏది ఏమైనా టీమిండియా విజయంతో సిరీస్‌ను ముగిస్తుందో లేదో చూడాలి.





## 24న విశాఖలో టీ 20

### 4న ఆన్‌లైన్, 15న ఆఫ్‌లైన్లలో టిక్కెట్ల విక్రయాలు

విశాలాంధ్ర-విశాఖ సిటీ బ్యూరో : ఇండియా, ఆస్ట్రేలియా మొదటి టీ 20 మ్యాచ్ విశాఖలో గల పీఎంపాలెం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఈ నెల 24న జరగనుందని మీడియా మేనేజర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం బీసీసీఐ విడుదల చేసిన ఆ ప్రకటనలో టీ 20మ్యాచ్‌లను ఒకటి విశాఖలో మరొకటి బెంగుళూర్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 24న జరిగే మ్యాచ్‌కు ఏర్పాట్లుచేయనున్నామన్నారు. ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 4న ఉదయం 8 నుంచి టిక్కెట్ల విక్రయాలు ప్రారంభమవుతాయని, ఆఫ్‌లైన్‌లో విశాఖలో పది కేంద్రాల్లో ఫిబ్రవరి 15న ఉదయం 11 గంటలకు టిక్కెట్ల విక్రయాలు జరుగుతాయని తెలిపారు. అయితే ఈ నెల 27న మ్యాచ్, క్రికెట్ల విక్రయాలు 2వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో విక్రయాలు జరుగుతాయని ప్రకటించిన నేపథ్యంలో అనంతరం ఈ తేదీలలో మార్పులు జరిగినట్లు చెప్పారు. ఈ తేదీల మార్పును గమనించగలరని సూచించారు. టిక్కెట్ల ధరలు రూ.500, రూ.1200, రూ.1600, రూ.2000, రూ.4000, రూ. 5000గా నిర్ణయించినట్లు తెలిపారు.

## ఆస్ట్రేలియా 534/5 డిక్లేర్

### కరుణరత్నేకు గాయం



కాన్‌బెర్రా : ఆస్ట్రేలియా-శ్రీలంక మధ్య జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా క్రమంగా పట్టు బిగేస్తుంది. తొలి రోజు నాలుగు వికెట్ల నష్టాలనికి 384 పరుగులు చేసిన ఆసీస్ రెండో రోజు ఆటలో 5 వికెట్లు కోల్పోయి 534 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తొలి రోజు ఆటలో 172 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచిన ఓపెనర్ బర్న్స్ మరో 8 పరుగులు మాత్రమే జోడించి 180 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటై డబుల్ సెంచరీని అందుకోలేకపోయాడు. బర్న్స్ వెనుదిరిగిన తరువాత పాటర్‌సన్‌తో టిమ్ పేన్ జతకలవడంతో నెమ్మదిగా జట్టు స్కోరును ముందుకు సాగింది. ఈ క్రమంలో పాటర్‌సన్ (114 నాటౌట్) సెంచరీ పూర్తిచేసుకోగా, కెప్టెన్ టిమ్ పేన్ (45 నాటౌట్)గా నిలిచాడు. జట్టు స్కోరు 534 చేరుకోగానే ఆసీస్ డిక్లేర్ చేసింది.

**కరుణరత్నేకు గాయం..తప్పిన ప్రమాదం..**

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన అనంతరం తొలి ఇన్నింగ్స్ మొదలు పెట్టిని శ్రీలంకకు ఓపెనర్లు కరుణరత్నే, తిరుమానే మంచి ఆరంభాన్ని ఇచ్చారు. ఈ క్రమంలో జట్టు స్కోరు 80 పరుగుల వద్ద, కరుణదత్నే (46) గాయపడి రిటైడ్‌హట్ అయ్యాడు. ఆసీస్ సీమర్ పాట్ కమిన్స్ వేసిన బౌన్సర్‌ను తప్పించుకోబోయి కిందకి వంగిన కరుణరత్నేకు ఆ బంతి మెడపై భాగాన్ని తాకింది. దీంతో కరుణరత్నే కుప్పకూలిపోయాడు. జట్టు ఫిజియో వచ్చి వైద్యం చేసినా లాభం లేకపోవడంతో అంపైర్లు స్ట్రెక్చర్ తెప్పించి హాస్పిటల్‌కు తరలించారు. కురణరత్నేకు ప్రమాదం తప్పినట్లు, అతడు బాగేనే ఉన్నట్లు, అంపైర్లు, రిఫరీతో మాట్లాడినుట్ల లంక కోచ్ చండిక హతురసింగె తెలుపడంతో అందరూ ఊపిరా పీల్చుకున్నారు. ఆట ముగిసే సమయానికి శ్రీలంక మూడు వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. తిరుమానే(41), చిండిమాల్ (15), మెండిస్ (6) పరుగులకు ఔటైయ్యారు. పెరీరా (11), డి సిల్వా (1) క్రీజులో ఉన్నారు.

## స్మృతి నెంబర్ 1

### ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్ ప్రకటన



ముంబై : భారత మహిళల క్రికెట్ జట్టు ఓపెనర్ స్మృతి మంధాన కెరీర్‌లో అరుదైన ఘనత సాధించింది. ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన నం.1 స్థానంలో నిలిచింది. కివీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో స్మృతి ఆతిథ్య జట్టుపై భారీ స్కోరులతో అదరగొట్టింది. దీంతో మూడు స్థానాలు ఎగబాకి మొదటి స్థానాన్ని అందుకుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా మొదటి వన్డేలో 105, రెండో వన్డేలో 90 పరుగులు చేసి అమ్మాయిల జట్టు సిరీస్ కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించింది. 2018 నుంచి ఇప్పటివరకూ 15 వన్డేలు ఆడిన స్మృతి మంధాన రెండు సెంచరీలు 8 అర్ధ శతకాలు నమోదుచేసింది. మరో బ్యాట్స్‌వుమెన్ జెమీమా రోడ్రిగ్జ్ తొలి వన్డే 81 పరుగులు చేసి ఆకట్టుకుంది. దీంతో తాజా ర్యాంకింగ్స్‌లో 64 స్థానం నుంచి 61 స్థానానికి ఎగబాకింది. గతేడాది మార్చిలో అరంగ్రేటం చేసిన జెమీమా ఇప్పటికి కేవలం ఏడు వన్డేలు మాత్రమే ఆడింది. అయితే భారత వన్డే కెప్టెన్ మిథాలీ రాజ్ ఒక స్థానం కోల్పోయి 5వ స్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియాకు చెందిన ఎల్సీ పెర్రీ, మెగ్ లాన్నింగ్ రెండు, మూడు స్థాన్నాల్లో నిలవగా..న్యూజిలాండ్ కెప్టెన్ ఆమీ సెట్టర్త్‌వైట్ మిథాలీని వెన్నకు నెట్టి నాలుగో ర్యాంకు అందుకుంది. బౌలింగ్ విభాగంలో స్పిన్నర్లు పూనమ్ యాదవ్, దీప్తి శర్మ ఐదు స్థానాలు మెరుగు పరుచుకుని ఎనిమిది, తొమ్మిది స్థానాల్లో నిలిచారు. కివీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో పూనమ్ ఆరు వికెట్లు తీయగా, దీప్తి నాలుగు వికెట్లు పడగొట్టింది. ఏక్తా బిస్త్ 13 స్థానాన్ని కైవసం చేసుకుంది. రెండో వన్డేలో మూడు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఝులన్ గోస్వామి ఈ జాబితాలో నాలుగో స్థానంలో నిలిచింది. టాప్-5 మంది బౌలర్లలో నిలిచిన ఏకైక టీమిండియా బౌలర్ ఝులనే కావడం విశేషం.



## కాలేజ్ బోర్డుతో గీతం అవగాహనా ఒప్పందం

### 185 దేశాల విద్యార్థులకు గీతంలో అవకాశం

విశాలాంధ్ర-మధురవాడ: ప్రపంచవ్యాప్తంగా 185 దేశాలలో గల 41 వేల సెకండరీ పాఠశాల సభ్యులుగా గల అంతర్జాతీయ సంస్థ కాలేజ్ బోర్డుతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శనివారం అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇంటర్మీడియట్ స్థాయి విద్యను పూర్తి చేసుకుని అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రవేశం పొందా లనుకునే వారికి "కాలేజీ బోర్డు "శాట్ (స్కాలస్టిక్ ఎస్సెస్ మెంట్ టస్ట్) పేరిట అంతర్జాతీయ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తోంది. శాట్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్నత మేథస్సు గల విద్యార్థులను ఎంపిక చేసి ఆసక్తి గల విశ్వవిద్యాలయంలో నేరుగా నచ్చిన కోర్సులో ప్రవేశం పొందే అవకాశం కల్పిస్తున్నారు. అయితే దీనికి సంబంధిత విశ్వవిద్యాలయాల ముం దుగా తమ సమ్మతిని తెలియజేయాల్సి ఉంటుంది. అసమ్మతిలో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కాలేజ్ బోర్డు మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది.ఈ సందర్భంగా గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామ కృష్ణ సమక్షంలో కాలేజ్ బోర్డు అంతర్జాతీయ ఉపాధ్యక్షురాలు (న్యూయార్క్ ) లిండాలూ, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కాలేజ్ బోర్డు ఉపాధ్యక్షురాలు లిండాలూ మాట్లాడుతూ వివిధ దేశాలతో పాటు భారత దేశం లోని విశ్వవిద్యాలయాలు కాలేజి బోర్డు నిర్వహించే 'శాట్" పరీక్ష స్కోరు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నా యన్నారు. భారత దేశంలో దేశంలో 40 పట్టణాలలో 70 శాట్ పరీక్షా కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. శాట్ పరీక్ష రాసే విద్యార్థులలో ఆర్థికంగా వెనకబడిన వారికి 1600 మార్కులకు గాను 1350 మార్కులు సాధించిన వారికి ఈ ఏడాది నుంచి 'ఇండియా' స్కాలర్స్ ప్రోగ్రామ్' ప్రారంభిస్తున్నట్లు ఆమె ప్రకటిం చారు. కాలేజ్ బోర్డులో సభ్యత్వం గల విశ్వ విద్యాలయాలలో ఉచిత విద్యతో పాటు విద్యార్థులకు ఈ స్కాలర్ షిప్‌ను అందజే స్తామన్నారు. గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామ కృష్ణ మాట్లాడుతూ 'శాట్'ద్వారా వచ్చే 185 దేశాలకు చెందిన విద్యార్థులకు వారి ఆసక్తిని బట్టి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖ, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. భారత ప్రభుత్వ మానవ వనరుల మంత్రిత్వశాఖ గీతం పాటిస్తున్న ఉన్నత విద్యా ప్రమాణాలకు గాను 'స్వయం ప్రతిపత్తి' హెూదాను కల్పించగా, జతీయ విద్యా ప్రమాణాల సంస్థ నాక్ ఎ+ గ్రేడ్‌తో అభినందించిందన్నారు. గీతంలో ప్రవేశానికి ఇప్పటికే పలు దేశాల నుంచి విద్యార్థులు ఆసక్తి కనబరుస్తూ ఉండటంతో ప్రత్యే కంగా అంతర్జాతీయ విద్యార్థి విభాగాన్ని ప్రారంభిం చామని తెలిపారు. కాగా కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్, స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ అనితారావు,స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ గౌతమ్‌రావు, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కనకలక్ష్మీ, స్కూల్ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ ఇన్‌ఛార్జి డైరక్టర్ డాక్టర్ బి.నళిని, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డిప్యూటీ డైరక్టర్ కృష్ణ కాశీ,ఫిన్‌టెక్ అకాడమీ డైరక్టర్ లెబిన్ జాన్సన్, కాలేజి బోర్డు భారతీయ వ్యవహారాల అధిపతి కునాల్‌మెహ్రా పాల్గొన్నారు.



## మిడిలార్డర్ రాణిస్తారు : బంగర్

వెల్లింగ్టన్ : న్యూజిలాండ్ సిరీస్‌లోని నాలుగో వన్డేలో మిడిలార్డర్ వైఫల్యం కారణంగా భారత్ దారుణ పరాజయం పొందిన విషయం తెలిసిందే. అయితే టీమిండియా బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ మిడిలార్డర్‌ను సమర్థించుకు న్నాడు. ఐదవ వన్డే ముందు మీడియాతో మాట్లాడుతూ 'హామిల్టన్ వన్డేలో భారత మిడిలార్డర్ ప్రదర్శన అనుకోని సంఘటన. వారు పూర్తిగా విఫమ మైయ్యారు. అయితే ఎన్నో సందర్భాలో వారు జట్టుకు అండగా నిలిచారు, మెరుగైన ప్రదర్శన చేశారు. కీలక సమయాల్లో వారు నిలబడి జట్టను గెలిపించారు. టాప్ ఆర్డర్ రాణించినప్పుడు వారికి ఆడడానికి అంతగా అవకాశం రాదు. ఈ సిరీస్‌లో టాప్ ఆర్డర్‌లో ముగ్గురు బ్యాట్స్‌మెన్ సెంచరీలు చేయలేదు. అందుకే తొలి మూడు మ్యాచుల్లో మిడిలార్డర్‌కు ఆడే అవకాశం వచ్చింది. దాన్ని సద్వినియోగం చేసుకొని మ్యాచ్‌లను గెలిపించారు. నాలుగో వన్డే ఫలితాన్ని ఊహించలేదు. ఆటగాళ్లు నేర్చుకున్నారు. ఆ ఫలితాన్ని పక్కన పెట్టి ఆఖరి మ్యాచ్‌లో రాణించడానికి సిద్ధంగా ఉన్నాం' అని బంగర్ అన్నాడు.

## భారత్ నిష్క్రమణ

### 1-3 తేడాతో ఇటలీ చేతిలో ఓటమి



కోల్‌కతా : డేవిస్ కప్ నుంచి భారత్ నిష్క్రమించింది. వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌లో ఇటలీ చేతిలో 1-3 తేడాతో ఓటిమి చెందడంతో భారత్ డేవిస్ కప్‌కు దూరమైంది. బలమైన ఇటలీ ముందు సింగిల్స్ మ్యాచుల్లో భారత్ తేలిపోయింది. తొలి రోజు రెండు సింగిల్స్ మ్యాచుల్లో భారత్ ఓడిన విషయం తెలిసిందే. తప్పక గెలవాల్సిన డబుల్స్ మ్యాచ్‌లో భారత స్టార్ డబుల్స్ జోడీ రోహన్ బొప్పన్న-దివిజ్ శరన్‌లు గెలిచి ఆశలు సజీవంగా నిలిపారు. అయితే రివర్స్ సింగిల్స్ తొలి మ్యాచ్‌లోనే ప్రజ్నేశ్ ఓటమి పాలవడంతో 1-3 తేడాతో భారత కథ ముగిసింది. బొప్పన్న-దివిజ్‌ల జోడీ ఇటలీ జోడి బెర్రెటినీ-సిమోనిపై 6-4, 6-3, 6-4 తేడాతో విజయం సాధించారు. భారత జోడీ తొలి సోట్‌లో ఓటమి పాలైనా పుంజుకుని మూడు నాలుగు సెట్‌లను వరుసగా గెలుచుకుని మ్యాచ్‌ను సొంతం చేసుకున్నారు. ఈ విజయంతో ఇరు జట్ల మధ్య వ్యత్యాసం 2-1కు చేరింది. రివర్స్ సింగిల్స్‌లో తొలి మ్యాచ్‌లో ప్రజ్నేశ్ 1-6, 4-6 తేడాతో ఆండ్రియాస్ సిప్పీ చేతిలో ఓడాడు. దీంతో ఇటలీ 1-3 తేడాతో విజయం అందుకుంది. ఫలితం తేలడంతో రెండో సింగిల్స్ మ్యాచ్ జరుగలేదు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.